


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూరి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-5-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 109 పేజీలు: 10+4 వెల: 6.50



హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలో విద్యార్థి ఆత్మహత్య 2

ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు పొడిగింపు 5


## వీధి కుక్కలను తరలించాల్సిందే!

గతంలో ఇచ్చిన ఆదేశాలను సవరించడానికి సుప్రీం కోర్టు నిరాకరణ

ప్రమాదకరమైన కుక్కలకు కారుణ్య మరణానికి అనుమతి



2

## పెను ఆర్థిక తుఫాను వస్తోంది!

పశ్చిమాసియా ఘర్షణలతో చమురు, ఎరువులకు తీవ్ర కొరత

సామాన్య ప్రజలను కాపాడటంలో మోడీ విఫలం

పొదుపు పాటించాలని చెబుతూ ప్రధాని విదేశీ టూర్లు ఏంటి?

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మండిపాటు



5

### కోటాను కోట్లు స్వాహా!

## ఎసిబి వలలో లంచావతారం

రూ.100 కోట్లుపైగా అక్రమాస్తుల గుర్తింపు

మల్లాపూర్‌లోని ఇంట్లో రూ.1.10 కోట్ల నగదు, భారీగా బంగారం, వెండి లభ్యం

బ్యాంకు లాకర్లలోని కీలక పత్రాల జప్తు



ఇంజినీరింగ్ జిఎం సగ్గం అనంత లక్ష్మీకుమార్ | ఎసిబి సోదాల్లో చిక్కిన నగదు, బంగారం

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో మరో బడా అవినీతి అధికారి ఎసిబికి దొరికిపోయాడు. వాటర్ వర్క్స్ బోర్డు ప్రాజెక్టు విభాగంలో ఇంజినీరింగ్ జనరల్ మేనేజర్‌గా వున్న సగ్గం అనంత లక్ష్మీ కుమార్ (58)ను ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో ఎసిబి అధి కారులు మంగళవారం అరెస్టు చేశారు. నగరంలోని రెడ్‌హిల్స్‌లో గల వాటర్ వర్క్స్ ప్రాజెక్టు విభాగంలో చాలా కాలంగా ఇంజినీరింగ్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న అనంత లక్ష్మీ కుమార్‌పై అవినీతి ఆరోపణలు వున్నాయి. వాటర్ వర్క్స్ విభాగం జంట నగరాలతో పాటు శివార్లలో నీటి సరఫరా, మురుగునీటి పారుదలకు సంబంధించి చేబడుతున్న కోట్లాది రూపాయల భారీ ప్రాజెక్టులకు సంబంధించిన అనేక పనులను అనంత లక్ష్మీ కుమార్ పర్యవేక్షిస్తున్నారు. ఈయన సంతకం పెడితే కానీ చాలా ఫైళ్లు ముందుకు >>2



## మళ్లీ పెట్రో షాక్

పెట్రోలు, డీజిల్‌పై రూ.90 పైసలు పెంపు

హైదరాబాద్‌లో పెట్రోలు రూ.110.88, డీజిల్ రూ.98.99

విజయవాడలో పెట్రోలు రూ.113.88, డీజిల్ రూ.101.57

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా పెట్రోలు, డీజిల్ ధరలు మరోసారి పెరిగాయి. దీంతో వాహనదారులకు మరోసారి భారీ షాక్ తగిలింది. ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్ సంస్థలు మంగళవారం మరోసారి ఇంధన ధరలను పెంచడంతో వారంలోనే రెండోసారి ధరలు పెరిగిన పరిస్థితి ఏర్పడింది. పెట్రోల్, డీజిల్ ధరలు సగటున లీటరుకు 0.90 >>2

### పాలమూరు-రంగారెడ్డి భూసేకరణ

# వడివడిగా పూర్తి

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలకు సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

పెండింగ్ బిల్లుల క్లియరెన్స్‌కు ప్రభుత్వం సిద్ధం

పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచన



మంగళవారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, మహబూబ్‌నగర్‌కు చెందిన ఎమ్మెల్యేలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, మే19:** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ప్రజా ప్రతినిధులకు రేవంత్‌రెడ్డి కీలక సూచనలు చేశారు. మంగళవారం మర్రి చెన్నారెడ్డి హెచ్‌ఆర్‌డిలో సిఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, సంబంధిత అధికారులతో భేటీ అయ్యారు. ఆ జిల్లా సాగునీటి ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలన్నారు. భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని సీఎంభరోసా ఇచ్చారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘారెడ్డి, రాజేశ్ రెడ్డి, వంశీ కృష్ణ, వీర్లపల్లి శంకర్, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు >>2


ప్రభుత్వ ఉద్యోగాలకు వయోపరిమితి 44కు పెంపు 2


# సర్క్యులర్ ఎకానమీ అడుగులు

ఘన వ్యర్థాల నిర్వహణ మరింత బలోపేతం

స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ 2.0 జాతీయ సమావేశంలో డి.సిఎం భట్టి




స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ 2.0 జాతీయ సమావేశంలో డి.సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే19:** దేశవ్యాప్తంగా పట్టణ పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షతన ప్రారంభమైన రెండు రోజుల స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0 జాతీయ సమీక్ష సమావేశానికి తెలంగాణ రాష్ట్రం తరఫున ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు హాజరయ్యారు.మొదటి రోజు సమావేశంలో దేశంలోని పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, వ్యర్థాల శాస్త్రీయ ప్రాసెసింగ్, పాత చెత్త కుప్పల తొలగింపు, వ్యర్థాలనుంచి విద్యుత్ ఉత్పత్తి, పీపీపీ విధానాలు, ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. రాష్ట్రాలు, నగరాలు అమలు చేస్తున్న అనుభవాలు, ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకోవడంపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ విధానాలు, సుస్థిర పట్టణాభివృద్ధి చర్యలు, స్వచ్ఛత కార్యక్రమాలు, సర్క్యులర్ ఎకానమీ దిశగా చేపడుతున్న కార్యక్రమాలను డిప్యూటీ సిఎం వివరించారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన తెలంగాణ విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని భవిష్యత్ అవసరాలకు సరిపోయే విధంగా, సుస్థిరంగా, సమగ్రంగా, పర్యావరణహితంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి విధానాన్ని అనుసరిస్తోందని, ఇందులో కోర్ అర్బన్ రీజియన్, పెరి అర్బన్ రీజియన్, రూరల్ అగ్రికల్చరల్ రీజియన్‌ల సమతుల్య అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఘన వ్యర్థాల నిర్వహణ అనేది ఇకపై కేవలం చెత్త సేకరణకు పరిమితం కాదని, అది వాతావరణ మార్పులకు ప్రతిస్పందన, పర్యావరణ సుస్థిరత, సర్క్యులర్ ఎకానమీ, ఉపాధి కల్పన, ఆర్థిక ఉత్పాదకతలతో నేరుగా అనుసంధానమై ఉందని డిప్యూటీ సిఎం పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చిన ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు-2026 దేశంలో >>2

### నేడు మెడికల్ షాపుల


## బంద్

ఆన్‌లైన్‌లో మెడిసిన్ అమ్మకాలను నిలిపివేయాలని డిమాండ్

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 19:** దేశవ్యాప్తంగా బుధవారం మెడికల్ షాపులు బంద్ నిర్వహించనున్నాయి. ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను నిలిపివేయాలని, కార్పోరేట్ సంస్థల అధిక డిస్కౌంట్లను నియంత్రించాలని




డిమాండ్ చేస్తూ నేడు దేశ వ్యాప్తంగా మెడికల్ షాపులు బంద్‌ను నిర్వహిస్తున్నట్టు ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రకటించిందఇ. అసోసి యేషన్ బంద్ >>2



### వడగాడ్పులకు మరో

## నలుగురు మృతి

ఉష్ణోగ్రత మరో రెండు, మూడు డిగ్రీలు పెరిగే అవకాశం

**హెచ్చరించిన వాతావరణశాఖ, హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** ఆకాశం నుంచి నిప్పుల వర్షం కురుస్తోందా అన్నట్లుగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు వడదెబ్బబారిన పడి ప్రాణాలు విడుస్తున్నారు. వడదెబ్బ బారిన పడి మృతిచెందుతున్న ఘటనలు రాష్ట్రంలో నిత్యం చోటు చేసుకుంటున్నాయి. ఆదిలాబాద్ నుండి ఆలంపూర్ వరకు ప్రమాదకరస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో వడదెబ్బతో ప్రజలు ప్రాణాలు విడుస్తున్నారు. తాజాగా తెలంగాణలో వడదెబ్బ కారణంగా వేర్వేరు జిల్లాల్లో నలుగురు వ్యక్తులు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. కామారెడ్డి, ఆదిలాబాద్, సూర్యాపేట, భూపాలపల్లి జిల్లాల్లో వడదబ్బె మరణాలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన మేకల కాపరి బాలునాయక్ వడదెబ్బతో కన్నుమూశాడు. ఉదయం 10గంటలకే నిప్పుల కొలిమిని తలపించేలా రాష్ట్రంలో ఎండ మండిపోతోంది. ఈ పరిస్థితుల్లో అత్యవసరమైతే తప్ప పగటివేళ బయటకు రావద్దని అధికారులు హెచ్చరిస్తున్నా వివిధ అత్యవసర పనుల నిమిత్తం బయటకు వచ్చిన పలువురు వడదెబ్బబారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. తెలంగాణలో సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. ఎండలు మునుపెన్నడూ లేని విధంగా మండిపోతున్నాయి. ఈ నెల 25 నుంచి రోహిణి కార్తె ప్రారంభం కానుండగా ఇప్పటి నుండే భానుడు తన విశ్వరూపాన్ని చూపిస్తూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. ముఖ్యంగా జగిత్యాల జిల్లా కొరుట్లలో అత్యధికంగా 45.9 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదై రాష్ట్రంలోనే అత్యంత వేడి ప్రాంతంగా నిలిచింది. నల్గొండ జిల్లా కట్టంగూర్, నిర్మల్ జిల్లా దస్తూరాబాద్, సిద్దిపేట జిల్లా కోహెడలలో 45.8 డిగ్రీల సెల్సియస్ చొప్పున ఉష్ణోగ్రతలు నమోదు కాగా మంచిర్యాల జిల్లా దండేపల్లి, పెద్దపల్లి జిల్లా >>2






ఓస్లోలో మంగళవారం ఐస్‌ల్యాండ్ ప్రధాని క్రిస్ట్రాన్ మ్జోల్ ఫ్రోస్టాడోట్టిర్‌తో భేటీ అయిన ప్రధాని మోడీ

## ఐస్‌ల్యాండ్ ప్రధానితో మోడీ భేటీ

**ఓస్లో, మే 19:** ప్రధాని మోడీ ఐదు దేశాల పర్యటనలో భాగంగా మంగళవారం ఐస్‌లాండ్‌లో మోడీ పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా ఐస్‌లాండ్ ప్రధాని క్రిస్ట్రాన్ మ్జోల్ ఫ్రోస్టాడోట్టిర్‌తో మోడీ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే అంశాలపై చర్చించినట్లు మోడీ వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ ఐస్‌లాండ్ ప్రధాని క్రిస్ట్రాన్ మ్జోల్ ఫ్రోస్టాడోట్టిర్‌తో అద్భుత సమావేశం జరిగిందని, ఐస్‌లాండ్‌తో ఉన్న స్నేహబంధాన్ని భారత్ ఎంతో విలువైనదిగా భావిస్తోందని సోషల్‌మీడియాలోపోస్టుచేసారు. స్వచ్ఛ ఇంధనం, మత్స్య రంగం, సస్టైనబిలిటీ, జియోథర్మల్ ఎనర్జీ, కార్బన్ క్యాప్చర్ అండ్ స్టోరేజ్ వంటి రంగాల్లో సంబంధాలను మరింత మెరుగుపర్చే మార్గాలపై చర్చించామని తెలిపారు. అలాగే బ్లూ ఎకానమీకి సంబంధించిన రంగాల్లో ఐస్‌లాండ్ ప్రతిభ ప్రశంసనీయమని మోడీ పేర్కొన్నారు. భారత్‌ఈఎఫ్‌టీఏ, ట్రేడ్ అండ్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్ టెపా,వాణిజ్య, పెట్టుబడి సంబంధాలకు మరింత ఊతమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలో విద్యార్థి ఆత్మహత్య

**హైదరాబాద్, మే 19,ప్రభాతవార్త:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విషాదం చోటుచేసుకుంది. పశ్చిమబెంగాల్‌కు చెందిన విద్యార్థి మయాంక్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని యూనివర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మయాంక్ కుందు హెచ్‌సీయూలో ఎంఏ ఎకనామిక్స్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. మయాంక్ నందు హెచ్‌సీయూలో ఉన్న చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని యూనివర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మయాంక్ కుందు మృత దేహాన్ని వెలికితీసి పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

కాగా,మయాంక్ కుందు సెంట్రల్ యూనివర్సిటీలో గతంలో 2 ల్యాప్ టాప్‌లు దొంగిలించాడని ఆరోపణలున్నాయి. అయితే నేడు మరొక ల్యాప్‌టాప్ పోవడంతో తనను దొంగ అని ముద్ర వేస్తున్నారని మన స్థాపానికి లోనైన మయాంక్ కుందు యూనివర్సిటీ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు సమాచారం.అయితే ఈ సమాచారాన్ని పోలీసులు నిర్ధారించడంలేదు. ఈ ఘటనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎసిబి వలలో లంచావతారం

>> కదలవు. ఈ క్రమంలోనే కోట్లాది రూపాయలు లం చం మెక్కుతున్నట్లు ఎసిబికి ఫిర్యాదు అందాయి. చాలా మంది కాంట్రాక్టర్లు ఇదే విషయమై ఎసిబి అధికారులకు లిఖితపూర్వనంగా ఫిర్యాదులు చేశారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో కొన్ని నెలలుగా అనంత లక్ష్మీ కుమార్ వ్యవహారంపై నిఘా వుంచిన ఎసిబి అధికారులు అతని ఆస్తుల చిట్టా పై ఆరా తీశారు. చివరగా అతను అవినీతి అధికారి అని నిర్దారణ అయిన తరువాత ఉదయం ఆరు గంటల సమయంలో నాచారంలోని మల్లా పూర్‌లో గల అనంత లక్ష్మీ కుమార్ ఇంటిపై ఎసిబి అధికారుల బృందం దాడి చేసింది. దీంతో పాటు నిజామాబాద్, సంగారెడ్డి సహా నగరంలో ని మరో ఆరుచోట్ల ఆయన బంధువులు, సన్నిహితులు, బినామీల ఇళ్లలో ఎసిబి అధికారులు వేరు వేరుగా దాడులు చేశారు. దాడుల సమయం లో ఎసిబి అధికారులు అనంత లక్ష్మీ కుమార్‌తో పాటు ఆయన బంధువులు, సన్నిహితులను ఇళ్ల నుంచి బయటకు వెళ్లనీయలేదు. దాడుల సం దర్భంగా మల్లాపూర్‌లోని అనంత లక్ష్మీ కుమార్ ఇంట్లో కోటి పది లక్షల రూపాయల నగదు, 2.1 కిలోల బంగారు నగలు, 9.2 కిలోల వెండి నగలు, ఒక కారు, మరో బైక్ పట్టుబడ్డాయి. ఆయన ఇల్లు ఇంద్ర భవనాన్ని తలపించేలా వుండగా దీని ఖరీదు పది కోట్ల రూపాయలకు పైబడి వుంటుందని అధికారులు భావిస్తున్నారు. దీంతో పాటు నిజామాబాద్, సంగారెడ్డిలో 18 ఎకరాల వ్యవసాయ పొలం, హైదరాబాద్‌లో ఖరీదైన ఆరు ప్లాట్లు, ఒక ఖరీదైన ఇల్లు వెలుగు చూసింది. వీటి విలువ ఐదు కోట్ల 88 లక్షల 55 వేల 490 రూపాయలుగా ఎసిబి అధికారులు నిర్ధా రణకు వచ్చారు. అయితే బహిరంగ మార్కెట్లో వీటి విలువ వంద కోట్ల రూపాయల వరకు వుంటుందని అధికారులు చెబుతున్నారు. మల్లాపూర్ లో అనంత లక్ష్మీ కుమార్ ఇంట్లో సోదాల సమయంలో ఆయన అక్కడే వుండగా బ్యాంకు లాకర్లను భార్యచేత తెరిపించి అక్కడ వున్న కొన్ని ప త్రాలను ఎసిబి అధికారులు జప్తు చేశారు. ఈ సోదాలు రాత్రి వరకు జరిగాయి. అనంతరం అనంత లక్ష్మీ కుమార్‌ను ఆదాయానికి మించి ఆస్తు లు కలిగిన నేరంపై ఎసిబి అధికారులు అరెస్టు చేశారు. కాగా సర్కారీ విభాగాల్లో అక్రమార్కులపై ప్రజలు 1064కు ఫోన్ చేయాలని ఎసిబి డి జి చారు సిన్హా తెలిపారు.

## నేడు మెడికల్ షాపుల బంద్

>> ఫలితంగా దేశ వ్యా ప్తంగా 12లక్షల మెడికల్ షాపులతో పాటు రాష్ట్రంలో కొనసాగుతున్న 35 వేలు మెడికల్ షాప్‌లు కూడా బంద్‌లో పాల్గొననున్నాయి. కోవిడ్ సమయంలో అత్యవసర నిబంధనలకు సంబంధించిన జిఎస్‌ఆర్ 220(ఇ)ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఇ-ఫార్మసీ నిబంధనలకు సంబంధించిన జిఎస్‌ఆర్ 217ను కూడా రద్దు చేయాలని అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇస్తే ఏదైనా ప్రమాదాలు జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారన్నారు. బంద్ సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను సైతం చేస్తున్నట్టు అసోసియేషన్ నేతలు తెలిపారు.

అత్యవసర పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కొన్ని ఎంపిక చేసిన మెడికల్ షాపులను మాత్రమే అందుబాటులో ఉంచనున్నట్లు అసోసియేషన్ నేతలు తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో కూడా అత్యవసర అవసరాల కోసం ఒకటి, రెండు మెడికల్ షాపులను తెరిచి ఉంచే ఏర్పాట్లు చేస్తున్నట్లు అసోసియేషన్ ప్రకటించింది. (నేడు) బుధవారం దేశవ్యాప్తంగా మెడికల్ షాప్‌ల బంద్‌కు అఖిల భారత కిమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్స్ ఆర్గనైజేషన్ ఏఐఓసీడీ పిలుపునిచ్చిన నేపథ్యంలో ఔషధ నియంత్రణా మండలి ప్రజలకు పలు సూచనలు చేసింది. ఏఐఓసీడీ తెలంగాణ విభాగంతో చర్చలు జరిపినట్టు పేర్కొన్న డీసీఏ ఆస్పత్రులకు అనుబంధంగా ఉన్న మెడికల్ షాప్స్‌ను తెరిచి ఉంచేందుకు ఏఐఓసీడీ అంగీకరించినట్టు ప్రకటించింది. అత్యవసర సమయాల్లో మందులను అందించేందుకు జిల్లా స్థాయిల్లోని ఏఐఓసీడీ ప్రతినిధులు డ్రగ్ ఇన్స్‌పెక్టర్లకు అందుబాటులో ఉంచారని స్పష్టం చేసింది.

## వడగాడ్పులకు మరో నలుగురు మృతి

>> ఎలిగేడులలో 45.7 డిగ్రీలుగా నమోదైంది. ఇక ఆదిలాబాద్‌లోని మావల, కరీంనగర్‌లోని గంగాధర, నిజామాబాద్‌లోని భీమ్‌గల్, రాజన్న సిరిసిల్ల, కుమురం భీం ఆసిఫాబాద్‌లోని సిర్పూర్ ప్రాంతాల్లో భానుడి వేడి 45.6 డిగ్రీలుగా రికార్డైంది. హన్మకొండ ధర్మసాగర్, ఖమ్మం ఏనకూరు, సూర్యాపేట మట్టంపల్లి ప్రాంతాల్లో 44.8 డిగ్రీలు, మెదక్ నర్సాపూర్, మహబూబాబాద్ తొర్రూర్, యాదాద్రి అడ్డగూడూరులలో 44.5 డిగ్రీలు, వరంగల్‌లో 44.4, జనగామలో 44.3 డిగ్రీల సెల్సియస్ చొప్పున ఉష్ణోగ్రతలు నమోదై ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఈ నేపథ్యంలో తెలంగాణలోని పలు జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో రాబోయే మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరో 2 నుంచి 3 డిగ్రీలు పెరిగి, ఏకంగా 47డిగ్రీలకు చేరే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం హీట్ వేవ్ పరిస్థితులు కొనసాగుతున్నాయని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో రాబోయే 3 రోజుల పాటు వడగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఎండ తీవ్రత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై మధ్యాహ్న సమయంలో రాకపోకలు గణనీయంగా తగ్గిపోయాయి. మరోవైపు విద్యుత్ వినియోగం కూడా భారీగా పెరిగింది.ఎండల తీవ్రత దృష్ట్యా విపత్తు నిర్వహణశాఖ ప్రజలకు పలు సూచనలు చేసింది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు రాకూడదని స్పష్టం చేసింది. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నపిల్లలు మరింత జాగ్రత్తగా ఉండాలని కోరారు. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ ధరించాలని, డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండటానికి మజ్జిగ, కొబ్బరినీళ్లు, ఓఆర్ఎస్ లవణాల నీటిని ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. రైతులు, కార్మికులు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే వారు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

### వారం - వర్జ్యం

20-05-2026, అధికజ్యేష్ఠ బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, రోహిణి కార్తె
చవితి ఉ.11.10
ఆరుద్ర ఉ.6.12, పునర్వసు తె.4.13
వర్జ్యం : సా.5.12-సా.6.40
దు. ఉ.11.38-మ.12.30
రాహుకాలం - మ.12.00-1.30

### వార్తాఫలం

**మేషం:** లౌక్యం లోపిస్తుంది. ఇందువలన నష్ట మేర్పడక పోయినా సమాజంలో మీ పై కొంత దుష్ప్రచారం జరుగుతుంది.బంధువుల కలయిక.

**వృషభం:** నిర్వహించలేక పారిపోతారని ఇతరుల అంచనాలు తలక్రిందులు చే-స్తారు. విశ్రాంతికి సమయం ఉండదు.

**మిథునం:** ఇష్టం లేకపోయినా, నమ్మకం లేకపోయినా కొందరిని తాత్కాలికంగా నమ్మాల్సిన స్థితి తప్పదు.వస్త్రలాభం.

**కర్కాటకం :** ఉద్యోగంలో ఇబ్బందులు కలిగించే వర్గం మళ్ళీ పుంజుకుంటారు. ఆర్థికపరమైన అంశాలు అనుకూలంగా ఉంటాయి.

**సింహం:** కుటుంబపరమైన విషయాలు నిర్లక్ష్యం చేశారని విమర్శలు చేస్తారు. స్థిరాస్తి కొనుగోలు వ్యవహారాలు సానుకూల పడతాయి.

**కన్య :** నిర్మాణ సంబంధమైన విషయాలలో లోపాలు కనిపెడతారు. సంఘంలో గౌరవం పెరుగుతాయి. నూతన విద్యావకాశాలు.

**తుల :** అధిక మొత్తములో ధనం ఖర్చయినా ఎందుకు లెక్కలు చూపడం లేదో మీకు అర్థమవుతుంది. కొత్తమిత్రులు పరిచయం.

**వృశ్చికం:** మీ వ్యక్తిగత విషయాలను ఆసరగా తీసుకొని మీకు అన్నివిధాలుగా నష్టం తెస్తున్నారని గుర్తిస్తారు.

**ధనుస్సు:** సంతాన పురోగతి బాగుంటుంది. వాళ్ళకు మంచి అవకాశాలు వస్తాయి. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

**మకరం:** సాంకేతిక కారణాల వల్ల ముఖ్యమైన విషయాలు వాయిదా పడతాయి. ఇది మీ అభివృద్ధికి పరోక్షంగా కారణం అవుతుంది.

**కుంభం:** మీరు ఊహించిన వ్యయం అధికం అవుతుంది. బ్యాంకు ఋణాలు సాధించుకుంటారు. శుభవార్తలు అందుకుంటారు.

**మీనం :** మీకు రావలసిన ధనం, బిల్లులు, పెట్టుబడులు సమయానికి ఆదుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



# వీధి కుక్కలను తరలించాల్సిందే!

## గతంలో ఇచ్చిన ఆదేశాలను సవరించడానికి సుప్రీంకోర్టు నిరాకరణ

### పిచ్చికుక్కలు, ప్రమాదకరమైన కుక్కలకు కారుణ్య మరణానికి అనుమతి

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా జంతు జనన నియంత్రణ (ఎబిసి) నిబంధనలను మరింత కఠినంగా అమలు చేసేలా చూసేందుకు, ప్రజా ప్రదేశాలలో వీధి కుక్కల నిర్వహణపై తాను గతంలో ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవడానికి సుప్రీంకోర్టు మంగళవారం నిరాకరించింది. గత ఏడాది నవంబర్‌లో సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలలో మార్పులు కోరుతూ కుక్కల ప్రేమికులు, జంతు హక్కుల సంఘాలు దాఖలు చేసిన పలు దరఖాస్తులను జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతా, ఎన్.వి. అంజరియాలతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. పాఠశాలలు, ఆసుపత్రులు, బస్ స్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌ల వంటి సున్నితమైన ప్రజా ప్రదేశాల నుండి పట్టుకున్న వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్స, టీకాలు వేయించిన తర్వాత వాటిని తిరిగి అదే ప్రదేశాలలో వదిలిపెట్టకూడదని ఆ ఆదేశాలలో నిర్దేశించారు. తీర్పును ప్రకటిస్తూ, జస్టిస్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం, "గౌరవప్రదమైన జీవిత హక్కు"లో ప్రజా ప్రదేశాలలో కుక్కల దాడుల భయం లేకుండా జీవించే హక్కు కూడా ఉంటుందని నొక్కి చెప్పింది. వీధి కుక్కల కాటు ముప్పు పెరుగుతున్నప్పటికీ, దానిని సమర్థవంతంగా పరిష్కరిం చడంలో విఫలమైనందుకు అధికారులను మందలించింది. దాడులకు సంబంధించిన పలు నివేదికలను ప్రస్తావిస్తూ, ఈ సమస్య "దిగ్భ్రాంతికరమైన పరిమాణాలను" సంతరించుకుందని, ఇప్పటికే ఉన్న ఆదేశాలు, చట్టబద్ధమైన నిబంధనల అమలులో తీవ్రమైన లోపాలను ఇది ప్రతిబింబిస్తోందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. తమ ఆదేశాలను పాటించడంలో విఫలమయ్యే తప్పు చేసిన అధికారులు కోర్టు ధిక్కరణ, క్రమశిక్షణా చర్యలకు బాధ్యులవుతారని జస్టిస్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం హెచ్చరించింది. సమగ్ర ఆదేశాలు జారీ చేస్తూ, ఎబిసి నిబంధనల కింద మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు (యుటిలు) కాలపరిమితితో కూడిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రతి జిల్లాలో శస్త్రచికిత్స సౌకర్యాలు, శిక్షణ పొందిన సిబ్బంది, తగిన లాజిస్టిక్స్ మద్దతుతో కూడిన కనీసం ఒక పూర్తిస్థాయి ఎబిసి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అది తప్పనిసరి చేసింది. జనాభా సాంద్రత, భౌగోళిక అవసరాల ఆధారంగా అటువంటి కేంద్రాల సంఖ్యను విస్తరించాలని, అలాగే సిబ్బందికి శిక్షణ ఇవ్వడం, ఆశ్రయాలను బలోపేతం చేయడం, సమన్వయంతో కూడిన టీకా కార్యక్రమాలతో సహా సామర్థ్య నిర్మాణ చర్యలను చేపట్టాలని కూడా అధికారులను ఆదేశించింది.

**ప్రమాదకరమైన కుక్కలకు కారుణ్య మరణానికి అనుమతి**

మానవ ప్రాణాలకు ముప్పును అరికట్టడానికి, తగిన సందర్భాలలో, చట్టబద్ధమైన నిబంధనలకు కచ్చితంగా అనుగుణంగా, పిచ్చికుక్కలు, ప్రమాదకరమైన కుక్కలకు కారుణ్య మరణం (యుథనేషియా) చేపట్టేందుకు అధికారులకు సుప్రీంకోర్టు అనుమతిచ్చింది. "వీధి కుక్కల జనాభా ఆందోళనకర స్థాయికి చేరిన ప్రాంతాలలో, కుక్క కాట్లు లేదా దూకుడు దాడుల ఘటనలు తరచుగా జరుగుతూ, ప్రజా భద్రతకు నిరంతర ముప్పును కలిగిస్తున్న చోట, సంబంధిత అధికారులు, అర్హత కలిగిన పశువైద్య నిపుణులచే సరైన అంచనాకు లోబడి, జంతువులపై క్రూరత్వ నివారణ చట్టం 1960, జంతు జనన నియంత్రణ నియమాలు 2023, ఇతర వర్తించే చట్టబద్ధమైన నిబంధనలకు కచ్చితంగా అనుగుణంగా, పిచ్చికుక్కలు, నయంకాని వ్యాధితో ఉన్న, లేదా స్పష్టంగా ప్రమాదకరమైన/ దూకుడు స్వభావం గల కుక్కల విషయంలో, మానవ ప్రాణాలకు, భద్రతకు ఎదురయ్యే ముప్పును సమర్థవంతంగా అరికట్టడానికి, కారుణ్య మరణంతో సహా చట్టబద్ధంగా అనుమతించబడిన చర్యలను తీసుకోవచ్చు" అని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజరియాలతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై కుక్కకాటు కేసులు పెరుగుతున్నాయని వస్తున్న "తీవ్ర ఆందోళనకరమైన" నివేదికలను ప్రస్తావిస్తూ, విద్యాసంస్థలు, బస్ స్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, ఆసుపత్రులు మొదలైన ప్రాంగణాల నుండి వీధి కుక్కలను తొలగించాలంటూ అధికారులకు గతంలో ఇచ్చిన ఆదేశాలను సవరించడానికి కోర్టు నిరాకరించింది.



మంగళవారం జగ్దల్‌పూర్‌లో 'బస్తర్ కే సాంగ్' జానపద సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి, మధ్యప్రదేశ్ సిఎం మోహన్ యాదవ్, ఛత్తీస్‌గఢ్ సిఎం విష్ణు తదితరులు

## మళ్లీ పెట్రో షాక్

>> పైసల మేర పెంచుతూ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే రెండోసారి ధరలు పెంచడం గమనార్హం. ఇప్పటికే గత శుక్రవారం పెట్రోల్‌పై లీటర్‌కు రూ.3.14, డీజిల్‌పై రూ.3.11 పెరగగా తాజాగా మరోసారి పెట్రోల్, డీజిల్‌పై అదనంగా 0.90 పైసలు చొప్పున పెరగడంతో వాహనదారులపై అదనపు భారం పడినట్లయింది.

తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.0.87 పైసల మేర పెరిగి రూ.97.77 నుంచి రూ.98.64కు పెరిగింది. అలాగే లీటర్ డీజిల్ ధర 0.91 పైసలు మేర పెరగడంతో రూ.90.67 నుంచి రూ.91.58కి చేరింది. ఇక దేశ ఆర్థిక రాజధాని ముంబై ప్రాంతంలో లీటర్ పెట్రోల్‌పై 0.91 పైసలు పెంచారు. దీంతో లీటర్ పెట్రోల్ రూ.107.59కి చేరింది. అలాగే లీటర్ డీజిల్‌పై 0.94 పైసలు పెంచారు. దీంతో డీజిల్ లీటరుకు రూ.94.08కు ఎగబాకింది. మరోవైపు కోల్‌కతాలో లీటర్ పెట్రోల్ ధర 0.96 పైసల మేర పెరిగింది. దీంతో ఇప్పుడు లీటర్ పెట్రోల్ రేటు రూ.109.70కి చేరింది. ఇక లీటర్ డీజిల్ ధరను 0.94 పైసలు పెంచారు. దీంతో కోల్‌కతాలో డీజిల్ లీటరుకు రూ.96.07కు చేరింది. దక్షిణాదిన చెన్నై ప్రాంతంలో లీటర్ పెట్రోల్ రేటును 0.82 పైసలు పెంచడంతో రూ.104.49 స్థాయికి చేరింది. లీటర్ డీజిల్ పై రూ.86 పైసలు పెంచడంతో రూ.96.11 స్థాయికి ఎగబాకింది. ధరల పెంపు తర్వాత హైదరాబాద్ నగరంలో పెట్రోల్ ధర లీటర్‌కు రూ.110.88కు చేరుకుంది. ఇక డీజిల్ ధర రూ.98.99కు పెరిగింది. ప్రస్తుతం విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర రూ.113.88గా ఉండగా లీటర్ డీజిల్ ధర రూ.101.57కు పెరిగింది. విశాఖపట్టణంలో లీటర్ పెట్రోల్ ధర రూ.108.48గా ఉండగా డిజిల్ ధర రూ.96.22గా ఉంది. ఇక వరంగల్ నగరంలో పెట్రోల్ లీటరు ధర రూ.110.53కు చేరగా డిజిల్ ధర రూ.98.65కు పెరిగింది. గత శుక్రవారం కూడా చమురు కంపెనీలు లీటరుకు దాదాపు రూ.3 మేర ధరలను పెంచిన నేపథ్యంలో తాజా పెంపుతో కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే ఇంధన ధరలు సుమారు రూ.4 వరకు పెరిగాయి. పెట్రో ధరల పెరుగుదలకు అంతర్జాతీయ ముడి చమురు మార్కెట్‌లో నెలకొన్న అస్థిర పరిస్థితులే ప్రధాన కారణమని ఆయిల్ కంపెనీలు స్పష్టం చేస్తున్నాయి.

మరోవైపు ప్రపంచ పరిస్థితులు త్వరలో సాధారణ స్థితికి రాకపోతే, రాబోయే రోజుల్లో మరిన్ని విడతలుగా పెట్రో ధరలు పెరిగే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరో వారం రోజుల్లో పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరగబోతున్నాయని తెలుస్తోంది. డీజిల్ పై లీటకు రూ.11.40, పెట్రోల్ పై లీటరుకు రూ.14.30 మేర పెరిగే అవకాశం ఉందని, అయితే, ప్రస్తుతం నష్టాలను పూర్తిగా పూడ్చడానికి పెట్రోల్, డీజిల్ పై లీటరకు రూ.13 నుంచి రూ.17 వరకు అవసరం కావచ్చునని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ అంచనా వేసింది.

## పాలమూరు-రంగారెడ్డి భూసేకరణ వడివడిగా పూర్తి

>> హాజరయ్యారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు 90 శాతం పూర్తి చేశామని బీఆర్ఎస్ నేతలు మాట్లాడారని మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. రెండేళ్లలో పాలమూరు-రంగారెడ్డి పూర్తి చేస్తానని ఆనాడు కేసీఆర్ చెప్పి రూ.లక్ష కోట్ల ప్రాజెక్టుపై రూ.25 కోట్లే ఖర్చు పెట్టారని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం నిరక్ష్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ కాంగ్రెస్ హయాంలో వచ్చినవేనని గుర్తు చేశారు. కాళేశ్వరం పూర్తి చేసినట్లు పాలమూరు ప్రాజెక్టు ఎందుకు పూర్తి చేయలేదని అని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డికి కావాల్సిన 90 టీఎంసీలు బీఆర్ఎస్ తేలేకపోయిందని, తాము తెచ్చి తీరుతామని అన్నారు. పాలమూరుపై బీఆర్ఎస్‌ది సవతి తల్లి ప్రేమ అని అన్నారు. సమీక్ష అనంతరం ఈ మేరకు మీడియాతో మాట్లాడారు. పాలమూరు-రంగారెడ్డి పూర్తి కావాలంటే రూ.లక్ష కోట్లు కావొచ్చని జూపల్లి పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద 160 టీఎంసీల లభ్యత దృష్ట్యా గ్రావిటీ ద్వారా నీళ్లు తేవచ్చని, పాలమూరు-రంగారెడ్డికి 90 టీఎంసీల నికర జలాలు సాధించి తీరుతామని తెలిపారు.

కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను బీఆర్ఎస్ ప్రభుత్వం తాకట్టు పెట్టిందన్న ఆయన, కృష్ణా జలాల్లో తెలంగాణకు 62 శాతం వాటాపై హక్కు ఉందని స్పష్టం చేశారు. పోతిరెడ్డిపాడు ద్వారా ఏపీ, వేల టీఎంసీలు తీసుకెళ్లిందని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డికి త్వరలోనే నీటి కేటాయింపులు సాధిస్తామని, ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎంను కలిశామని చెప్పారు. పాలమూరుకు అధిక నిధులు కేటాయించాలని సీఎంను కోరామన్న ఆయన, ప్రాజెక్టుల పూర్తికి అధిక నిధులు కేటాయించేలా ఒత్తిడి తెస్తామన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగాలకు వయోపరిమితి 44కు పెంపు

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగాలకు గరిష్ఠ వయోపరిమితిని 34 ఏళ్ల నుంచి 44 ఏళ్లకు (ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ మరియు ఇతర రిజర్వ్‌డ్ కేటగిరీలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అదనపు సడలింపులు వర్తిస్తాయి) మరోసారి పొడిగించింది. గతంలోనే వయోపరిమితిని పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా ఆ సడలింపును మరో ఏడాది పొడిగించింది. ఈ మేరకు తాజాగా జీవో జారీ చేసింది.ఈ వయోపరిమితి సడలింపు ప్రత్యక్ష ఉద్యోగ నియామకాలకు వర్తిస్తుందని ప్రభుత్వం తెలిపింది. అయితే యూనిఫామ్ సర్వీసులకు సడలింపు వర్తించదని పేర్కొంది. నిరుద్యోగ యువత నుంచి పెద్ద ఎత్తున వినతులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## సర్క్యులర్ ఎకానమీ అడుగులు

>> వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలో కీలక మార్పుకు దారితీస్తున్నాయని తెలిపారు.కొత్త నిబంధనలు సంప్రదాయ చెత్త సేకరణ, డంపింగ్ విధానాలకే పరిమితం కాకుండా, 4వే సోర్స్ సెగ్రిగేషన్, వికేంద్రీకృత వ్యర్థాల ప్రాసెసింగ్, పాత డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, సర్క్యులర్ ఎకానమీ, వార్డు స్థాయి బాధ్యత, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఈ దిశగా నిబంధనలు అమలులోకి రాకముందే పలు చర్యలు ప్రారంభించిందని వివరించారు.రాష్ట్రంలోని కోర్ అర్బన్ ప్రాంతాల్లో దాదాపు 9,596 ఎలక్ట్రిక్ స్వచ్ఛ ఆటో టిప్పర్లను ప్రవేశపెట్టే ప్రక్రియను తెలంగాణ ప్రభుత్వం చేపడుతోందని తెలిపారు. ఈ ఎలక్ట్రిక్ వాహనాల ద్వారా మున్సిపల్ కార్యకలాపాల్లో కార్బన్ ఉద్గారాలు తగ్గడంతో పాటు, శుభ్రమైన రవాణా విధానానికి మార్గం సుగమం అవుతుందని అన్నారు. వీటిని 4వే సోర్స్ సెగ్రిగేషన్‌కు అనుగుణంగా విభజిత చెత్త నిల్వ స్థలాలతో రూపొందిస్తున్నట్లు తెలిపారు. క్యూఆర్ కోడ్ ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఇంటింటి చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం వికేంద్రీకృత, పంపిణీ ఆధారిత వ్యర్థాల ప్రాసెసింగ్ వ్యవస్థలకు ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. తడి చెత్తను ఉత్పత్తి అయిన ప్రాంతాల సమీపంలోనే ప్రాసెస్ చేయడం, పొడి చెత్తను శాస్త్రీయంగా వేరు చేసి రీసైక్లింగ్,సర్క్యులర్ ఎకానమీ వ్యవస్థల్లోకి తీసుకురావడం, ల్యాండ్‌ఫిల్ ప్రాంతాలకు కనిష్ట వ్యర్థాలు మాత్రమే చేరేలా చేయడం ప్రభుత్వ విధానమని వివరించారు.తడి చెత్తను నగరాల్లో దూర ప్రాంతాలకు తరలించడం వ్యయభారంతో కూడుకున్నదిగా ఉండటమే కాకుండా, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా కూడా సుస్థిర విధానం కాదని తెలిపారు.అందుకే వికేంద్రీకృత తడి చెత్త ప్రాసెసింగ్ కేంద్రాల ద్వారా స్థానిక స్థాయిలోనే వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. దీని వల్ల వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్లకు వెళ్లే ఆర్‌డిఎఫ్ నాణ్యత కూడా మెరుగుపడుతుందని వివరించారు.పాత డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిన అంశమని తెలిపారు.

ఈ సమావేశంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖన్ సాహు, కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి శ్రీనివాస్ కటికితల,స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ రూపా మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

# 23న యాదాద్రిలో తెలంగాణ కేబినెట్ భేటీ

## 21న సరస్వతి అంత్య పుష్కరాలకు హాజరు కానున్న మంత్రులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే19:** తెలంగాణ రాజకీయాలు, పాలనా నిర్ణయాల్లో ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గ (కేబినెట్) సమావేశం నిర్వహణ అత్యంత ఆసక్తికరంగా మారింది. తెలంగాణ కేబినెట్ సమావేశాన్ని 21వ తేదీ నుంచి 23వ తేదీకి మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 21వ తేదీన సరస్వతి అంత్య పుష్కరాలు ఉన్న నేపథ్యంలో 21నుంచి 23కు మార్చింది. 23న యాదగిరిగుట్టలో కేబినెట్ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే, 23న యాదగిరిగుట్టలో వేద పాఠశాలను సీఎం ప్రారంభించనున్నారు. దేవ స్థాన అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేయనున్నారు. రాష్ట్రంలో అత్యంత పవిత్రమైన,చరిత్రాత్మక ఆధ్యాత్మిక వేడుకగా భావించే సరస్వతి అంత్య పుష్కరాలు ఈనెల 21వ తేదీన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరంలో ప్రారంభం కానున్నాయి. ఈ చరిత్రాత్మక వేడుకకు రాష్ట్ర మంత్రివర్గంలోని మెజార్టీ మంత్రులు హాజరుకానున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం, పుష్కరాల పనులను పర్యవేక్షి ంచడం మంత్రులకు విధిగా మారింది. మంత్రులంతా పుష్కరాల పనుల్లో, అధికారిక పర్యటనల్లో నిమగ్నమవ్వడంతో అదే రోజు నిర్వహించాలనుకున్న కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేబినెట్ భేటీని కేవలం వాయిదా వేయడమే కాకుండా.. ఈ నెల 23వ తేదీన ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట (యాదాద్రి)లో కేబినెట్ సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. రాజధాని హైదరాబాద్‌లోని సచివాలయానికే పరిమితం కాకుండా, ప్రజలకు, పుణ్యక్షేత్రాలకు దగ్గరగా పాలనను తీసుకెళ్లాలనే ఆలోచనలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.లక్ష్మీ మ్మనరసింహస్వామి కొలువై ఉన్న యాదగిరిగుట్ట పవిత్ర క్షేత్రంలో కేబినెట్ భేటీ నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మిక, రాజకీయ సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లవచ్చని సీఎం భావిస్తున్నారు.

రాజధాని హైదరాబాద్ వెలుపల కేబినెట్ భేటీలు నిర్వహించడం సీఎం రేవంత్‌రెడ్డికి ఇది కొత్తేమీ కాదు. గతంలో ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరులతో కలిసి మేడారంలోనే కేబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. అక్కడికక్కడే జాతర ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలు, నిధుల విడుదలపై కీలక నిర్ణయాలు తీసుకుని రికార్డు సృష్టించారు. ఇప్పుడు అదే తరహా వ్యూహాన్ని యాదగిరిగుట్టలోనూ అమలు చేయాలని చూస్తున్నారు. దీనివల్ల స్థానిక సమస్యలపై తక్షణమే స్పందించే అవకాశం లభిస్తుందని భావిస్తున్నారు.



# జాతీయ రహదారుల లీజు.. రూ.35వేల కోట్ల సమీకరణ లక్ష్యం

## హైవే అథారిటీస్, కేంద్రం కొత్త నిర్ణయం

న్యూఢిల్లీ, మే 19: దేశంలో రవాణా వ్యవస్థను ప్రపంచ స్థాయికి చేర్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారుల ద్వారా నిధులు సమీకరించి, వాటితో కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో 28 ప్రధాన హైవేలను ప్రైవేట్ సంస్థలకు లీజుకు ఇవ్వడం ద్వారా రూ.35వేల కోట్లు సమీకరించాలని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) లక్ష్యంగా నిర్దేశించుకుంది. ప్రభుత్వ ఆస్తులను విక్రయించకుండా నిర్ణీత కాలానికి ప్రైవేట్ సంస్థలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించి, దాని ద్వారా నిధులు పొందడాన్నే అసెట్ మోనెటైజేషన్ అంటారు. ఈ విధానంలో భాగంగా సుమారు 1,800 కిలో మీటర్ల పొడవైన 28 హైవేలను టోల్‌ఆపరేట్‌ట్రాన్స్‌ఫర్ (టీఓటీ) లేదా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ ఇన్విట్ పద్ధతిలో ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తారు. ప్రైవేట్ సంస్థలు ప్రభుత్వానికి ఒకేసారి పెద్ద మొత్తంలో డబ్బు చెల్లించి, ఆ రహదారులపై టోల్ వసూలు చేసుకునే హక్కును పొందుతాయి. ఈ నిధులను ప్రభుత్వం కొత్త ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణానికి వినియోగిస్తుంది. ప్రస్తుతం ఎన్‌హెచ్ఏఐ రూపొందించిన జాబితాలో హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఎక్కువ హైవేలు ఉన్నాయి. ఈ మార్గాల్లో వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో పెట్టుబడులు పెట్టేందుకు ప్రైవేట్ ఇన్వెస్టర్లు ఆసక్తి చూపుతున్నారు. విదేశీ పెన్షన్ ఫండ్‌లు, సావరిన్ వెల్త్ ఫండ్‌లు కూడా భారత రోడ్ల ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా నిబంధనలను సరళీకరించడం ఈ ప్రక్రియను మరింత ఊతమిస్తోంది. నాలుగు రాష్ట్రాల్లోని 260 కిలోమీటర్ల రోడ్ల ద్వారానే ప్రభుత్వం రూ.9వేల కోట్లు సమీకరించడం ఈ రంగంలో ఉన్న సామర్థ్యాన్ని తెలియజేస్తోంది. ఈ భారీ ప్రణాళిక వల్ల సామాన్యులకు రెండు రకాలుగా ప్రయోజనం చేకూర నుంది. ఒకటి, ప్రభుత్వానికి నిధులు అందుబాటులోకి రావడం వల్ల కొత్త రహదారులు వేగంగా పూర్తవుతాయి. ఇది ప్రయాణ సమయాన్ని, రవాణా ఖర్చులను అదుపులో ఉంచుతుంది. రెండవది, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌ఇన్విట్‌ల ద్వారా సాధారణ ప్రజలు కూడా ఈ హైవే ప్రాజెక్టులలో పెట్టుబడి పెట్టే అవకాశం లభిస్తుంది. స్టాక్ మార్కెట్ ద్వారా ఈ ట్రస్టులలో ఇన్వెస్ట్ చేస్తే, టోల్ ద్వారా వచ్చే ఆదాయంలో డివిడెండ్ రూపంలో వాటా పొందవచ్చు. ఇది సురక్షితమైన పెట్టుబడి మార్గంగా నిలుస్తోంది. ఈ మొత్తం ప్రణాళిక నేషనల్ మోనెటైజేషన్ పైప్‌లైన్ 2.0లో భాగంగా జరుగుతుండగా, దీని కింద వచ్చేకాలంలో రహదారులనుంచే రూ.4.42 లక్షల కోట్లు సమీకరించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

# సినిమా అవకాశాల పేరుతో యువతిపై అత్యాచారం

హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మే 19, ప్రభాతవార్త: సినిమా షూటింగ్ ఆశ చూపి యువతిపై ఇద్దరు లైంగిక దాడికి పాల్పడిన సంఘటన జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ మెట్రోస్టేషన్ సమీపంలో ఇద్దరు అనాథ యువతులు నివసిస్తూ సినిమా షూటింగ్‌లో చేస్తున్నారు. కాగా ఈ నెల 13న మెట్రో స్టేషన్ వద్ద ఉన్న యువతికి సినిమా షూటింగ్‌లో అవకాశం కల్పిస్తా నంటూ ఒక యువకుడు సికింద్రాబాద్‌లోని తన గదికి తీసుకెళ్లాడు. అక్కడ స్నేహితుడితో కలిసి రెండు రోజులపాటు లైంగిక దాడికి పాల్పడ్డారు. అనంతరం ఆమెను ఉబెర్ వాహనం బుక్‌చేసి పంపారు. కాగా స్నేహితురాలి వద్దకు వెళ్లిన యువతి ఒంటిపై గాయాలు ఉండటంతో గాంధీ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తీసుకెళ్లింది. అక్కడ వైద్యులు ప్రశ్నించడంతో అసలు విషయం బయటపడింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఐ బొమ్మ, బప్పం వెబ్‌సైట్లపై కేసు నమోదు

## గోల్‌మాల్ వెనుక విదేశాల్లోని రవి అనుచరుల పాత్రపై అనుమానాలు?

హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త: దేశ వ్యాప్తంగా అనేక భాషలకు చెందిన కొత్త సినిమాలను రిలీజ్ అయిన గంటల వ్యవధిలోనే ఉచితంగా చూపుతున్న ఐ బొమ్మ, బప్పం వెబ్‌సైట్లపై సైబర్‌క్రైం పోలీసులు తాజాగా కేసు నమోదు చేశారు. అధునాతన టెక్నాలజీని వాడి, విదేశాల నుంచి ఈ రెండు వెబ్‌సైట్లను సైబర్ నేరగాళ్లు నడుపుతున్నట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. గతంలో ఈ రెండు వెబ్‌సైట్లను నిర్వహించిన ఇమంది రవికి తాజా వ్యవ హారంలో ఎలాంటి సంబంధం లేదని పోలీసులు అంచనాకు వచ్చారు. ఇదే విషయమై రవిని సైబర్ క్రైం పోలీసులు విచారించి ఈ నిర్ధారణకు వచ్చారు. నాలుగు నెలల క్రితం రవిని సైబర్‌క్రైం పోలీసులు అరెస్టు చేశాక ఈ రెండు వెబ్‌సైట్లు మూతపడడం తెలిసిందే. అయితే వారం రోజులుగా ఈ వెబ్‌సైట్లు మళ్లీ ఇం టర్నెట్‌లో ప్రత్యక్షమవడం, అనేక భాషలకు చెందిన కొత్త సినిమాలను వస్తుండంతో సినీ వర్గాలు ఆందోళనకు గురై దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాయి. ఫిలిం ఛాంబర్ తరపున అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సైబర్‌క్రైం పోలీసులు కేసు నమోదు చేసి ఈ వెబ్‌సైట్లకు అందుతున్న సర్వర్లు ఎక్కడ ఉన్నాయని ఆరా తీయగా దీని మూలాలు విదేశాల్లో ఉందని తేలింది. గతంలో వీటిని నిర్వహించిన రవి కూడా విదేశాల నుంచే సర్వర్ కలాపాలను సాగించడం విదితమే. తాజా ఘటనలో తన ప్రమేయం లేదని రవి పోలీసులకు చెప్పగా విదేశాల్లో గతంలో ఇతనితో కలిసి ఈ గోల్‌మాల్‌లో పాలు పంచుకున్న నేరాళ్ల పాత్రపై పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రవితో కలిసి పనిచేసిన వివిధ విదేశీయుల వివరాలను సైబర్ క్రైం పోలీసులు సేకరిస్తున్నారు.

# రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు

## 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

### ప్రారంభించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త: వానాకాలం సాగు ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు మేలు చేసేందుకు పచ్చిరొట్ట, జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలను 50 శాతం భారీ రాయితీతో అందిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు రైతువేదిక కార్యక్రమంలో భాగంగా సచివాలయంలో మంగళవారం పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారికంగా ప్రారంభించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా విత్తనాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి, భూసారాన్ని పెంచేందుకు పచ్చిరొట్ట పంటలను ఎక్కువగా సాగు చేయాలన్నారు. సేంద్రీయ పద్ధతుల ద్వారా భూమిని కాపాడుకుంటూనే అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. కాగా.. నిస్సారంగా మారిన నల్లటిబడ్డ భూములను తిరిగి సాగులోకి తెచ్చేందుకు, వాటి పునరుద్ధరణకు రైతులు జిప్సంను వినియోగించాలని మంత్రి తుమ్మల సూచించారు. ఆదేవిధంగా సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, రైతులకు అధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టే ఆయిల్ పామ్ వంటి లాభదాయకమైన పంటల వైపు అన్నదాతలు దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు.

**ఆధునిక గిడ్డంగుల నిర్మాణం..**

ఆధునిక గిడ్డంగుల నిర్మాణం కోసం టీజీ ఆగ్రోస్, టీజీ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఒయూ) కుదిరింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల సమక్షంలో ఇరు సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందం ద్వారా 23 ఎకరాల ప్రభుత్వ భూమిలో టీజీ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ సొంత నిధులతో 85 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఆధునిక గిడ్డంగులను నిర్మించనుంది. ఈ నిర్మాణ పనులను 15 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. రైతులు తమ పంట ఉత్పత్తులను సురక్షితంగా నిల్వ చేసుకునేందుకు ఈ గిడ్డంగులు ఎంతో ఉపయోగపడతాయని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల తెలిపారు. మార్కెట్ పరిస్థితులను అనుసరించి రైతులు సరైన సమయంలో తమ ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి రక్షించడంలో కూడా ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందన్నారు. భూములు మార్పిడి ద్వారా ప్రభుత్వ ఆస్తులు సమర్థవంతంగా వినియోగంలోకి రావడంతోపాటు రైతులకు మరిన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయ మౌలిక వసతుల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులకు నిల్వ, మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపర్చేందుకు మరిన్ని చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

# కెఆర్‌ఎంబి సమావేశం మరోసారి వాయిదా

## 21న తెలంగాణ కేబినెట్ భేటీ

హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త: తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల వాటాలు, ఇతర కీలక అంశాలపై చర్చించేందుకు ప్రతిపాదించిన కృష్ణా నది యాజమాన్య బోర్డు 21వ సమావేశం మరోసారి వాయిదా పడింది. ఉభయ రాష్ట్రాల ప్రభుత్వాల ముందస్తు రాజకీయ, పరిపాలనా ముఖ్యాంశాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. వాస్తవానికి 21వ బోర్డు సమావేశాన్ని మొదట ఈ నెల 14న నిర్వహించాలని నిర్ణయించారు. అయితే అదే రోజున ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం ఖరారు కావడంతో సమావేశాన్ని ఈ నెల 21కి వాయిదా వేస్తూ గతంలో నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ నెల 21న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కానుంది. దీంతో కీలకమైన కెఆర్‌ఎంబి సమావేశాన్ని మరోసారి వాయిదా వేయాల్సిందిగా తెలంగాణ ప్రభుత్వం బోర్డును కోరింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని పరిశీలించిన కృష్ణా బోర్డు ఈ నెల 21న జరగాల్సిన సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించింది. సమావేశ నిర్వహణకు సంబంధించిన తదుపరి తేదీని త్వరలోనే వెల్లడిస్తామని కృష్ణా బోర్డు స్పష్టం చేసింది. ఈ మేరకు సమాచారాన్ని ఇరు రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులకు అధికారికంగా తెలిపింది.

## సిఐ కాదు.. కామాంధుడు!

# మోసపోయిన యువతి ఫిర్యాదుతో కేసు నమోదు, ముందస్తు బెయిల్

### ఆరోపణలు నిర్ధారణతో డిజిపి ఆఫీస్‌కు అటాచ్

ఖమ్మం క్రైమ్, ప్రభాతవార్త: కాపాడాల్సిన రక్షక భటుడే.. కామంతో కాటు వేశాడు. కంచే చేను మేసిన చందంగా.. న్యాయం కోసం అని తన దగ్గరకు వచ్చిన మహిళను లోబరుచుకుని గర్భవతిని చేశాడు. భర్తతో బలవంతంగా విడాకులు ఇప్పించి అన్ని విధాలుగా మహిళను వాడుకుని చివరకు మొహం చాటు వేయడం తో బాధిత మహిళ పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది.



2023లో ఖమ్మం మహిళా పోలీస్ స్టేషన్‌లో రాజు నాయక్ సీఐగా ఉండగా ఓ మహిళ తన భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు నుంచి ఫోన్ నంబర్ తీసుకున్న సీఐ, న్యాయం చేస్తానని నమ్మించి తరచూ ఫోన్లు, మెసేజ్‌లు చేయడం ప్రారంభించాడు. అనంతరం పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఆమెను లోబర్చు కున్నాడు. ఈ క్రమంలో బాధితురాలు గర్భం దాల్చడంతో తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసింది. అయితే, సీఐ ఆమెకు బలవంతంగా కొన్ని ట్యాబ్లెట్లు మింగించడంతో గర్భస్రావం అయిందని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. ఆ తర్వాత కూడా పెళ్లి విషయాన్ని దా టవేస్తుండటంతో విసిగిపోయిన ఆమె ఈ నెల 7న ఖమ్మం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు బి.ఎన్.ఎస్ సెక్షన్ 69 ప్రకారం కేసు నమోదు చేశారు. కేసు నమోదు కావడం తో సీఐ రాజునాయక్ పరారీలోకి వెళ్లి, జడ్జిలప ముందస్తు బెయిల్ పొందినట్లు సమాచారం. మరోవైపు, ఈ ఘటనపై జరిగిన అంతర్గత విచారణలో సీఐ వేధింపులకు పాల్పడినట్లు తేలడంతో ఉన్నతాధికారులు అతడిని డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. కాగా ఈ ఘటన పోలీస్ శాఖలో తీవ్ర సంచలనం రేకెత్తించింది.

# నిర్మల్‌లో రోడ్డు ప్రమాదం

## ఆర్టీసీలో అద్దె బస్సు డ్రైవర్ మృతి

హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త: నిర్మల్ జిల్లాలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీలో అద్దె బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న వ్యక్తి మరణించాడు. జిల్లాలోని మామడ మండలంలోని కొరిటికల్ గ్రామ సమీపంలో బైక్‌పై నిర్మల్ నుంచి తన సొంత గ్రామానికి వస్తున్న కొం డ భూమేష్ (42)ను ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ బలంగా ఢీకొంది. ఈ ఘటనలో భూమేష్ తలకు గాయమై అక్కడికక్కడే చనిపోయాడు. భూమేష్ పదేళ్లుగా నిర్మల్ జిల్లాలో ఆర్టీసీలో అద్దె బస్సులో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య ఇద్దరు కుమారులు వున్నారు. భూమేష్ మృతదేహా నికి మంగళవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించిన పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆర్టీసీ సిబ్బంది ఆత్మనయాభాల మధ్య అతని అంత్యక్రియలు స్వగ్రామంలో జరిగాయి. భూమేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆర్టీసీ సిబ్బంది కోరారు.


తెలంగాణ ప్రభుత్వము
సాగునీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ

"హైదరాబాద్, ఎర్రమంజిల్‌లోని జలసౌధ బిల్డింగ్ కాంప్లెక్సు పెయింటింగ్ మరియు మరమ్మతు పనులు" అనే పని కొరకు టెండర్లను ఆహ్వానించడమైనది. ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు నెం. 04/2026-27, తేది: 18.05.2026, ECV: రూ.48,14,950/-. బిడ్ల స్వీకరణ చివరి తేదీ & సమయము తేది: 28.05.2026 సమయం: 11.00 గంటల వరకు. గమనిక: మిగతా వివరముల కొరకు www tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.
సం/- ఐ. శ్రీనివాస్, పర్యవేక్షక అధికారి, I & CADD జలసౌధ సర్కిల్, హైదరాబాద్, రెడ్ హిల్స్, హైదరాబాద్, ఫోన్: 040-23394218
DIPR.No.2661-PP/CL/Advt/1/2026-27, తేది: 19.05.2026



తెలంగాణ ప్రభుత్వం
తూప్రాన్ మునిసిపాలిటీ కార్యాలయం, మెదక్ జిల్లా
ఇ-మెయిల్: municipalitytoopran@gmail.com
సంప్రదించవలసిన నం: 9849069769/9490066885/9866296751
టెండర్ నెం: E1/98/2026 తేది: 18.05.2026
[illegible]
29.05.2026 ... 29.05.2026 ...
సం/-, మునిసిపల్ కమిషనర్, తూప్రాన్ మునిసిపాలిటీ.
DIPR.NO. 2614-PP/CL/ADVT/1/2026-27 తేది: 19.05.2026



BHEL
భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్
(ఒక భారత ప్రభుత్వరంగ సంస్థ)
రామచంద్రపురం, హైదరాబాద్-502032
మానవ వనరుల యాజమాన్యం
ప్రకటన నెం: అప్రెంటిసెస్/2026/01
అప్రెంటిస్ చట్టం 1961 ప్రకారం, రామచంద్రపురంలోని BHEL జనరల్ హాస్పిటల్లో ఒక సంవత్సరం కాలానికి వొకేషనల్ అప్రెంటిస్‌లుగా (MLT - 16 పోస్టులు, MPHW - 09 పోస్టులు) నియామకం కొరకు BHEL HPEP, హైదరాబాద్ వారు అర్హత మరియు ఆసక్తి గల అభ్యర్థులనుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. వొకేషనల్ అప్రెంటీస్‌లుగా ఎంపికైన అభ్యర్థులకు అప్రెంటిషిప్ మార్గదర్శకాల ప్రకారం నెలవారీ స్టైపెండ్ చెల్లించబడును. ఆసక్తి మరియు అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు సమర్పణ మరియు ఇతర వివరములు సంబంధించిన పూర్తి సమాచారం కోసం మా వెబ్‌సైట్ https://hpep.bhel.com లో అందుబాటులో ఉన్న వివరణాత్మక ప్రకటనను చూడగలరు.



తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (LA) శాఖ
రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం, వికారాబాద్, వికారాబాద్ జిల్లా
ఫారం-VII
(చట్టం-30/2013లోని రూల్-25లో గల సబ్ రూల్ (1) మరియు సెక్షన్ 19(1)ను చూడండి)
డిక్లరేషన్
కలెక్టర్ కార్యాలయం ఫైల్ నెం. ఇ/2754/2025 తేది: 16.05.2026
రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం ఫైల్ నెం. బి/16541/2025 తేది: 15.05.2026
గెజిట్ నెం. 51/2026 తేది: 16.05.2026
వికారాబాద్ జిల్లా, పూడూరు మండలం, తుర్కయంజాల్ పల్లి గ్రామంలో గల మొత్తం Ac. 22-28 గుంటల విస్తీర్ణం కొరకు భూమి NH-167N పై ఐఆర్‌ఆర్ వద్ద గల ఔటర్ రింగ్ రోడ్ (ORR) నుండి నాగారం వరకు 81 కి.మీ పొడవు రేడియల్ రోడ్ -2 నిర్మాణం కొరకు ప్రజా ప్రయోజనార్థం అవసరమై ఉన్నదని తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, వికారాబాద్ వారు భావిస్తున్నారు.
అందువలన, వికారాబాద్ జిల్లా, పూడూరు మండలం, తుర్కయంజాల్ పల్లి గ్రామంలో పై సదరు ప్రాజెక్టు కొరకు సేకరణ క్రింద భూమి Ac. 22-28 గుంటల ఎకరాల అనగా 9.016 హెక్టార్లు ప్రామాణిక కొలతలతో ఎక్కువ లేదా తక్కువ భూమి యొక్క సవివర వివరాలు దిగువ విధంగా ఉన్నవి.
షెడ్యూల్
జిల్లా: వికారాబాద్ మండలం: పూడూరు గ్రామం: తుర్కయంజాల్ పల్లి

| క్ర.సం. | సర్వే నెం. | | | విస్తీర్ణం (ఎ-గుం) | ఆసక్తి వ్యక్తులు పేరు & చిరునామా | తూర్పు | పడమర | ఉత్తరం | దక్షిణం | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 16ఎ/1/1/1 | పట్టా | మెట్ట | 0-13 | [illegible] | విలేజ్ తుమ్మల పల్లి | 17 | రోడ్డు | 19 | - | - | - |
| 2 | 16ఎ/1/1/2 | పట్టా | మెట్ట | 0-17 | గొల్ల వెంకటేష్ తండ్రి బాలయ్య | విలేజ్ తుమ్మల పల్లి | 17 | రోడ్డు | 19 | - | - | - |
| 3 | 16ఎ/2 | పట్టా | మెట్ట | 0-32 | [illegible] | విలేజ్ తుమ్మల పల్లి | 17 | రోడ్డు | 19 | - | - | - |
| 4 | 16ఎ/1/1 | పట్టా | మెట్ట | 0-13 | [illegible] | విలేజ్ తుమ్మల పల్లి | 17 | రోడ్డు | 19 | - | - | - |
| 5 | 19ఎ/1 | పట్టా | మెట్ట | 1-33 | [illegible] | విలేజ్ తుమ్మల పల్లి | రోడ్డు | 16 | 20 | - | - | - |
| 6 | 19ఎ/2 | పట్టా | మెట్ట | 1-02 | [illegible] | విలేజ్ తుమ్మల పల్లి | రోడ్డు | 16 | 20 | - | - | - |
| 7 | 19ఎ/7/1 | పట్టా | మెట్ట | 0-23 | [illegible] | విలేజ్ తుమ్మల పల్లి | రోడ్డు | 16 | 20 | - | - | - |
| 8 | 19/ఎ/1/1 | పట్టా | మెట్ట | 0-16 | [illegible] | విలేజ్ తుమ్మల పల్లి | రోడ్డు | 16 | 20 | - | - | - |
| 9 | 19ఎ/3 | పట్టా | మెట్ట | 0-07 | [illegible] | విలేజ్ తుమ్మల పల్లి | రోడ్డు | 16 | 20 | - | - | - |
| 10 | 19ఎ/6/1 | పట్టా | మెట్ట | 0-29 | [illegible] | విలేజ్ తుమ్మల పల్లి | రోడ్డు | 16 | 20 | - | - | - |
| 11 | 19ఎ/5 | పట్టా | మెట్ట | 0-18 | [illegible] | విలేజ్ తుమ్మల పల్లి | రోడ్డు | 16 | 20 | - | - | - |
| 12 | 40ఎ/1 | పట్టా | మెట్ట | 0-04 | [illegible] | 39, 41 | యాచారం గూడ | రోడ్డు | 31 | - | - | - |
| 13 | 40ఎ/2/1/1 | పట్టా | మెట్ట | 0-04 | [illegible] | 39, 41 | యాచారం గూడ | రోడ్డు | 31 | - | - | - |
| 14 | 41ఎ/2 | పట్టా | మెట్ట | 0-34 | [illegible] | రోడ్డు | 40 | రోడ్డు | 37, 38, 39 | - | - | - |
| 15 | 41ఎ/3 | పట్టా | మెట్ట | 1-18 | [illegible] | రోడ్డు | 40 | రోడ్డు | 37, 38, 39 | - | - | - |
| 16 | 42/ఎ | పట్టా | మెట్ట | 0-01 | [illegible] | 43 | 57 | 44 | రోడ్డు | - | - | - |
| 17 | 44 ఎ3 | పట్టా | మెట్ట | 1-08 | [illegible] | 45 | 56, 57 | 55 | 42, 43 | - | - | - |
| 18 | 44 ఎ4 | పట్టా | మెట్ట | 0-30 | [illegible] | 45 | 56, 57 | 55 | 42, 43 | - | - | - |
| 19 | 45 ఎఎ 12/1 | పట్టా | మెట్ట | 0-05 | [illegible] | 46, 47, 48, 49 | 43, 44, 55 | 50 | రోడ్డు | - | - | - |
| 20 | 45 ఎ6/3 | పట్టా | మెట్ట | 0-05 | [illegible] | 46, 47, 48, 49 | 43, 44, 55 | 50 | రోడ్డు | - | - | - |
| 21 | 45 ఎ5/2 | పట్టా | మెట్ట | 0-05 | [illegible] | 46, 47, 48, 49 | 43, 44, 55 | 50 | రోడ్డు | - | - | - |
| 22 | 45 ఎ5/3/2 | పట్టా | మెట్ట | 0-0250 | [illegible] | 46, 47, 48, 49 | 43, 44, 55 | 50 | రోడ్డు | - | - | - |
| 23 | 45 ఎ5/3/1 | పట్టా | మెట్ట | 0-0250 | [illegible] | 46, 47, 48, 49 | 43, 44, 55 | 50 | రోడ్డు | - | - | - |
| 24 | 45 ఎ 12/2 | పట్టా | మెట్ట | 0-05 | [illegible] | 46, 47, 48, 49 | 43, 44, 55 | 50 | రోడ్డు | - | - | - |
| 25 | 45 ఎ2/2 | పట్టా | మెట్ట | 0-05 | [illegible] | 46, 47, 48, 49 | 43, 44, 55 | 50 | రోడ్డు | - | - | - |
| 26 | 45 ఎ1 2/1 | పట్టా | మెట్ట | 0-11 | [illegible] | 46, 47, 48, 49 | 43, 44, 55 | 50 | రోడ్డు | - | - | - |
| 27 | 45 ఎ1 1/2 | పట్టా | మెట్ట | 0-11 | [illegible] | 46, 47, 48, 49 | 43, 44, 55 | 50 | రోడ్డు | - | - | - |
| 28 | 45 ఎఎ 11/2 | పట్టా | మెట్ట | 0-10 | [illegible] | 46, 47, 48, 49 | 43, 44, 55 | 50 | రోడ్డు | - | - | - |
| 29 | 47/ఎ2 | పట్టా | మెట్ట | 0-04 | [illegible] | రోడ్డు | 45 | 48, 49 | 46 | - | - | - |
| 30 | 48 ఎ | పట్టా | మెట్ట | 1-07 | [illegible] | రోడ్డు | 45, 49 | రోడ్డు | 47 | [illegible] | - | - |
| 31 | 48 ఎఎ | పట్టా | మెట్ట | 0-14 | [illegible] | రోడ్డు | 45, 49 | రోడ్డు | 47 | [illegible] | 1 | - |
| 32 | 49/1 | పట్టా | మెట్ట | 0-06 | [illegible] | 48 | 45 | 50 | 45 | - | - | - |
| 33 | 57ఎ/1 | పట్టా | మెట్ట | 0-37 | [illegible] | 44 | రోడ్డు | 56 | రోడ్డు | - | - | [illegible] |
| 34 | 58ఎ/1/2/1/1/1 | పట్టా | మెట్ట | 0-10 | [illegible] | రోడ్డు | 59 | 70 | రోడ్డు | - | - | - |
| 35 | 58ఎ/1/2/1/1/2 | పట్టా | మెట్ట | 0-10 | [illegible] | రోడ్డు | 59 | 70 | రోడ్డు | - | - | - |
| 36 | 58ఎ/2/2 | పట్టా | మెట్ట | 0-10 | [illegible] | రోడ్డు | 59 | 70 | రోడ్డు | - | - | - |
| 37 | 58ఎ/2/1/1/2 | పట్టా | మెట్ట | 0-10 | [illegible] | రోడ్డు | 59 | 70 | రోడ్డు | - | - | - |
| 38 | 59/2/3 | పట్టా | మెట్ట | 0-02 | [illegible] | 58 | 60 | 61 | రోడ్డు | - | - | - |
| 39 | 59ఎ/1/2/3 | పట్టా | మెట్ట | 0-20 | [illegible] | 58 | 60 | 61 | రోడ్డు | - | - | - |
| 40 | 59/2/1 | పట్టా | మెట్ట | 1-00 | [illegible] | 58 | 60 | 61 | రోడ్డు | - | - | - |
| 41 | 59ఎ/1/2/1 | పట్టా | మెట్ట | 0-13 | [illegible] | 58 | 60 | 61 | రోడ్డు | - | - | - |
| 42 | 59/1/2 | పట్టా | మెట్ట | 0-11 | [illegible] | 58 | 60 | 61 | రోడ్డు | - | - | - |
| 43 | 59ఎ/1/3 | పట్టా | మెట్ట | 0-12 | [illegible] | 58 | 60 | 61 | రోడ్డు | - | - | - |
| 44 | 59/3/1 | పట్టా | మెట్ట | 0-31 | [illegible] | 58 | 60 | 61 | రోడ్డు | - | - | - |
| 45 | 59/1/2 | పట్టా | మెట్ట | 1-00 | [illegible] | 58 | 60 | 61 | రోడ్డు | - | - | - |
| 46 | 60/2/1 | పట్టా | మెట్ట | 0-03 | [illegible] | 59, 61 | విలేజ్ యాచారం గూడ | 62 | రోడ్డు | - | - | - |
| 47 | 60/2 | పట్టా | మెట్ట | 1-24 | [illegible] | 59, 61 | విలేజ్ యాచారం గూడ | 62 | రోడ్డు | - | - | - |
| మొత్తం విస్తీర్ణం | | | | ఎ. 22.28 గుంటలు | | | | | | | | |

చట్టం నెం. 30/2013 లోని సెక్షన్ 15 క్రింద పేర్కొనబడిన విధంగా ఆసక్తి గల వ్యక్తులు అభ్యంతరాలు విన్న తరువాత మరియు తగు విచారణ అనంతరం పై పేర్కొన్న భూమి సేకరణ కొరకు ప్రతిపాదించడమైనది. ... పునరావాస, పునఃపరిష్కార ... 
ప్రాజెక్టు నిర్మాణ దశలో అవసరమైన ప్రదేశంలో ... 
భూమి యొక్క ప్లాన్ ... భూ సేకరణ అధికారి & జిల్లా వికారాబాద్ వారి కార్యాలయంలో పనివేళల్లో తనిఖీ చేసుకోవచ్చును.
సం/- తహశీల్దార్ పూడూరు మండలం | సం/- రెవెన్యూ డివిజనల్ అధికారి/ఎల్.ఎ.ఓ. వికారాబాద్ డివిజన్ | సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వికారాబాద్ జిల్లా | సం/- జిల్లా కలెక్టర్ వికారాబాద్ జిల్లా
DIPR R.O. NO. 214/LA/PP-Advt/Agency/2026-27

వార్త

ఏదైనా మంచి సాధించాలనుకున్నప్పుడు శ్రమించే భావం, విమర్శలను భరించే సహనం ఉండాలి.

- షేక్‌స్పియర్

# ముంచుకొస్తున్న సూపర్ ఎల్‌నినో!

పసిఫిక్ మహా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరిగే వాతావరణ పరిస్థితే 'ఎల్‌నినో' 2026లో ఎల్‌నినో చుట్టుముట్టి అసమశీతోష్ణస్థితి వాతావరణంలో వడదెబ్బ, వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్తాయని వస్తున్న హెచ్చరికలు మానవాళిని భయభ్రాంతుల్ని చేస్తున్నాయి. ఇప్పటికే 'ఎల్‌నినో' పరిస్థితులున్నాయి. అది సూపర్ ఎల్‌నినోగా మారబోతున్నాయనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. నేడోరేపో 'సూపర్ ఎల్‌నినో' తప్పదనిపిస్తోంది. ప్రపంచ వాతావరణంలో ఎల్‌నినో మామూలుగా వచ్చే పరిస్థితి. కాగా సూపర్ ఎల్‌నినో ప్రత్యేక పరిస్థితులలో చూస్తాము. 1982-83లో, 1997-98 లోనూ ఆ తరువాత 2015-16లలో ఈ వాతావరణ పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రపంచ ఉష్ణోగ్రత రెండు డిగ్రీల సెంటీగ్రేడ్కు పెరిగితే దానిని సూపర్ ఎల్‌నినోగా భావిస్తారు. ఎల్‌నినో, సూపర్ ఎల్‌నినో ఇప్పుడు తరచూ వినిపిస్తున్న మాటలు. ఏటా మహాసముద్రాలు ఉపరితల ఉష్ణోగ్రతలు పెరుగుతుంటాయి. అయితే ఉష్ణ మండలాలు మీదుగా వీచే తూర్పుగాలులకు ఈ అత్యధిక ఉష్ణోగ్రతలు ప్రత్యేక అనుభూతులు కల్పిస్తాయి. ఇవి తట్టుకోలేనివి. ఈ గాలులు బలహీన పడినప్పుడు మహా సాగరాల ఉపరితల ఉష్ణోగ్రతలు బాగా పెరుగుతాయి. ఫలితంగా భూమ్యుపరితల వాతావరణంలో తీవ్ర మార్పులు చోటు చేసుకుంటాయి. దీంతో కొన్నిచోట్ల వరదలు సంభవిస్తాయి. మరి కొన్ని ప్రాంతాల్లో ఎండలు మండిపోతాయి. ఇటువంటి పరిస్థితినే ఎల్ నినో అంటారు. సముద్రపు ఉష్ణోగ్రతలు సగటు కంటే 0.5 డిగ్రీల సెల్సియస్ పెరగుతాయన్నమాట. అయితే సూపర్ ఎల్‌నినో స్థితిలో సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు రెండు డిగ్రీల సెల్సియస్ కన్నా అధికం అవుతాయి. ఫలితంగా అకస్మాత్తుగా వరదలు వస్తాయి. అడవులు తగలపడతాయి. ఈ నేపథ్యంలోనే సూపర్ ఎల్‌నినో పరిస్థితులు ప్రపంచాన్నే భయపెడుతున్నాయి. 1997-98లో ఒకసారి భారత్‌లో సూపర్ ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండి వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. దక్షిణాసియాలో నైరుతి, ఈశాన్య రుతుపవనాలు ఈసారి బలహీనంగా ఉండి సగటు కన్నాతక్కువ వర్షపాతాన్ని నమోదుచేస్తాయి. సాధారణ వర్షపాతం ఉండే చోట కరువు, వర్షాభావం ఉన్నచోట భారీ వర్షాలు కురవడమే దీని ప్రత్యేకత. వర్షాధార పంటలు ఎక్కువగా దెబ్బతింటాయి. మన ప్రాంతంలో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక మహారాష్ట్రలో అధికంగా ఉంటుంది. తీర ప్రాంతాల్లో అస్థిర వర్షాలు తప్పవు. మునుపెన్నడూ లేనంత అసాధారణమైన వాతావరణ పరిస్థితులు రాబోతున్నాయి. మొదటిసారిగా 'సూపర్ ఎల్ నినో' బలంగా వచ్చే అవకాశాలు ఉన్నాయని పరిశోధకులు చెప్పే విషయాలు గుబులు పుట్టిస్తున్నాయి. ప్రపంచంలోని కొన్ని ప్రాంతాలలో కరవులు ఏర్పడితే, మరికొన్ని చోట్ల వరదలు ఏర్పడతాయి. ఈ సంవత్సరాన్ని అత్యంత వేడిమి సంవత్సరంగా పేర్కొంటున్నారు. నైరుతి రుతుపవనాలు ముందేవచ్చినా, అత్యంత ఉష్ణోగ్రతల మధ్యవర్షపాతం కూడా తగినంతగా ఉండదని అంచనా వేస్తున్నారు. అత్యధికస్థాయిసముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలను చవిచూస్తామని ఈసీఎండబ్ల్యూఎఫ్ అధికారిక వాతావరణ పర్యవేక్షకకార్యక్రమం కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్ తెలిపిన వివరాల ప్రకారం 2026ఏప్రిల్లో సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు అత్యధిక స్థాయికి చేరినట్లు గుర్తించారు. ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ నెలలో ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదైన విషయం తెలిసిందే!ఇది గతం కన్నా 1.43 డిగ్రీ సెల్సియస్ అధికంగా నమోదైంది. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడమనే ప్రక్రియ తరచు గమనిస్తున్నదే!. 'ఎల్‌నినో' కారణంగానే ఇలాంటి పరిస్థితులు ఎదురౌతాయి. తాజా అంచనాలను బట్టివివిధ వాతావరణ పరిశోధనా సంస్థలు 'సూపర్ ఎల్‌నినో' హెచ్చరికలు చేస్తున్నాయి. ఈ మార్చి, ఏప్రిల్ నెలల్లో పడమటి గాలులు మధ్య, తూర్పు పసిఫిక్ ప్రాంతాలకు బలంగా కదులుతున్నాయి. ఈఏడాది సెప్టెంబర్ నాటికల్లా ఉష్ణోగ్రతలో తేడా రెండు డిగ్రీలసెంటీగ్రేడ్ స్థాయికి చేరుకునే అవకాశాలు ఎక్కువ. అదే జరిగితే 'సూపర్ ఎల్‌నినో' ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. పరిశోధకులు చెబుతున్న హెచ్చరికలను బట్టితీవ్ర ఉష్ణోగ్రత మార్పులను గమనిస్తామని, వేడిమి మరో మూడు డిగ్రీల సెంటీ గ్రేడుకు చేరినా ఆశ్చర్యపడనక్కర్లేదు. ఈసారి ఎల్ నినో తీరు ఎన్నడూ లేనంత బలంగా ఉంటుంది. జూన్ మాసార్థంలో సూపర్ ఎల్‌నినోప్రభావం గురించి మరింత విస్తృతంగా చర్చించుకోగలుగుతాము. ప్రపంచమంతా శీతోష్ణ స్థితులు బాగా మారిపోనున్నాయి. దీని ఫలితమే పంటలు సమృద్ధిగా పండకపోవడం, సముద్ర తీరాలలోని పగడపు కొండలు బ్లీచ్ అవడం కూడా చూడవచ్చు. కొన్ని ప్రాంతాలలో ప్రజారోగ్యం దెబ్బతినే అవకాశం ఉంటుంది. భారతదేశంలో పొడి వాతావరణం బాగా పెరిగి కరవులు, హీట్ వేవ్ ప్రభావాన్ని చూస్తాము. వేసవి వేడిమి మరింత తీవ్రంగా ఉంటుంది. ఇలా అత్యధిక వేడి పౌరులపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. పంటల దిగుబడులు తగ్గుతాయి. చలికాలంలోనూ తేమ ఎక్కువగా నమోదవుతుంది. అననుకూల పరిస్థితులు ఎదురుకావచ్చు. సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు ఇప్పటికే గరిష్టానికి చేరాయి. వాతావరణ హెచ్చరికలను పాటించాలి. ఈ సంవత్సరం నైరుతి రుతు పవనాలు ముందే వచ్చినా, సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశాలున్నాయని ఐఎండీ అంచనా వేసింది. భూగర్భజలాలు తగ్గిపోయి నీటి ఎద్దడి ఏర్పడవచ్చు. ఫలితంగా ఈ ఏడాది రైతాంగానికి గడ్డు కాలం నుంచి తప్పుకోవడానికి అప్రమత్తంగా ఉండడమొక్కటే శరణ్యం.

# భారత్, ఇటలీ వ్యూహాత్మక భాగస్వామ్యం

భారత్ ఇటలీ ద్వైపాక్షిక సంబంధాలు స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలు, భవిష్యత్తుపై సంయుక్త ఆశావహ దృక్పథం ప్రాతిపదికన ఇటీవలి కాలంలో అసాధారణ వేగంతో విస్తరిస్తూ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంగా రూపాంతరం చెందాయి. ప్రస్తుత 21వ శతాబ్దంలో ఆయా దేశాల ఆవిష్కరణ సామర్థ్యం, ఇంధన మార్పిడి నిర్వహణ, వ్యూహాత్మక సార్వభౌమత్వ బలోపేతం తదితరాలు ప్రజాశ్రేయస్సు, జాతీయ భద్రత వంటి అంశాలపై ఆధారపడి ఉన్నాయి. ఈ విషయంలో మా ఉమ్మడి అవగాహనను రెండు దేశాలమధ్య సహకారం ప్రస్ఫుటం చేస్తోంది. ఈ దిశగా కొత్త సంకల్పాల సాకారానికి, పరస్పర పూరక బలాల ఏకీకరణ సహా ద్వైపాక్షిక బంధాన్ని మరింత పటిష్ఠంగా, వైవిధ్యభరితంగా తీర్చిదిద్దడంపై మా నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాం. ఇటలీ డిజైన్, తయారీ నైపుణ్యం, అంతర్జాతీయ స్థాయి సూపర్ కంప్యూటర్లతో పారిశ్రామిక కూడలిగా ప్రపంచంలో ఇటలీకి ప్రముఖ స్థానం ఉంది. అదేవిధంగా 100కు పైగా యూనికార్న్ సంస్థలు సహా 2,లక్షల అంకుర సంస్థలతో భారత్ శరవేగంగా ఆర్థిక వృద్ధిని సాధిస్తోంది. దీంతోపాటు ఇంజినీరింగ్ ప్రతిభ విస్తృతి, ఆవిష్కరణ వ్యవస్థాపనావరణ వ్యవస్థలను కలిగి ఉంది. రెండు దేశాలకు గల ఈ సామర్థ్యాల మధ్య శక్తిమంతమైన సమన్వయ సాధన లక్ష్యాన్ని మేం నిర్దేశించుకున్నాం. ఇది ఓ సాధారణ ఏకీకరణకు పరిమితం కాదు. మా పారిశ్రామిక బలాలను పరస్పరం బలోపేతం చేసుకునే విలువ వ్యవస్థను సంయుక్తంగా సృష్టిస్తుంది. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులు ఇనుమడించేందుకు ఐరోపా సమాఖ్య భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) బాటలు వేస్తుంది. రక్షణ ఏరోస్పేస్, కాలుష్య రహిత సాంకేతికతలు, యంత్రాలు, ఆటోమోటివ్ విడిభాగాలు, రసాయనఔషధ, జౌళి, వ్యవసాయ ఆహార, పర్యాటకం సహా మరిన్ని రంగాలపై 'ఎఫ్‌టీఏ' దృష్టి సారిస్తుంది. తద్వారా 2029 నాటికి ఇటలీ భారత్ మధ్య నిర్దేశిత 20 బిలియన్ యూరోల వాణిజ్య లక్ష్యాన్ని అధిగమించాలన్నది మా ఆకాంక్ష. 'మేడ్ ఇన్ ఇటలీ' అనేది అంతర్జాతీయంగా అత్యుత్తమ నాణ్యతకు పర్యాయ పదబంధం. ఇప్పుడిది 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమ నిర్దేశిత ఉన్నత నాణ్యత లక్ష్యంతో సహజ సమన్వయం ఏర్పరుచుకుంటుంది. ఈ నేపథ్యంలో భారత్ కోసం ఉత్పాదన దిశగా ఇటలీ వ్యాపార సంస్థలలో ఆసక్తి పెరుగుతోంది. మరోవైపు ఇటలీలో భారత పరిశ్రమల సంఖ్య కూడా పెరగడం (ప్రస్తుతం రెండువైపులా వీటి సంఖ్య 1000కి పైగానే) మా సరఫరా వ్యవస్థల ఏకీకరణను బలోపేతం చేసే సానుకూల సంకేతం. మా భాగస్వామ్యానికి సాంకేతిక ఆవిష్కరణలే పునాది. కృత్రిమమేధ, (ఏఐ), క్వాంటం కంప్యూటింగ్, అత్యాధునిక తయారీ, కీలక ఖనిజాలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు వంటి రంగాల్లో నేటి పురోగమన వేగం రాబోయే దశాబ్దాల్లో అసాధారణ పరిధిగల సాంకేతిక విప్లవంగా రూపుదిద్దుకోగలదు. ఈక్రమంలో చైతన్యవంతమైన భారత ఆవిష్కరణావరణ వ్యవస్థ, అత్యంత నైపుణ్యంతో వృత్తి నిపుణుల వనరులు, ఇటలీకిగల అత్యధునాతన పారిశ్రామిక సామర్థ్యం మేళవింపుతో పైన పేర్కొన్న రంగాలన్నిటా మా సహకారం సహజసిద్ధమైనదిగా, వ్యూహాత్మకంగా రూపొందుతుంది. రెండు దేశాల్లోని విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల మధ్య పెరుగుతున్న భాగస్వామ్యం ఈ పరిణామశీలతకు ఇతోధికంగా తోడ్పడుతుంది. ఇక భారత సార్వజనీన డిజిటల్ మౌలిక సదుపాయాలకు ఇప్పటికే అనేక దేశాల్లో ముఖ్యంగా వర్ధమాన ఆర్థిక వ్యవస్థలలో సానుకూల స్పందన లభిస్తోంది. కృత్రిమ మేధ రంగం మా రెండు దేశాలతోపాటుముఖ్యంగా ప్రపంచ ఆర్థికవ్యవస్థపైనా ఇప్పటికే తనదైన ముద్రవేసింది. ఈ ఆధునిక సాంకేతికత పురోగమనం బాధ్యతాయుతంగా, మానవాళి కేంద్రకంగా కొనసాగేలా చూడటంలో భారత్, ఇటలీ చాలాకాలం నుంచి పరస్పర సహకారంతో కృషి చేస్తున్నాయి. సాంకేతికత పరిజ్ఞానాలను మానవాళి కేంద్రకంగా ఉంచేందుకు 'మానవ్' పేరిట భారత్ ఒక దార్శనిక



భారత్, ఇటలీ ప్రధానమంత్రులు నరేంద్ర మోదీ, జార్జియా మెలోనీ


విధానం అనుసరిస్తోంది. అదేవిధంగా మానవతావాదసంప్రదాయంలో పాదుకున్న మానవకేంద్రక అల్గార్ఎథిక్స్‌ను ప్రోత్సహించడంలో ఇటలీ ముందంజ వేసింది. ఈ రెండు దృక్కోణాలు ప్రాతిపదికగా కృత్రిమ మేధ పరిజ్ఞానం సామాజిక సాధికారతను ఉత్తేజితం చేయాలన్నది మా భాగస్వామ్యం నిర్దేశించుకున్న లక్ష్యం. ఈ దిశగా భారత డిజిటల్ స్థాయిని, ఇటలీ నైతికపారిశ్రామిక నైపుణ్యాన్ని మేళవిస్తూ సాంకేతిక పరిజ్ఞానం మానవాళి ఔన్నత్యానికి సేవలందించేలా భరోసా ఇవ్వడమే మా విధానం. డిజిటల్ సహకారం, సామర్థ్య వికాసం, పటిష్ఠ సైబర్ మౌలిక సదుపాయాల కల్పనలో ఉత్తమ విధానాల ఆదాన ప్రదానం ద్వారా ప్రతిదేశం ఏఐని తీర్చిదిద్దుకోవాలన్నది మా నిశ్చితాభిప్రాయం. తదనుగుణంగా ప్రయోజనం పొందగలిగే సార్వత్రిక, విశ్వసనీయ, సమాన అవకాశాలుగల డిజిటల్ ప్రపంచ సృష్టి మా ధ్యేయం. ఇటలీ జీ7 అధ్యక్షతకు, న్యూఢిల్లీలో నిర్వహించిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 సత్ఫలితాలకు మూలం ఈ సంయుక్త దృక్పథమే. ఆధునిక సాంకేతికత వ్యక్తులకు స్థానభ్రంశం కలిగించదని లేదా వారి ప్రాథమిక హక్కులకు భంగం కలిగించదని, ప్రజల వాక్స్వాతంత్ర్యాన్ని లేదా ప్రజాస్వామ్య ప్రక్రియలను తారుమారు చేయదని ప్రస్ఫుటం చేయడమే. ప్రపంచం నానాటికీ పరస్పర సంధానితం అవుతున్న పరిస్థితులలో సరిగ్గా ఈ సమస్యను పరిష్కరించడంపైనే మానవ స్వేచ్ఛను, గౌరవాన్ని పరిరక్షించాలనే మా విధానం ఆధారపడి ఉంటుంది. అంతరిక్ష పరిశోధన, ఉపగ్రహ సాంకేతికతలలో భారత్ ఇప్పటికే అద్భుత ప్రగతి సాధించింది. ఇప్పుడిక ఇటలీ ఏరోస్పేస్ ఇంజినీరింగ్ నైపుణ్యం తోడ్పాటుతో సంయుక్త కార్యక్రమాలు చేపట్టడం సహా భవిష్యత్తరం సాంకేతిక పరిజ్ఞానాల రూపకల్పనకు గణనీయ అవకాశాలు అందివస్తాయి. ప్రపంచ దేశాల శ్రేయస్సుకు భరోసాలభించాలంటే జాతీయ భద్రతస్థిరత్వం అత్యావశ్యకం. కాబట్టే రక్షణభద్రత, వ్యూహాత్మక సాంకేతికతలు వంటి రంగాల్లో సహకార బలోపేతానికి ఇటలీ, భారత్ సంకల్పించాయి. కీలక సముద్ర మార్గాల భద్రతకు భరోసాతోపాటు ఉగ్రవాదం, అంతర్జాతీయ నేర నెట్‌వర్క్లు, మాదక ద్రవ్యాల దొంగ రవాణా, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా వంటి ముప్పులను ఎదుర్కొనగల సామర్థ్యాన్ని పటిష్ఠం చేయడంలో ఈ సహకారం దోహదం చేస్తుంది. మా భాగస్వామ్యానికి ఇంధన రంగం మరో మూలస్తంభం. వైవిధ్య భరిత ఇంధన వనరుల దిశగా ప్రపంచ ప్రస్థానంలో ఆవిష్కరణ, పెట్టుబడులు, సహకారం అత్యావశ్యకాలు. ఈ నేపథ్యంలో పునరుత్పాదక ఇంధనాల నుంచి హైడ్రోజన్ సాంకేతికతల దాకా, స్మార్ట్ గ్రిడ్ల నుంచి పునరుత్థాన మౌలిక సదుపాయాల వరకూ భారత్, ఇటలీ ఇప్పటికే సహకారం కొనసాగిస్తున్నాయి. గ్రీన్ హైడ్రోజన్ ఎగుమతుల కూడలిగా మారడం కోసం భారత్ కృషి ఫలితంగా మా భాగస్వామ్యానికి అసాధారణ సామర్థ్యం సమకూరుతోంది. ఈ నేపథ్యంలో భారత్ నేతృత్వాన ఏర్పడిన అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ), విపత్తు పునరుత్థాన మౌలిక సదుపాయాల కూటమి (సీడీఆర్ఐ), అంతర్జాతీయ జీవఇంధన కూటమి (జీబీఏ) వంటి సంకీర్ణ సంస్థల కృషిలో ఇతర దేశాలతోపాటు మా సహకారం కూడా కీలకం. భౌతిక, డిజిటల్, మానవ అనుసంధానమే మా భాగస్వామ్యాన్ని మరింతగా పెనవేసిన సూత్రం. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు కీలక కేంద్రాలైన ఇండోపసిఫిక్, మధ్యధరా ప్రాంతాల నడిబొడ్డున భారత్, ఇటలీ ఉన్నాయి. కాబట్టి, ఈ ప్రాంతాలను వేర్వేరు పరిధులుగా కాకుండా అంతకంతకూ పరస్పర సంధానితం అవుతున్న ప్రదేశాలుగా పరిగణించాలి. వాస్తవానికి హిందూ మహాసముద్రాన్ని ఐరోపాతో ముడిపెట్టే వాణిజ్య, సాంకేతిక, ఇంధన, డేటా సహా సమాలోచనలకు కీలక మార్గమైన భారత మధ్యధరా ప్రాంతం ఆవిర్భావానికి మా రెండు దేశాలే ప్రత్యక్ష సాక్షులు. సరిగ్గా ఈ పరస్పర సంధాన క్రమంలోనే మన స్నేహబంధం సహజ రీతిలో ఒక ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంగా పరిఢవిల్లుతూ రెండు ఖండాలను కలిపి, కొత్త ప్రపంచ గమనానికి రూపు దిద్దుతుంది. ఈ పరిస్థితుల నడుమ ఆధునిక రవాణా, మౌలిక సదుపాయాలు, డిజిటల్ నెట్‌వర్క్లు, ఇంధన వ్యవస్థలు, పటిష్ఠ సరఫరా వ్యవస్థలతో మన ప్రాంతాలను అనుసంధానించడమే లక్ష్యంగా పెట్టుకున్న దార్శనికతకు భారత్ మధ్యప్రాచ్య ఐరోపా ఆర్థిక కారిడార్ (ఐఎంఈసీ) ఒక ప్రతీక. ఈ దృక్కోణానికి వాస్తవికతను ఆపాదించడంలో ఇతర భాగస్వాములతో సమష్టిగా కృషి చేసేందుకు భారత్, ఇటలీల నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాయి. భారతీయ సంస్కృతి ప్రబోధించే ధర్మం అనే ఉదాత్త భావన మా చర్యలకు మార్గనిర్దేశం చేసే బాధ్యతా స్ఫూర్తిని ఉత్తేజితం చేస్తుంది. ఆ క్రమంలో నేటి పరస్పర సంధాన డిజిటల్ యుగంలోనూ వసుధైక కుటుంబకం(యావత్ ప్రపంచం ఒకే కుటుంబం) సూత్రం మానవాళి మొత్తాన్నీ ముడివేయడంలో శక్తిమంతంగా పనిచేస్తుంది. పునరుజ్జీవన పథంలో పయనించే ఇటలీ మానవతావాద సంప్రదాయం కూడా ఈ విలువలను సహజంగా ప్రతిబింబిస్తుంది. ప్రపంచంలోని ప్రతి వ్యక్తి గౌరవాన్ని, ప్రజలను, సమాజాలను ఏకం చేసే సంస్కృతికిగల అపార శక్తిని ఇది తేటతెల్లం చేస్తుంది. అందుకే, రెండు దేశాల ప్రజలకు కేంద్ర స్థానమిస్తూ బలమైన, భవిష్యత్ దృక్కోణ సహిత భారత్ఇటలీ వ్యూహాత్మక భాగస్వామ్యానికి పునాది వేయాలని మా సంయుక్త దార్శనికత లక్ష్యనిర్దేశం చేసుకుంది. •

– ప్రధాన మంత్రి నరేంద్రమోడీ



అందరిలోనూ శక్తిసామర్థ్యాలు ఎంతో కొంత ఉంటాయి. వాటిని వినియోగించుకోవడంలోనే అసలు సమస్య ఉంటుంది.

రామకృష్ణ పరమహంస



అంతరాయాలు కలుగుతున్న కొద్దీ సంకల్పాన్ని దృఢతరం చేసుకుంటూ పోవాలి.

శ్రీ రమణ మహర్షి

# రిటైర్డ్ ఉద్యోగుల పట్ల ఇంత నిర్లక్ష్యమా?

**తరిగోపుల నారాయణస్వామి**

దేశ నిర్మాణంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పోషిస్తున్న పాత్ర అమూల్యమైనది. ప్రభుత్వ పాలనను గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు నడిపించే శక్తి ఉద్యోగ వ్యవస్థ. విద్యావ్యవస్థను నిలబెట్టేది ఉపాధ్యాయ వర్గం. జీవితాంతం సేవలందించిన తరువాత కూడా సమాజానికి మార్గదర్శకులుగా నిలిచేవారు రిటైర్డ్ ఉద్యోగులు. అయితే ఇటువంటి వర్గాల పట్ల కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యం బాధాకరం. ముఖ్యంగా కరువుభత్యం సకాలంలో చెల్లించకపోవడం, వేతన సవరణలను ఆలస్యం చేయడం వంటి అంశాలు ఉద్యోగకుటుంబాల ఆర్థిక స్థితిని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ధరలు రోజురోజుకూ పెరుగుతున్నా ఉద్యోగుల ఆదాయం మాత్రం అదేస్థాయిలో ఉండిపోవడం అన్యాయం. కరవు భత్యం అనేది ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చే దయాదాక్షిణ్యం కాదు. అది వారి జీవన వ్యయాలను తట్టుకునేందుకు ఆర్థికరక్షణ. మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినప్పుడు ఉద్యోగుల కొనుగోలు శక్తి తగ్గిపోతుంది. ఆ లోటును భర్తీ చేయడానికే కరవు భత్యం ప్రవేశపెట్టబడింది. కానీ కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ భత్యాన్ని ఆలస్యంగా అమలు చేస్తున్నాయి. కొన్నిసార్లు ప్రకటించిన డీఏ బకాయిలను కూడా సంవత్సరాల తరబడి నిలిపివేస్తున్నారు. దీని వలన ఉద్యోగులు అప్పుల పాలవుతున్నారు. పెన్షనర్లు మరింతకష్టాల్లో పడుతున్నారు. ముఖ్యంగా వైద్య ఖర్చులు అధికమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో రిటైర్డ్ ఉద్యోగుల జీవితం భారంగా మారుతోంది. దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుతున్న ప్రతిదశలో కరవు భత్యం సమయానికి పెరగాలి. ఉద్యోగుల జీవన ప్రమాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. కానీ అనేక రాష్ట్రాల్లో రాజకీయ కారణాలు, ఆర్థిక క్రమశిక్షణ పేరిట ఉద్యోగుల హక్కులను వాయిదా వేస్తున్నారు. చాలాసందర్భాల్లో ఉపాధ్యాయులు తమ కుటుంబ అవసరాల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఇది సమాజానికి మంచిది కాదు. ఉపాధ్యాయుని ఆర్థిక భద్రతే విద్యావ్యవస్థకు బలమైన పునాది. వేతన సవరణ ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి జరగాలి. జీవనవ్యయ సూచికలు, ధరల పెరుగుదల, సామాజిక పరిస్థితులు, ఆర్థిక మార్పులు అన్నింటినీ పరిగణనలోకి తీసుకొని ఉద్యోగుల వేతనాలను పునఃసమీక్షించాలి. కానీ చాలా రాష్ట్ర ప్రభుత్వాలు వేతన సవరణలను సంవత్సరాల తరబడివాయిదా వేస్తున్నాయి. ఒకవైపు ఇంధన ధరలు పెరుగుతున్నాయి. మరోవైపు విద్యుత్ ఛార్జీలు, వైద్య ఖర్చులు, విద్య ఖర్చులు అమాంతం పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పాత వేతనాలతో జీవించడం ఉద్యోగులకు అసాధ్యమవుతోంది. మధ్యతరగతి కుటుంబాల జీవనం తీవ్ర సంక్షోభంలో పడుతోంది. వేతన సవరణ ఆలస్యం కావడం వల్ల ఉద్యోగుల కొనుగోలు శక్తి తగ్గిపోతోంది. దీని ప్రభావం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపైనా పడుతోంది. ఉద్యోగుల వినియోగ శక్తి తగ్గితే మార్కెట్‌లో వ్యాపారాలు కూడా మందగిస్తాయి. కాబట్టి ఉద్యోగుల వేతనపెంపు అనేది కేవలం వారిప్రయోజనం మాత్రమే కాదు, ఆర్థిక వ్యవస్థకు కూడా అవసరం. పెన్షనర్లు జీవితాంతం ప్రభుత్వానికి సేవలందించినవారు. కానీ చాలా చోట్ల పెన్షన్ సవరణలు కూడా ఆలస్యమవుతున్నాయి. డీఏ బకాయిలు ఇవ్వకుండా వాయిదా వేయడం అనేది వృద్ధులపట్ల అన్యాయం. వృద్ధాప్యంలో వైద్యసేవలు, మందులు, జీవన ఖర్చులు పెరుగుతున్నాయి. అలాంటి సమయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం పెన్షనర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఉద్యోగంలో ఉన్నప్పుడు ప్రభుత్వ నిబంధనలు పాటించిన వారు రిటైర్మెంట్ తర్వాత తమ హక్కుల కోసం పోరాడాల్సి రావడం దురదృష్టకరం. •

# ప్రజావాక్కు



## పునరుత్పాదక ఇంధన వనరులు అవసరం

ప్రస్తుతం ప్రపంచం తీవ్రమైన ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. శిలాజఇంధనాల నిల్వలు తరిగిపోతుండటం, అంతర్జాతీయ రాజకీయ ఉద్రిక్తతలు చమురు సరఫరాపై ప్రతికూలప్రభావాన్ని చూపుతున్నాయి. భారత్ తన చమురు అవసరాల కోసం అధిక శాతం ఇతర దేశాల దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఈకారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పెరిగిన ప్రతిసారీ మన ఆర్థిక వ్యవస్థపై పెనుభారం పడుతోంది. రూపాయి విలువ క్షీణించడం, రవాణా ఖర్చులు పెరగడం వల్ల సామాన్యుడిపై ధరల భారం అపరిమితంగా పెరుగుతోంది. ఈ ఇంధన విపత్తును సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే దేశ ప్రజలు మిత వ్యయాన్ని ఒక అలవాటుగా మార్చుకోవాలి. అనవసరమైన వాహన ప్రయాణాలను తగ్గించుకోవడం, ప్రజా రవాణావ్యవస్థను (బస్సులు, రైళ్లు)ఎక్కువగా వినియోగించడం వంటి చర్యలు చేపట్టాలి. విద్యుత్ వినియోగంలో పొదుపు పాటించడంతో వనరులను కాపాడుకోవచ్చు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## భారత్‌కు కొత్త సవాళ్లు

భారతదేశం శతాబ్దాలుగా వివిధ సంస్కృతులు, భిన్న ప్రజల సమ్మేళనంగా నిలిచింది. ప్రపంచంలో ఎక్కడైనా సంక్షోభం వచ్చినప్పుడు మానవతా దృక్పథంతో ఆశ్రయం కల్పించిన దేశంగా భారత్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. అయితే ఇటీవల ఈశాన్య భారతంలో మయన్మార్, మణిపూర్‌ప్రాంతాలనుంచి వచ్చిన శరణార్థుల పరిస్థితి మాత్రం అనిశ్చితితో నిండినదిగామారింది. వారిజీవితం భవి ష్యత్తు ఏమిటన్నప్రశ్నమధ్యలో నిలిచిపోయినట్లుగా కనిపిస్తోంది. మయన్మార్‌లో రాజకీయ అస్థిరత, సైనిక పాలన, అంతర్గతఘర్షణలు తీవ్రంగా పెరగడంతో వేలాదిమంది ప్రజలు సురక్షితమైన ఆశ్రయం కోసం తరలివచ్చారు.

- కె.రామారావు, నల్గొండజిల్లా

## గురుకులాల్లో సీట్లు భర్తీ చేయాలి

గురుకులాలలో ప్రతి తరగతిలో అన్నిసీట్లు భర్తీ చేయాలి. గ్యాప్ ఉన్న విద్యార్థులకు కూడా మార్కులను చూసి సీట్లు ఇవ్వాలి. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ గురుకులాలలో రిజర్వేషన్ విధానం తప్పనిసరిగా పాటించాలి. ప్రతి సెక్షన్‌లో 40సీట్లు భర్తీ చేయాలి. ప్రతి విద్యార్థికి టెస్టు బుక్కులు ఉండాలి. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలి.

- రాపాక రవీందర్, జనగాం

## చట్టం అందరికీ సమానం కాదా!

దొంగస్వాములు ప్రభుత్వ భూములు ఆక్రమించి , ఆశ్రమాల పేరుతో మోసం చేస్తుంటే, తన్ని తరిమేసి భూములను స్వాధీనం చేసుకోకుండా ఎందుకీ ప్రభుత్వం? ప్రకాశం ,తిరుపతి జిల్లా అధికారులుగత 20,25 సంవత్సరాలుగా దొంగబాబాల ఆశ్రమ నిర్వాహకులతో డ్రామాలు ఆడుతున్నారు. క్విడ్ ప్రోకో జరుగుతుందా అన్న అనుమానం వస్తుంది. మాకు వచ్చేది ఏమిలేదు. ప్రభుత్వ భూములు దొంగలపాలు కాకూడదు అన్నతపన అంతే! ప్రకాశం జిల్లా దొంగస్వామి ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకొండి అని 2021 లోనే ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆదేశించింది. ఇంతవరకు అతీ గతీ లేదు. తిరుపతి జిల్లాలో కల్కి ఫిర్యాదును హైకోర్టు కొట్టేసింది. దళితుల భూములను వారికి కలెక్టరు స్వాధీనం చెయ్యలేదు. ఈ విషయాన్ని పత్రికలకు, ముఖ్యమంత్రులకు, సీసీ ఎల్ఏకు, ప్రిన్సిపల్ సెక్రటరీలకు లెటర్లు రాశారు ఇంత బాధ్యతారాహిత్యమా? ముఖ్యమంత్రి ఐన వెంటనే స్వరూపానంద ఆక్రమించాడని విశాఖపట్నం దగ్గర భూములను ఎందుకుస్వాధీన చేసుకున్నారు?ఒకరికి ఒక న్యాయం ఇంకొకరికి అన్యాయమా!

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## సామాన్యుడి బతుకు భారం

రోజురోజుకు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, బంగారం, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వలన పేదవాడి బతుకు బండి ముందుకు సాగాలంటే అప్పులు జేయాల్సిన పరిస్థితి. ఎప్పుడూ ఏ ధర ఎంత మేరకు పెరుగుతుందో తెలియని అమాయక స్థితిలో కుమిలిపోతున్నడు. కంపెనీల నష్టాలు అధిగమించడం కొరకు సామాన్యుడి పై ఈ ధరలు పెంచి పేదవాడి నడ్డి విరుస్తున్న ప్రభుత్వాలు కలిసికట్టుగా పోరాటం చేస్తేనే కొద్దియైన మార్పులు సంభవించే అవకాశం ఉంది.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## వాటర్ షెడ్ అమలు చేయాలి

వాటర్‌షెడ్ అనేది తెలంగాణ రాష్ట్రానికి దానితో పాటు భూపరివేష్టిత రాష్ట్రాలకు వరం లాంటిది. అంత మాత్రమే కాదు భూపరివేష్టిత రాష్ట్రాలలో భూమి ఎగుడు దిగుడుగా ఉండడం వల్ల నీటిని ముఖ్యంగా వాన నీటిని ఆపి నీటిని భూమిలోకి ఇంకెట్టు చేసే సామార్థ్యం వీటికి ఉన్నది కాబట్టి భూపరివేష్టిత రాష్ట్రాలకు అది ఒక వరం. అంత మాత్రమే కాదు తెలంగాణ లాంటి రాష్ట్రాలలో ఉన్నఎర్ర చెక్క భూములు కూరగాయలు, పండ్ల తోటల పెంపకానికి ఉపయోగపడుతాయి. ప్రభుత్వం ఒక మిషన్ మోడ్‌లో వాటర్ షెడ్‌ను అమలు చేయాలి.

-భారత అవినాష్, జనగామ


గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి | ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# పాఠశాలలోనే ఇంటర్.. వరమా, భారమా?

**తిప్పర్తి శ్రీనివాస్**

ఇటీవలి కాలంలో భారతదేశ విద్యావ్యవస్థలో జరుగుతున్న మార్పులు, సంస్కరణలు సమాజంలో విస్తృత చర్చకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో కలపాలనే ప్రతిపాదన విద్యావేత్తలు, తల్లిదండ్రులు, విద్యార్థులు, ప్రభుత్వ వర్గాల మధ్య ఆసక్తికరమైన చర్చకు కారణమైంది. ప్రస్తుతం పదోతరగతి తర్వాత రెండు సంవత్సరాల పాటు జూనియర్ కాలేజీల్లో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ విద్యను పాఠశాలల పరిధిలోకి తీసుకురావాలనే ఆలోచన జాతీయ విద్యా విధానం-2020 నేపథ్యంలో మరింత ప్రాధాన్యం పొందింది. ఈ మార్పు విద్యార్థులకు మేలు చేస్తుందా? లేక ఇప్పటికే సమస్యలతో ఉన్న విద్యా వ్యవస్థపై మరింత ఒత్తిడిని పెంచుతుందా? అనే ప్రశ్నలు సహజంగానే ముందుకు వస్తున్నాయి. ప్రస్తుతం పదో తరగతి పూర్తయిన తర్వాత విద్యార్థులు పూర్తిగా భిన్నమైన వాతావరణంలోకి వెళ్లాల్సి వస్తోంది. స్కూల్ జీవితం నుంచి ఒక్కసారిగా జూనియర్ కాలేజీ వాతావరణంలోకి మారడం వల్ల చాలామంది విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కొత్త వాతావరణానికి అలవాటు పడటంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకే పాఠశాలలో 12వ తరగతి వరకు విద్యను కొనసాగించే అవకాశం ఉంటే విద్యార్థుల్లో భయం తగ్గి, ఆత్మవిశ్వాసం పెరిగే అవకాశం ఉంటుంది. విద్యలో నిరంతరత ఉండటం వల్ల వారి చదువుపై ఆసక్తి కూడా పెరుగుతుంది. ఇంటర్మీడియట్ వ్యవస్థపై ప్రస్తుతం ఉన్న ప్రధాన విమర్శ ఏమిటంటే అదిపూర్తిగా మార్కులు, ర్యాంకులు, పోటీ పరీక్షల చుట్టూ తిరుగుతోంది. ఐఐటిజేఈఈ, నీట్, ఎంసెట్ వంటి పరీక్షల కోసం విద్యార్థులు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు కోచింగ్ సెంటర్లలో గడిపే పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా సృజనాత్మకత, సామాజిక అవగాహన, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలు వెనుకబడుతున్నాయి. పాఠశాల విద్యలో విలీనం చేస్తే విద్యను మరింత సమగ్రంగా రూపొందించే అవకాశం ఉంటుంది. కేవలం మార్కుల కోసం కాకుండా విద్యార్థుల ఆలోచనా శక్తి, సృజనాత్మకత, నైతిక విలువలు పెంపొందించే విధంగా విద్యా విధానాన్ని మార్చుకోవచ్చు. ఈ మార్పు వల్ల గ్రామీణప్రాంతాల విద్యార్థులకు కూడా ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. ప్రస్తుతం మంచి జూనియర్ కాలేజీలు ఎక్కువగా పట్టణాల్లోనే కేంద్రీకృతమై ఉన్నాయి. దీంతో గ్రామీణ విద్యార్థులు ఉన్నత చదువుల కోసం నగరాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇది వారి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారాన్ని మోపుతోంది. పాఠశాలలలోనే ఇంటర్మీడియట్ విద్య అందుబాటులో ఉంటే ఈ సమస్య కొంతవరకు తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే పదో తరగతి తర్వాత



చదువును మధ్యలోనే వదిలేసే విద్యార్థుల సంఖ్య కూడా తగ్గవచ్చు. ఆర్థిక ఇబ్బందులు, ప్రయాణ సమస్యలు, సదుపాయాల లేమి వంటి కారణాలతో చాలామంది విద్యార్థులు చదువు కొనసాగించలేకపోతున్నారు. సమీప పాఠశాలలోనే ఉన్నత తరగతులు ఉంటే వారికి చదువు సులభంగా కొనసాగించే అవకాశం ఉంటుంది. అయితే ఈ మార్పుకు అనేక సవాళ్లు కూడా ఉన్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిని పరిశీలిస్తే మౌలిక వసతుల కొరత స్పష్టంగా కనిపిస్తుంది. చాలాచోట్ల సరిపడా తరగతి గదులు లేవు. ఉపాధ్యాయుల కొరత ఉంది. ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, కంప్యూటర్ సదుపాయాలు కూడా తగిన స్థాయిలో లేవు. ఈ పరిస్థితుల్లో ఇంటర్మీడియట్‌ను కూడా అదే వ్యవస్థలో కలపడం వల్ల విద్యా నాణ్యత తగ్గిపోవచ్చనే భయం వ్యక్తమవుతోంది. ఇంటర్మీడియట్ విద్యకు ప్రత్యేకమైన అకడమిక్ ప్రణాళిక అవసరం. సైన్స్, మ్యాథమెటిక్స్ వంటి సబ్జెక్టులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఆధునిక ప్రయోగశాలలు అవసరం. అన్నిపాఠశాలల్లో ఈ సదుపాయాలు కల్పించడం ప్రభుత్వానికి పెద్దసవాలుగా మారుతుంది. ఇంకోముఖ్యమైన సమస్య విద్యా ప్రమాణాల అసమానత. పట్టణాల్లోని ప్రైవేట్ పాఠశాలలు ఈ మార్పును సులభంగా స్వీకరించే అవకాశం ఉన్నప్పటికీ, గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలు వెనుకబడే ప్రమాదం ఉంది. ఫలితంగా విద్యార్థుల మధ్య అసమానతలు మరింతపెరిగే అవకాశముంది. ఇప్పటికేప్రభుత్వ, ప్రైవేట్ విద్య మధ్య పెద్ద అంతరం ఉంది. ఈ సంస్కరణ సరైన ప్రణాళిక లేకుండా అమలు చేస్తే ఆ అంతరంమరింత విస్తరించవచ్చు. అలాగే ప్రస్తుతం ఉన్న జూనియర్ కాలేజీల భవిష్యత్తుపై కూడా అనేక సందేహాలు ఉన్నాయి. వేలాది మంది అధ్యాపకులు, సిబ్బంది ఉపాధిపై ప్రభావం పడే అవకాశం ఉంది. విద్యా సంస్కరణలు చేపట్టేటప్పుడు ఈ అంశాలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. కేవలం వ్యవస్థను మార్చడంద్వారా మాత్రమే విద్యా సమస్యలు పరిష్కారం కావు. ఉపాధ్యాయుల శిక్షణ, మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. నేటి పరిస్థితుల్లో విద్య అంటే కేవలం ఉద్యోగం పొందడానికి అవసరమైన సాధనం మాత్రమే కాకుండా మంచి పౌరులను తయారుచేసే ప్రక్రియ కూడా కావాలి. కానీ ప్రస్తుతం ఉన్న ఇంటర్మీడియట్ వ్యవస్థ విద్యార్థులను యంత్రాల్లా మార్చేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మార్కుల కోసం మాత్రమే చదివే పరిస్థితి ఏర్పడింది. విద్యార్థులపై పెరుగుతున్న మానసిక ఒత్తిడి కారణంగా ఆత్మహత్యలు కూడా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యతో విలీనం చేయడం ద్వారా విద్యనుమరింత మానవీయంగా మార్చేఅవకాశం ఉందని కొందరు భావిస్తున్నారు. ఏ సంస్కరణ అయినా విజయవంతం కావాలంటే దాని అమలు విధానం చాలాముఖ్యమైంది. సరైన ప్రణాళిక లేకుండా తీసుకునే నిర్ణయాలు విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. అందువల్ల ప్రభుత్వం విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులతో విస్తృతచర్చలు జరిపి సమగ్ర నిర్ణయం తీసుకోవాలి. విద్యావ్యవస్థలో మార్పులుఅవసరమే. కానీ ఆ మార్పులు విద్యార్థుల భవిష్యత్తును మరింత మెరు గుపరిచేలా ఉండాలి గానీ కొత్త సమస్యలకు దారితీయకూడదు. •

# బంగ్లాదేశ్‌కు మళ్లీ వస్తా..

## వెళ్లే తేదీ సమయం హఠాత్తుగా చెపుతా..

## మాజీ ప్రధాని షేక్ హసీనా సంచలన ప్రకటన



**న్యూఢిల్లీ, మే 19:** బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా సంచలన ప్రకటన చేశారు. 2024లో చెలరేగిన విద్యార్థి ఉద్యమం కారణంగా తన పదవిని కోల్పోయి, ప్రస్తుతం భారతదేశంలో ఆశ్రయం పొందుతున్న హసీనా తాజాగా ఒక మీడియా ఇంటర్వ్యూలో తన భవిష్యత్తు కార్యాచరణను స్పష్టం చేశారు. తనకు బంగ్లాదేశ్ అంతర్జాతీయ క్రైమ్స్ ట్రైబ్యునల్ మరణశిక్ష విధించినప్పటికీ, తన పార్టీ అయిన అవామీ లీగ్ పై నిషేధం విధించినప్పటికీ ఆమె ఏమాత్రం వెనక్కి తగ్గేదే లేదని ప్రకటించారు. నేను బంగ్లాదేశ్‌లో లేనంత మాత్రాన సైలెంట్‌గా ఉన్నానని అనుకోవద్దు. దేశం కోసం నేను నిరంతరం పోరాడుతూనే ఉన్నాను. అతి త్వరలోనే నేను మళ్లీ నా సొంత దేశానికి తిరిగి వెళ్తానని ధీమా వ్యక్తం చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా తాను దేశానికి తిరిగి వెళ్లే నిర్దిష్ట తేదీ, సమయాన్ని ఇప్పుడే వెల్లడించలేనని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం, భావప్రకటన స్వేచ్ఛ, రాజకీయ హక్కులు, చట్టబద్ధమైన పాలన పునరుద్ధరించబడటమే తన ప్రాథమిక లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. తన పార్టీ అవామీ లీగ్‌పై విధించిన నిషేధంపై ఆమె ఘాటుగా స్పందించారు. అవామీ లీగ్ అనేది ప్రజల గుండెల్లో ఉన్న పార్టీ. కేవలం ఒక ప్రభుత్వ కాగితపు ఆర్డర్‌తో దానిని క్లోజ్ చేయడం ఎవరి తరం కాదు. అదే నిజమైతే అసలు బంగ్లాదేశ్ అనే దేశమే పుట్టేది కాదని గుర్తుచేశారు. గతంలో తనపై 19 సార్లు హత్యాప్రయత్నాలు జరిగాయని, అయినా తాను ఎన్నడూ భయపడలేదని, ఇప్పటికీ లక్షలాది మంది మద్దతుదారులు పార్టీ కోసం నిలబడే ఉన్నారని చెప్పారు. గతంలో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ అధినేతగా వ్యవహరించిన ముహమ్మద్ యూనస్‌పై ఆమె తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. యూనస్ ప్రభుత్వం అవామీ లీగ్ నాయకులు, కార్యకర్తలపై పగబట్టి రాజకీయ నరమేధం సృష్టించిందని ఆరోపించారు. ఇప్పటివరకు తమ పార్టీకి చెందిన సుమారు 600 మందిని దారుణంగా హత్య చేశారని, 1.5 లక్షల మందికి పైగా కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి జైళ్లలో బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో సాధారణ పరిస్థితులు నెలకొనగానే నాయకులంతా మళ్లీ తిరిగి వస్తారని ధీమా వ్యక్తం చేశారు.

# పెను ఆర్థిక తుఫాను వస్తోంది!



## - పశ్చిమాసియా ఘర్షణలతో చమురు, ఎరువులకు తీవ్ర కొరత - సామాన్య ప్రజలను కాపాడటంలో మోడీ విఫలం - పొదుపు పాటించాలని చెబుతూ ప్రధాని విదేశీ టూర్లు ఏంటి?

## - లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మండిపాటు

**లక్నో, మే 19:** పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంఘర్షణ నేపథ్యంలో భారతదేశం ఒక పెద్ద ఆర్థిక సంక్షోభం వైపు పయనిస్తోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ హెచ్చరించారు. ఆర్థిక తుఫాను రాబోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దాని ప్రభావం నుండి సామాన్య ప్రజలను కాపాడటంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విఫలమవుతున్నారని ఆయన ఆరోపించారు. రాయ్‌బరేలీ పర్యటనలో భాగంగా మంగళవారం బచ్రావన్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ, ఇరాన్, అమెరికాల మధ్య నెలకొన్న ఈ సంఘర్షణ ప్రపంచవ్యాప్తంగా చమురు, ఎరువులు, డీజిల్ కొరతకు దారితీయవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. "ఇరాన్, అమెరికాల మధ్య యుద్ధం చెలరేగింది. ఈ ఘర్షణ సమయంలో, ప్రపంచ చమురులో అధిక భాగం ప్రయాణించే వ్యూహాత్మక ప్రదేశమైన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ స్వాధీనం చేసుకుంది. తమ పట్టును వదులుకోబోమని ప్రకటించింది. ఫలితంగా, ఇప్పుడు ప్రపంచ మంతా చమురు, ఎరువులు, డీజిల్ తీవ్ర కొరతను వేగంగా ఎదుర్కోవడం ప్రారంభించింది" అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కొనసాగిస్తున్న ఐదు దేశాల పర్యటనపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. "బంగారం కొనవద్దని, ఎలక్ట్రిక్ వాహనాలకు మారాలని, విదేశాలకు వెళ్లవద్దని మోడీ పౌరులను కోరతారు, కానీ ఆ వెంటనే ఆయన విదేశీ పర్యటనకు బయలుదేరుతారు" అని విమర్శలు గుప్పించారు. "విచారకరమైన విషయం ఏమిటంటే, మన జీవితంలో ఎన్నడూ చూడని తీవ్రమైన ఆర్థిక తుఫాను రాబోతోంది, దానిని ఎవరూ ఆపలేరు," అని గాంధీ అన్నారు. ఈ ఆర్థిక ప్రభావం అంబానీ, అదానీ వంటి పారిశ్రామికవేత్తల కంటే ఎక్కువగా రైతులు, కార్మికులు, యువత, చిన్న వ్యాపారులు, చిన్న పరిశ్రమలపై పడుతుందని అన్నారు. "నష్ట పోయేది అంబానీ లేదా అదానీ కాదు. నాలుగు వైపులా భద్రత ఉన్న వారి రాజభవనాల్లోనే వారు ఉంటారు. నష్టపోయేది భారతదేశపు రైతులు, కార్మికులు, యువత, ఉపాధి కల్పించే చిన్న వ్యాపారులు, చిన్న పరిశ్రమలే," అని ఆయన అన్నారు. "తాను కొంతకాలంగా 'ఆర్థిక తుఫాను' గురించి హెచ్చరిస్తున్నానని, ద్రవ్యోల్బణం, ఇంధన ధరలు విపరీతంగా పెరుగుతాయని చెప్పినట్లు పెట్రోల్ ధరలు పెంచారు. ద్రవ్యోల్బణం ఆకాశాన్ని అంటుతుంది. అయినా, రాహుల్ గాంధీకి అవగాహన లేదని అంటారు. ఈ రోజు కూడా మేం వారికి చెబుతూనే ఉన్నాం. చర్యలు తీసుకోండి. ప్రజలను రక్షించండి. రైతులను రక్షించండి. కానీ వారు ఏమీ చేయరు. కొన్నిసార్లు నార్వేకి, తర్వాత జపాన్‌కి, ఆపై మరెక్కడికో వెళ్లిపోతారు. ఎందుకు?" అని రాహుల్‌గాంధీ నిలదీశారు. కార్మికులను, చిన్న వ్యాపారులను రక్షించడంలో కేంద్రం విఫలమైందని గాంధీ ఆరోపించారు. ప్రభుత్వం పెద్ద పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. "కార్మికులను, చిన్న వ్యాపారులను ఆదుకోవడం ప్రారంభించాలని తాము రోజూ నరేంద్ర మోడీని కోరుతూనే ఉన్నాము. కేంద్రం అలా చేయడంలో విఫలమైతే, దేశం అపారమైన నష్టాన్ని చవిచూడబోతోంది


# ట్రంప్, నెతన్యాహులను హత్యచేస్తే రూ.580 కోట్ల రివార్డు

## ప్రత్యేక చట్టంచేసేందుకు ఇరాన్ ఐఆర్జీసి కసరత్తులు



**టెహ్రాన్, మే 19:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మునుపెన్నడూ లేనంత ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహులను టార్గెట్ చేస్తూ ఇరాన్ పార్లమెంట్ (మజ్లిస్) ఒక సంచలన చట్టాన్ని తీసుకువస్తోంది. ట్రంప్, నెతన్యాహులను అంతమొందించిన వారికి రూ.580 కోట్ల భారీ రివార్డు ప్రకటించేలా ఒక ప్రత్యేక బిల్లుపై ఇరాన్ ఎంపీలు కసరత్తులుచేస్తున్నారు. ఈ విషయాన్ని ఇరాన్ జాతీయ భద్రతా కమిటీ అధ్యక్షుడు ఇబ్రహీం అజీజీ అధికారికంగా ధృవీకరించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా - ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై జరిపిన భారీ వైమానిక దాడుల్లో ఆ దేశ అత్యున్నత నాయకుడు అయతోల్లా అలీ ఖమేనీ మరణించారు. ఈ దారుణ ఉదంతానికి ప్రతీకారం తీర్చుకునేందుకే తాజాగా ఇరాన్ నాయకత్వం ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. బ్రిటన్‌కు చెందిన ప్రముఖ వార్తా సంస్థ 'ది టెలిగ్రాఫ్' నివేదిక ప్రకారం ఇరాన్ ఎంపీలు ప్రస్తుతం 'ఇస్లామిక్ రిపబ్లిక్ సైనిక, భద్రతా దళాల పరస్పర ప్రతీకార చర్య' అనే పేరుతో ఒక ప్రత్యేక బిల్లును రెడీ చేస్తున్నారు. ఈ చట్టం ప్రకారం డొనాల్డ్ ట్రంప్‌ను హతమార్చిన ఏ వ్యక్తికైనా అధికారికంగా 50 మిలియన్ యూరోలు అంటే మన కరెన్సీలో సుమారు రూ.580 కోట్లు బహుమతిగా అందజేస్తారు. అలీ ఖమేనీ మరణానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, యూఎస్ సెంట్రల్ కమాండ్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్‌లే పూర్తి బాధ్యులని ఇబ్రహీం అజీజీ స్పష్టం చేశారు. వీరంతా కచ్చితంగా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఇటీవల ఇరాన్ జాతీయ భద్రతా కమిటీ వైస్ ఛైర్మన్ మహ్మూద్ నబవియాన్ మాట్లాడుతూ.. ట్రంప్, నెతన్యాహులను నరకానికి పంపే వారికి 'భారీ బహుమతి ప్రకటించేందుకు పార్లమెంట్ అతి త్వరలోనే ఓటింగ్ నిర్వహించనుందని తెలిపారు. ఒకవేళ భవిష్యత్తులో ఇరాన్ లేదా తమ నాయకత్వంపై అమెరికా, ఇజ్రాయెల్ మళ్లీ దాడికి దిగితే, దాని పర్యవసానాలు కేవలం ఆ రెండు దేశాలకే పరిమితం కాబోవని హెచ్చరించారు. అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యూహాత్మకంగా మద్దతు ఇస్తున్న ప్రాంతీయ అరబ్ దేశాలు, వారి ప్రభుత్వాలు కూడా ఈ తీవ్రమైన ఎదురుదాడిని ఎదుర్కోవలసి ఉంటుందని ఆయన బాహాటంగానే హెచ్చరించారు. ఇరాన్ నుంచి ట్రంప్‌కు ఇలాంటి బెదిరింపులు రావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో ఇరాన్ టాప్ కమాండర్ ఖాసిం సులేమానీ, అలీ ఖమేనీ మరణాల తర్వాత ట్రంప్‌ను అంతమొందించేందుకు ఇరాన్‌లో వరుస ప్రచారాలు జరుగుతున్నాయి. గతంలో ట్రంప్ హత్య కోసం ప్రభుత్వం మద్దతు ఉన్న గ్రూపులు ఈ క్యాంపెయిన్ ద్వారా 27 మిలియన్ డాలర్లకు పైగా సేకరించినట్లు సమాచారం. ట్రంప్, నెతన్యాహుల చావు కోసం గతంలోనే 50 మిలియన్ డాలర్ల బహుమతిని ప్రకటించింది.

# సెప్టెంబరు 12,13 తేదీల్లో పుతిన్ భారత్ పర్యటన



**న్యూఢిల్లీ, మే 19:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ఏడాది సెప్టెంబర్ 12, 13 తేదీల్లో భారత్ లో పర్యటించనున్నారు. భారత్ ఆతిథ్యమిస్తున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీ రానున్నట్లు ఆ దేశ అధ్యక్ష భవనం క్రెమ్లిన్ మంగళవారం అధికారికంగా ధృవీకరించింది. భారత్, రష్యా మధ్య వ్యూహాత్మక, రక్షణ రంగ బంధం బలపడుతున్న తరుణంలో పుతిన్ పర్యటన ఖరారు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. గత డిసెంబర్‌లో జరిగిన 23వ భారత్‌రష్యా వార్షిక సదస్సు కోసం పుతిన్ ఢిల్లీకి వచ్చారు. ఆ సమయంలో మోదీతో కలిసి ద్వైపాక్షిక సంబంధాల విస్తరణపై చర్చలు జరిపారు. ఆ పర్యటన జరిగిన ఏడాదిలోపే పుతిన్ రెండోసారి భారత్‌కు వస్తుండటం గమనార్హం. రష్యా ఉక్రెయిన్ యుద్ధం 2022లో ప్రారంభమైన తర్వాత పుతిన్ గతేడాది డిసెంబర్‌లోనే మొదటిసారి భారత్‌లో అడుగుపెట్టారు. దానికి ముందు ఆయన 2021లో ఢిల్లీని సందర్శించారు. భారత్‌రష్యా మధ్య ఏటా ఒకసారి ఇరు దేశాల అధినేతలు భేటీ అయ్యే సంప్రదాయం ఉంది. ఒక ఏడాది భారత్‌లో జరిగితే, మరో ఏడాది రష్యాలో జరుగుతుంది. ఢిల్లీలో ఈ ప్రతిష్ఠాత్మక బ్రిక్స్ సదస్సులో ప్రపంచ భద్రతా సవాళ్లు వంటి కీలక అంశాలపై చర్చించనున్నారు.

# ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు పొడిగింపు

## వచ్చే యేడాది జూన్ 14వరకూ పొడిగించిన యుఐడిఎఐ

**న్యూఢిల్లీ, మే 19:** ఆధార్ కార్డుదారులకు యూఐడీఏఐ సడలింపులు ఇచ్చింది. ఆన్‌లైన్‌లో ఉచితంగా ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకునేందుకు విధించిన గడువును మరో పూర్తి ఏడాది పాటు పొడిగించింది. వాస్తవానికి ఈ అవకాశం త్వరలో ముగియనుండగా, పౌరుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందన దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూఐడీఏఐ తెలిపింది. తాజా ఉత్తర్వుల ప్రకారం 2027 జూన్ 14 వరకు పోర్టల్ ద్వారా డాక్యుమెంట్లను ఉచితంగా అప్‌డేట్ చేసుకోవచ్చు. ఈ నెల 13న విడుదల చేసిన అధికారిక మెమోరాండం ప్రకారం యూఐడీఏఐ ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ సదుపాయాన్ని మరో ఏడాది, అంటే 2026 జూన్ 15 నుంచి 2027 జూన్ 14 వరకు పొడిగించాలని నిర్ణయించాం. దీని ప్రకారం ఆధార్ పోర్టల్‌లో డాక్యుమెంట్ అప్‌డేట్ సౌకర్యం 2027 జూన్ 14 వరకు ఉచితంగా కొనసాగుతుందని ఆ ప్రకటనలో స్పష్టంగా పేర్కొన్నారు. పౌరులు తమ వివరాలను కచ్చితంగా అప్‌డేట్ చేసుకోవడాన్ని ప్రోత్సహించడమే ఈ పొడిగింపు ఉద్దేశమని తెలిపింది. కొత్త యాప్ రాకతో పాత యాప్‌కు స్వస్తి డాక్యుమెంట్ అప్‌డేట్‌తో పాటు యూఐడీఏఐ మొబైల్ యాప్‌లో కూడా కీలక మార్పులు చేసింది. పాత యాప్‌ను త్వరలో నిలిపివేయనున్నట్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ ద్వారా ప్రకటించింది. దాని స్థానంలో వినియోగదారుల కోసం మెరుగైన ఫీచర్లతో కొత్త ఆధార్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. సురక్షితమైన క్యూఆర్ కోడ్ ఆధారిత ఆధార్ షేరింగ్, మెరుగైన ప్రైవసీ నియంత్రణలు, ఇతర ఆధార్ సేవలను సులభంగా పొందేందుకు ఈ కొత్త యాప్ వీలు కల్పిస్తుంది. కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ కొత్త ఆధార్ యాప్‌కు ప్రజల నుంచి భారీ స్పందన లభిస్తోంది. కేవలం మూడు నెలల్లోనే ఈ యాప్‌ను 2.1 కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఇప్పటివరకు ఈ యాప్ ద్వారా 28 లక్షల మంది తమ మొబైల్ నంబర్లను, దాదాపు 6 లక్షల మంది తమ చిరునామాలను అప్‌డేట్ చేసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ కొత్త యాప్ ఆండ్రాయిడ్, యాపిల్ ఐఓఎస్ ప్లాట్‌ఫామ్‌లపై అందుబాటులో ఉంది.

# రష్యా చమురు దిగుమతులకు అమెరికా తాత్కాలిక లైసెన్స్



**వాషింగ్టన్,మే 19:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్లను కుదిపేస్తున్న వేళ అమెరికా భారత్ సహా అధికంగా చమురు దిగుమతులపై ఆధారపడిన దేశాలకు తాత్కాలిక ఊరట కల్పిస్తూ ఓ తాజా లైసెన్స్‌ను జారీ చేసింది. అయితే భారత్ ఈ లైసెన్సులపట్ల స్పష్టమైన వైఖరితో ఉంది. భారత ప్రయోజనాల ఆధారంగానే తమ దిగుమతులు ఉంటాయని ఎవరిపైనా ఆధారపడే ప్రసక్తి ఉండదని స్పష్టంచేసింది. అయితే యుఎస్ ఆంక్షల కారణంగా సముద్రంలో చిక్కుకుపోయిన రష్యా ముడి చమురు కార్గోలను స్వీకరించేందుకు 30 రోజుల పాటు అగ్రరాజ్యం అనుమతి ఇచ్చింది. హర్మూజ్ జలసంధి వద్ద నెలకొన్న ఆందోళనలతో ముడి చమురు ధరలు అధిక స్థాయిలో ఉన్న తరుణంలో ఈ చర్య కీలకంగా మారింది. యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ జారీ చేసిన ఈ తాత్కాలిక లైసెన్స్, ఇప్పటికే నౌకల్లో లోడ్ చేసి సముద్ర మార్గంలో ఉన్న రష్యా ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తులను అందుకునేందుకు మాత్రమే వర్తిస్తుంది. దీని ద్వారా కొత్తగా రష్యా నుంచి చమురు దిగుమతులు చేసుకోవడానికి గానీ, కొత్త వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి గానీ అవకాశం లేదు. ఇంధన కొరతతో ఇబ్బంది పడుతున్న దేశాలకు మద్దతుగా, సరఫరాలో అంతరాయాలను నివారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ సోషల్‌మీడియా హ్యాండిల్‌లో తెలిపారు. భౌతిక క్రూడ్ మార్కెట్‌ను స్థిరీకరించడం, ఇంధన అవసరాలు అధికంగా ఉన్న దేశాలకు చమురు చేరేలా చూడటం కూడా ఈ లైసెన్స్ ఉద్దేశమని ఆయన వివరించారు. అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం భారత్‌కు ముఖ్యమే ఎందుకంటే తన మొత్తం చమురు అవసరాల్లో 85 శాతానికి పైగా దిగుమతులపై ఆధారపడే భారత్, ప్రపంచ ఇంధన సరఫరా గొలుసులో ఏ చిన్న మార్పు జరిగినా తీవ్రంగా ప్రభావితమవుతుంది.

# విజయ్ సర్కార్ ఎప్పుడైనా కూలిపోతుంది

## త్వరలోనే తమిళనాడులో మళ్లీఎన్నికలు: స్టాలిన్



**చెన్నై, మే 19:** తమిళనాడులో నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చని డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముందస్తు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన ఎన్నికల ఓటమి తర్వాత పార్టీ జిల్లా కార్యదర్శులతో సమావేశమైన స్టాలిన్, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై తన అంచనాలను వివరించారు. ప్రస్తుతం తమిళనాడు అసెంబ్లీలో టీవీకేకు 107, దాని మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు 5 సీట్లు ఉన్నాయి. డీఎంకే మిత్రపక్షాలైన వీసీకే, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్‌కు చెందిన 8 మంది ఎమ్మెల్యేలు బయటి నుంచి ప్రభుత్వానికి మద్దతిస్తున్నారు. వీటికి తోడు, గత వారం జరిగిన విశ్వాస పరీక్షలో ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేసిన 25 మంది అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేల మద్దతు కూడా విజయ్ ప్రభుత్వానికి ఉంది. ఈ సమీకరణాలు ఎంతకాలం నిలుస్తాయనే దానిపై డీఎంకే వర్గాలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. బయటి నుంచి మద్దతిస్తున్న పార్టీలు వైదొలిగినా, రెబల్ ఎమ్మెల్యేలపై స్పీకర్ లేదా కోర్టు అనర్హత వేటు వేసినా ప్రభుత్వానికి రాజకీయ అస్థిరత తప్పదని ఆ పార్టీ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే స్టాలిన్ తన పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ ఓటమి తాత్కాలికమే. ప్రస్తుత ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చు. సిద్ధంగా ఉండండి. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటు మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. మనం తిరిగి పుంజుకుని మళ్లీ గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఓటమికి తానే పూర్తి బాధ్యత వహిస్తున్నానని, కోలత్తూరులో తన ఓటమిని కూడా అంగీకరిస్తున్నానని తెలిపారు. తమిళనాట సూర్యుడు (డీఎంకే గుర్తు) అస్తమించడని ఆయన వ్యాఖ్యానించారు. ఓటమికి గల కారణాలను విశ్లేషించేందుకు, ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించేందుకు 36 మంది సభ్యులతో ఒక కమిటీని కూడా స్టాలిన్ ఏర్పాటు చేశారు.

# మద్రాస్ హైకోర్టుకు 19మంది జడ్జిలు

## - 10మంది న్యాయవాదులు, 9 మంది న్యాయాధికారులు

## - సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సు

**న్యూఢిల్లీ, మే 19:** మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులుగా 19 మందిని నియమించాలని సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. కొలీజియం సిఫార్సు చేసిన 19 పేర్లలో 10 మంది న్యాయవాదులు, 9 మంది న్యాయాధికారులు ఉన్నారు. న్యాయవాదులు పి. మురుగన్, ఎం.డి. సుమతి, ఎస్. అల్లి, సి. తిరుమగళ్ చంద్రశేఖర్, ధర్మలింగం లింగేశ్వరన్, కార్తికేయన్ బాలదండాయుధం, నటరాజన్ రమేష్, జి.కె. ముత్తుకుమార్, రామకృష్ణన్ రాజేష్ వివేకానందన్, శంకరనారాయణన్ రవికుమార్, నాగరాజన్ దిలీప్ కుమార్, ఎల్లప్పన్ మనోహరన్‌ల మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులుగా కొలీజియం సిఫార్సు చేసింది. అలాగే, న్యాయాధికారులు కృష్ణస్వామి గోవిందరాజన్, రజనీష్ పాతియిల్, కె. అప్పదురై అలియాస్ కందవేల్ అప్పదురై, రామస్వామి అనిత, షణ్ముగం కార్తికేయన్, బాలుస్వామి మురుగేశన్, ఎన్. గుణశేఖరన్ న్యాయమూ ర్తులుగా పదోన్నతి కల్పించడానికి సిఫార్సు చేశారు. నవంబర్ 4, 2025, నవంబర్ 21, 2025, డిసెంబర్ 7, 2025, డిసెంబర్ 10, 2025 తేదీలలో వచ్చిన నాలుగు ప్రతిపాదనలను సుప్రీంకోర్టు కొలీజియం పరిశీలించి ఈ మేరకు సిఫార్సులు చేసింది.

# గల్ఫ్‌దేశాల విజ్ఞప్తితో ఇరాన్‌పై దాడిని నిలిపివేసాం: అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్,మే 19:** ఇరాన్‌పై జరపాల్సిన సైనిక దాడిని చివరి నిమిషంలో వాయిదా వేసినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. గల్ఫ్ దేశాల నేతలు చేసిన విజ్ఞప్తి మేరకు దౌత్యపరమైన చర్చలకు మరింత సమయం ఇచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇరాన్‌తో అణు ఒప్పందంపై చర్చలు తుది దశకు చేరుకున్నాయని వారు చెప్పినట్లు పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ మంగళవారం ఇరాన్‌పై చాలా పెద్ద దాడికి మేం సిద్ధమయ్యాం. కానీ సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ వంటి దేశాల నేతలు నన్ను సంప్రదించారు. ఇరాన్‌తో ఒప్పందం కుదిరేందుకు చర్చలు చాలా దగ్గరగా ఉన్నాయని, రెండు మూడు రోజుల సమయం ఇవ్వాలని కోరారు. దీంతో దాడిని కొంతకాలం పాటు వాయిదా వేశానని వివరించారు. ఈ వాయిదా శాశ్వతంగా ఉండాలని ఆశిస్తున్నట్లు కూడా ఆయన పేర్కొన్నారు. ఇరాన్ చేతికి అణ్వాయుధం వెళ్లకుండా నిరోధించగలిగితే, అదే మాకు సంతృప్తినిస్తుంది. వారిపై బాంబుల వర్షం కురిపించకుండానే ఈ పని పూర్తయితే నేను చాలా సంతోషిస్తానుఅని ట్రంప్ స్పష్టం చేశారు. దౌత్య ప్రయత్నాలు విఫలమైతే సైనిక చర్యకు తాము సిద్ధంగానే ఉన్నామని హెచ్చరించారు. దాడి వాయిదా విషయాన్ని ఇజ్రాయెల్, ఇతర మిత్రదేశాలకు ఇప్పటికే తెలియజేశామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ తమ సైనిక చర్యలతో ఇరాన్ సైన్యాన్ని, మొదటి స్థాయి నాయకత్వాన్ని ఇప్పటికే పూర్తిగా నాశనం చేశామని సంచలన వ్యాఖ్యలు చేశారు. చర్చలు విఫలమైతే పూర్తిస్థాయి దాడికి సిద్ధంగా ఉండాలని రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్‌ను ట్రంప్ ఆదేశించినట్లు తెలిసింది.

# సైనిక సామర్థ్యం పెంపుకోసం అమెరికాతో ఒప్పందాలు

## అపాచీ హెలికాప్టర్లు, హోవిట్జర్ల నిర్వహణకు భారీ నిధులు

**న్యూఢిల్లీ,మే 19:** భారత్‌అమెరికా రక్షణ సంబంధాలు మరింతగా బలపడినట్లు తాజా ఒప్పందం స్పష్టంచేస్తోంది. భారత సైనిక సామర్థ్యాన్ని పెంచే దిశగా అమెరికా మద్దతు ఇచ్చింది. అపాచీ హెలికాప్టర్లు, ఎం777 హోవిట్జర్ల నిర్వహణ మద్దతు కోసం సుమారు 428.2 మిలియన్ డాలర్ల విలువైన రెండు సైనిక ఒప్పందాలకు అమెరికా విదేశాంగ శాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు మే 18న అమెరికా కాంగ్రెస్‌కు వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీ చేసింది. ఈ ఒప్పందాల్లో మొదటిది ఎం777ఎ2 అల్ట్రాలైట్ హోవిట్జర్ల దీర్ఘకాలిక నిర్వహణకు సంబంధించింది. దీని విలువ 230 మిలియన్ డాలర్లు. ఈ ప్యాకేజీలో విడిభాగాలు, మరమ్మతులు, శిక్షణ, సాంకేతిక సాయం, ఫీల్డ్ సర్వీస్ వంటివి ఉంటాయి. ఈ ఒప్పందానికి బీఏఈ సిస్టమ్స్ ప్రధాన కాంట్రాక్టర్‌గా వ్యవహరించనుంది. రెండో ఒప్పందం ఎహెచ్64ని అపాచీ హెలికాప్టర్ల నిర్వహణకు సంబంధించినది. దీని విలువ 198.2 మిలియన్ డాలర్లు. ఇంజినీరింగ్, సాంకేతిక, లాజిస్టిక్స్ మద్దతు, సిబ్బందికి శిక్షణ వంటి సేవలు అందిస్తారు. బోయింగ్, లఖీద్‌మార్టిన్ సంస్థలు ఈ ఒప్పందానికి ప్రధాన కాంట్రాక్టర్లుగా ఉన్నాయి. ఈ ఒప్పందాలు ఇండోపసిఫిక్, దక్షిణాసియా ప్రాంతాల్లో రాజకీయ స్థిరత్వం, శాంతి, ఆర్థిక ప్రగతిని ప్రోత్సహించడానికి దోహదపడతాయని అమెరికా విదేశాంగ శాఖ పేర్కొంది.

# సంక్షిప్తంగా..

## భారత్‌లో లేని ఎయిర్‌బేస్‌లపై పాకిస్థాన్ దాడి చేసిందట!

**ఇస్లామాబాద్, మే 19:** గతేడాది భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా తాము 'బునియాన్ ఉల్ మర్సూస్' ఆపరేషన్‌ను చేపట్టామని పాకిస్థాన్ అధికారి ఒకరు వెల్లడించారు. ఆ సమయంలో భారత్‌లోని రాజౌరీ, మామూన్ ఎయిర్ బేస్‌లను తమ క్షిపణులు తాకినట్లుగా గొప్పలు చెప్పారు. అయితే అక్కడ అసలు ఎయిర్ బేస్‌లే లేవనే విషయాన్ని మాత్రం గ్రహించలేకపోయారు. రాజౌరీ జమ్మూకాశ్మీర్‌లోని ఓ జిల్లా. అక్కడ ఎటువంటి భారత వైమానిక దళ ఎయిర్‌బేస్ లేదు. మామూన్ పంజాబ్‌లోని పఠాన్‌కోట్ సమీపంలో ఉన్న ఓ కంటోన్మెంట్ ప్రాంతం.

ఈ విషయం కూడా తెలుసుకోకుండా వాటి పేర్లు ప్రస్తావించడంతో సోషల్ మీడియాలో నెటిజన్లు ఆయనను ట్రోల్ చేస్తున్నారు. ఆపరేషన్ సమయంలో తమకు భారత్‌లోని రాజౌరీ, మామూన్ ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని స్థానిక మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పాక్ అధికారి పేర్కొన్నారు.

## పంజాబీ గాయని ఇందర్‌కౌర్ హత్య



**మోగా(పంజాబ్), మే 19:** ప్రముఖ పంజాబీ గాయని ఇందర్ కౌర్ దారుణ హత్యకు గురైంది. పెళ్లికి అంగీకరించలేదని ఓ మృగాడు అత్యంత దారుణంగా చంపేసి మృతదేహాన్ని కాలువలో పడేసిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఇందర్ కౌర్ ప్రముఖ పంజాబ్ గాయని. మోగాలోని భలూర్ గ్రామానికి చెందిన సుఖ్విందర్ సింగ్ అనే వ్యక్తి బలవంతంగా పెళ్లి చేసుకవడానికి తీవ్ర ఒత్తిడి తెస్తున్నాడు. కానీ అందుకు ఇందర్ కౌర్ నిరాకరిస్తూ వస్తోంది. దీంతో సుఖ్విందర్ సింగ్ పగ పెంచుకున్నాడు. ఈ నెల 13న రాత్రి 8:30 గంటలకు కారులో సరుకులు తేవడానికి ఇందర్ కౌర్ బయటకు వెళ్లింది. రాత్రి పొద్దుపోయే వరకు ఇంటికి రాకపోవడంతో భయాందోళన చెంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## గోట్ చిత్రం నంబర్‌ప్లేట్‌ను సిఎం విజయ్‌కు బహూకరించిన దర్శకుడు




**చెన్నై, మే 19:** తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రముఖ నటుడు విజయ్‌ను దర్శకుడు వెంకట్ ప్రభు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ గోట్ చిత్రంలో విజయ్ పాత్ర నడిపిన కారుకు ఉపయోగించిన టిఎన్07 సీఎం2026 అనే ఐకానిక్ నంబర్ ప్లేట్‌ను ఆయనకు బహూకరించారు. ఈ ఘటనతో 2024లో విడుదలైన ఆ చిత్రంలోని ఓ సన్నివేశం మరోసారి వార్తల్లోకి వచ్చింది. గోట్ చిత్రంలో విజయ్ టిఎన్07 సీఎం 2026 నంబర్ ప్లేట్ ఉన్న కారులో కనిపిస్తారు.

అప్పట్లో ఈ సన్నివేశంపై పెద్దగా చర్చ జరగకపోయినా, విజయ్ రాజకీయ రంగ ప్రవేశం చేసి, ముఖ్యమంత్రి కావడంతో ఇప్పుడు ఈ నంబర్ ప్లేట్ ఒక జోస్యంలా మారిపోయింది.

## ప్రభాకరన్ వర్ధంతి రోజున టివికె విజయ్ నివాళి

**చెన్నై, మే 19:** తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత జోసెఫ్ విజయ్ ఒక సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఎల్‌టీటీఈ వ్యవస్థాపకుడు వేలుపిళ్లై ప్రభాకరన్ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. ఈ మేరకు విజయ్ తన ఎక్స్ ఖాతాలో ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. శ్రీలంక సైన్యం చేతిలో ప్రభాకరన్ మరణించిన ముల్లివైకల్ ఘటనను విజయ్ గుర్తుచేసుకున్నారు. ముల్లివైకల్ చేదు జ్ఞాపకాలను మేం ఎప్పటికీ గుండెల్లో మోస్తూనే ఉంటాం అని పేర్కొన్నారు. శ్రీలంకలో తమిళ హక్కుల కోసం ఎప్పుడూ అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. 1991లో భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో ప్రభాకరన్ ప్రధాన నిందితుడు. ఈ కారణంగానే భారతదేశంలో ఎల్‌టీటీఈ సంస్థపై నిషేధం కొనసాగుతోంది.

## జస్టిస్ యశ్వంత్ వర్మపై విచారణ - లోక్‌సభ స్పీకర్‌కు నివేదిక అందజేత

**న్యూఢిల్లీ, మే 19:** హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై వచ్చిన ఆరోపణలపై నియమించిన విచారణ కమిటీ, తన నివేదికను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించింది. ఈ నివేదికను పార్లమెంట్ హౌస్‌లో, న్యాయమూర్తుల విచారణ కమిటీకి నేతృత్వం వహిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్ లాంఛనంగా అందజేశారు. కమిటీ సభ్యులు బొంబాయి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రశేఖర్, సీనియర్ న్యాయవాది బి.వి. ఆచార్య కూడా ఆయనతో పాటు ఉన్నారు. కమిటీ కార్యదర్శి గణపతి భట్, కన్సల్టెంట్ న్యాయవాదులు కరణ్ ఉమేష్ సాల్వీ, సమీక్ష దువా కూడా హాజరయ్యారు. విచారణ పెండింగ్‌లో ఉండగానే జస్టిస్ వర్మ ఈ ఏడాది ఏప్రిల్‌లో రాజీనామా చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ వర్మను తొలగించాలని కోరుతూ 146 మంది లోక్‌సభ సభ్యులు సంతకం చేసిన అభిశంసన తీర్మానాన్ని అనుసరించింది.




మాజీ సైనికుడిని సత్కరిస్తున్న రామచందర్‌రావు, ఈటల రాజేందర్.

## దేశ రక్షణలో కీలక పాత్ర పోషించిన సైనికులను గౌరవించుకోవాలి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు

**హైదరాబాద్ (అల్వాల్) మే 19, ప్రభాతవార్త :** దేశ రక్షణలో విధులు నిర్వర్తించిన సైనికులను గౌరవించుకోవడం మన బాధ్యత అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు అన్నారు.అల్వాల్ సర్కిల్ 2 ఖానాజీ గూడా వేద విహార్ లో తెలంగాణా రాష్ట్ర మాజీ సైనికుల సంక్షేమ సంఘం కార్యాలయాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్‌రావు, మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కల్సి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం సైనికులు ఎల్లవేళలా దేశ రక్షణకు ముందుంటారని, మాజీ సైనికులు సంఘం కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ సైనికులు అనుక్షణం దేశ రక్షణలో పాలు పంచుకుంటూ దేశ ప్రజల ప్రాణాలను అప్రమత్తంగా కాపాడుతుంటారని, వారికి ప్రజలంతా అండగా నిలవాలన్నారు.మాజీ సైనికులు సంక్షేమ సంఘం కార్యాలయాన్ని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని,వారికి ఎలాంటి అవసరం ఉన్నా తమ వంతు సహకారం అందించేందుకు ముందుంటామని అన్నారు. ఈ సందర్భంగా మాజీ సైనికులను రామ చందర్‌రావు, ఈటల రాజేందర్‌లు దేశ సేవలో పాల్గొన్న మాజీ సైని కులు, ఆఫీసర్లకు సన్మానం చేసారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయ కులు డివిజన్ ప్రెసిడెంట్ మహేందర్‌రెడ్డి,మాణిక్యరెడ్డి, వర్మ, మాధవ్, మల్లికార్జున్ గౌడ్, నరేందర్‌రెడ్డి, భాస్కర్ పెద్దఎత్తున కార్యకర్తలు మాజీ సైనికులు,అ ధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ ఏర్పాటు

### కొత్త ఆరోగ్య పథకం అమలుకు ప్రభుత్వం ఉత్తర్వులు

### ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లతోపాటు కుటుంబసభ్యుల డేటా సేకరణ

### 31 వరకు అందించాలని ఆర్థిక శాఖ ఆదేశం

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది. కొత్తగా ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని అమలు చేయడానికి ప్రత్యేక ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ (ఈహెచ్‌సీటీ) ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు, వారి కుటుంబ సభ్యులు, వారిపై ఆధారపడిన వారికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని సచివాలయ విభాగాలు, విభాగాధిపతులు, పింఛను మంజూరు చేసే అధికారులు, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు (డీడీవో) తమ డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారుల లాగిన్ ద్వారా ఉద్యోగులు, పింఛనుదారులు, వారి కుటుంబ సభ్యులు, వారిపై ఆధారపడిన వారి డేటాను నిర్దేశిత ఫార్మాట్‌లో సేకరించి ఈ నెల 31 లోపు తప్పనిసరిగా ఐఎఫ్‌ఎంఐఎస్-హెచ్‌ఆర్ మాడ్యూల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశిస్తూ ఆర్థిక మంగళవారం మెమో జారీ చేసింది. పరిపాలనా విభాగాలు ఈ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షి ంచాలి డేటా ఖచ్చితంగా సేకరించి నిర్దేశించిన మే 31లోగా అన్ని వివరాలను అప్‌లోడ్ చేయాలని ఉత్తర్వుల్లో ఆదేశించింది.

## 22న పిజి ఇసెట్ హాల్‌టికెట్లు జారీ

### 29 నుంచి జూన్ 1 వరకు పరీక్షలు

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** ఇంజనీరింగ్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రవేశాల కోసం నిర్వహించే పీజీ ఈ సెట్-2026 పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను ఈ నెల 22న జారీ చేయనున్నారు. అలాగే పరీక్షలను గతంలో ప్రకటించినట్టుగా ఈ నెల 28 నుంచి కాకుండా ఈ నెల 29 నుంచి ప్రారంభిం చనున్నట్టు పీజీ ఈ సెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ డాక్టర్ కె వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. జూన్ 1 వరకు పరీక్షలు కొనసాగు తాయని తెలిపారు. మొదట ప్రకటించినట్టు ఈ నెల 28న జరగాల్సిన పరీక్షలను జూన్ 1న నిర్వహిస్తామని, మిగిలిన పరీక్షలు యధావిధిగా ఇప్పటికే ప్రకటించిన తేదీల్లోనే జరుగుతాయని స్పష్టం చేశారు. పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వహించనున్నారు. మొదటి సెషన్‌ను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ ను మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వ హించనున్నారు. మొత్తం 19 పీజీ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం 26,005 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 31 కేంద్రాలను ఏర్పాటు చేశారు.

## అబద్ధాలు చెప్పడంలో బిఆర్‌ఎస్ నాయకులు దిట్ట:ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

**హైదరాబాద్,మే19,ప్రభాతవార్త :** అబద్దాలు చెప్పడంలో బిఆర్‌ఎస్ నాయకులు దిట్ట జగదీష్‌రెడ్డి కాంగ్రెస్‌వాళ్ళు టచ్‌లో ఉన్నారనీ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ పిచ్చి పిచ్చి గా మాట్లాడుతున్నాడనీ ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ విమర్శించారు. సిఎల్‌పిలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మంత్రిగా జగదీష్ రెడ్డి పదేళ్లలో నల్గొండ జిల్లాకు చేసింది ఏమీ లేదనీ అన్నారు.కంకర, ఇసుక అమ్ముకున్నారనీ,దొంగ నోట్ల కేసుల్లో ఉన్నారనీ ఆరోపించారు. మేం అధికారంలోకి రాగానే ఎస్ ఎల్ బిసి టన్నల్ ను పూర్తి చేస్తున్నామనీ చెప్పారు. పెండింగ్ ప్రాజెక్టులను కుర్చీ వేసుకుని కూర్చుని ప్రాజెక్టులను పూర్తి చేస్తామని కెసిఆర్ గతంలోచెప్పాడనీ పూర్తిచేయకపోవడంతో ఇప్పుడు ఫామ్ హౌస్ లో కుర్చీ వేసుకుని కూర్చున్నాడనీ ఎద్దేవా చేశారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తామని, దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని అబద్దాలు చెప్పడంతో బీఆర్‌ఎస్ నాయకులు దిట్టఅని ఆయన విమర్శించారు. రైతులకు కోసం చిత్తశుద్ధితో పనిచేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే మేం బోనస్ మద్దతు ధరకు అదనంగా ఇస్తున్నామని తెలపారు.

## క్రమశిక్షణరాహిత్యానికి వేటు తప్పదు

### పిసిసి క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే నాయకత్వంలో నాయకులు పార్టీ సంస్థాగత అభివృద్ధికి కృషిచేస్తూ స్థానిక సంస్థలు మొదలు కొని అనేక ఎన్నికల్లో పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల గెలుపునకు దోహద పడాలని మరోమారు క్రమశిక్షణరాహిత్యంగా ఎవరైనా వ్యవహరిస్తే వేటు తప్పదని తెలం గాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి హెచ్చరించారు. గాంధీభవన్ మంగళవారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, ఝాన్సీ రెడ్డి పలువురిపై ఫిర్యాదు, జిహెచ్‌ఎంసి స్వయం ప్రకటిత అభ్యర్థుల అంశంపై క్రమశిక్షణ కమిటీ సమావేశమైంది. పాలకుర్తిలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన రామ సహాయం కృష్ణకిషోర్‌రెడ్డి, హరిప్రసాద్ ఫిర్యాదుపై విచారణ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు ఓడిపోవడానికి కారణం ఇద్దరే అని ఫిర్యాదులో ఎలాంటి వాస్తవాలు లేవని కృష్ణ కిషోర్‌రెడ్డి, హరిప్రసాద్ వాదన వినిపించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం వారు గతంలో చేసిన కృషిని కూడా ఉదాహరణలతో వివరించారు. ఎమ్మెల్యేతో కలిసి కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పని చేస్తామని ఇద్దరు నేతలు హామీ ఇచ్చారు. ఎవరినీ సస్పెండ్ చేయాలనే ఉద్దేశం మాకు లేదనీ మల్లు రవి చెప్పారు. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి జిహెచ్‌ఎంసి పరిధిలోని నేతలు కూడా స్థానిక సంస్థల అభ్యర్థులమని స్వయంగా ప్రకటనలు చేసుకోవడం మానుకోవాలని హెచ్చరించారు.

# సిఎం రేవంత్‌రెడ్డిపై ఎంపి అరవింద్ అసత్య ఆరోపణలు

### కెసిఆర్‌ను ఎదుర్కోలేని అశక్తులు బిజెపి నేతలు

### సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్,మే19,ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ్ముళ్ల గురించి మాట్లాడుతున్న ఎంపి ధర్మపురి అరవింద్, నిజామాబాద్ లో మీ తమ్ముళ్లు చేసే అరాచకాల గురించి మేము మాట్లాడలేమా? అని సాం ఘిక సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం గాంధీ భవన్ విలేఖరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై ఎంపి అరవింద్ అసత్య ఆరోపణలు చేశారని మంత్రి ఖండించారు. అరవింద్ కుటుంబ రాజకీయం మొదలైందే కాంగ్రెస్ తో అని గుర్తుచేశారు.

మీ బిజెపి పార్టీలాగ నాగపూర్ లో కూర్చోని అమలు చేసే పార్టీ కాంగ్రెస్ కాదని అన్నారు. అరవింద్ విమర్శలు అస్యత ప్రచారాలు మానుకొని నీకు చేతనైతే కేంద్రం తో ఒప్పించి మొక్కజొన్నకు మద్దతు ధర ఇప్పించు అని సవాల్ విసిరారు.

ఎర్రజొన్నలు మీదగ్గరే ఎక్కువ దిగుబడి వస్తుంది వాటికి రైతులు ఎంతలాగోడి పెడుతారో అంత ధర ఇప్పించు అని హితవు చెప్పారు. మూడో సారి అధికారం లోకి వస్తాం అన్న పార్టీ మెడలు వంచి ప్రజలను ఒప్పించి అధికారంలోకి వచ్చిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని అడ్లూరి కీర్తించారు. వరి ధాన్యం 33జిల్లాలోని అన్ని గోదాంలలో నిండి పోతే ఎంపిగా ప్రధాని మోడీతో,కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి తో ఎందుకు మాట్లాడట్లేదు అని ప్రశ్నించారు. రైతుల గురించి, వడ్ల గురించి, మొక్కజొన్నల ఎర్రజొన్నల గురించి మాట్లాడట్లేదుఅని విమర్శించారు.

### దేశంపై ప్రేమ ఉంటే మోడీ విదేశీ ప్రయాణం చేసేవాడా?: ఎంపి అనిల్‌కుమార్‌యాదవ్

మోడీకి దేశం గురించి ఆలోచించే తపన, దేశంపై ప్రేమ ఉంటే విదేశీ ప్రయాణం చేసేవాడా?ఎంపి ధర్మపురి అరవింద్ పై ఎంపి అనిల్ కుమార్ యాదవ్ మండి పడ్డారు. మీ బిజెపి లో పంచాయితీ ఉంటే మీరు, మీరు చూసుకోండి ప్రధాని మోడీ టాక్టిక్స్‌తో మాట్లాడిండు అని అన్నారు. పెట్రోల్,డీజిల్ ధరలు ఎందుకు పెరుగుతున్నాయి చెప్పే మొగోడు బిజెపి లో లేడు మీరు చేసే పొరపాట్లు దేశం మీద ఎందుకు రుద్దుతున్నారనీ దుయ్యబట్టారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏవిధంగా ప్రజల గురించి ఆలోచిస్తుండో ఆయన ను చూసి నేర్చుకో అని హితవు




చెప్పారు. మీ తండ్రిని కాంగ్రెస్ పార్టీ రెండు సార్లు పిసిసి అధ్యక్షుడిని చేసిందనీఅన్నారు. పార్టీ అధికారం లో లేనప్పుడు పార్టీనుండి ఎవరు పారిపోయారో అందరికి తెలుసు అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలో లేనప్పుడు రేవంత్ రెడ్డి పార్టీలోకి వచ్చిండనీ ఆయన వివరించారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు ఇవిఎంలతో నిర్వహించడం తగదు

### 'ఓటర్ వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్' సౌకర్యం లేని ఎం-2 ఇవిఎంలు వాడొద్దు

### పిసిసి ఎలక్షన్ కోఆర్డినేషన్ కమిటీ డిమాండ్

**హైదరాబాద్,మే19,ప్రభాతవార్త:** ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ సౌకర్యం లేని ఎం-2 మోడల్ ఇవిఎంలతో జడ్పీటిసి, ఎంపిటిసి, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించడం తగదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ఎలక్షన్ కోఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ పులిపాటి రాజేష్‌కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ సెక్రటరీ లింగ్య నాయక్‌ను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎలక్షన్ కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ కలిసి అభ్యంతరాలు తెలిపింది.

పులపాట రాజేష్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ఎలక్షన్ కమీషనర్ ఆదేశాల మేరకు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి చుడి బజార్ లోని ఇసిఐఎల్ ఇంజనీర్లచే ఇవిఎంల లను చెకింగ్/ఎఫ్ ఎల్ సి ప్రక్రియ చేపట్టినట్లు తెలిసిందని బ్యాలెట్ తోనే ఎన్నికలు జరుపాలని కోరారు. రాబోయే జడ్పీటిసి, ఎంపిటిసి జిహెచ్‌ఎంపి మునిసిపల్ కార్పొరేషన్ ఎలక్షన్ కోసం ఇవిఎం2 మోడల్ ఈవిఎం లను వినియోగం కు మా పార్టీ వ్యతిరేకం అని ఆయన ఖరాఖండిగా తెలిపారు. రాబోయే పంచాయతీ రాజ్, మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బ్యాలెట్ ఓటింగ్ విధానానికే ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు

ఒకవేళ, ఇవిఎంతో ఎన్నికలు జరిగితే, ఎం2 మోడల్ మెషీన్లను ఉప యోగించడాన్ని మేము తీవ్రంగా వ్యతిరేకి స్తున్నాము, ఎందుకంటే ఇఎం2 మోడల్ ఇవిఎం లకు వివిపిఏటీ సౌకర్యం లేదనీ వారు తెలిపారు. ఓటు సరిగ్గా వారు ఇష్టపడే అభ్యర్థికి పోయిందో తెలుసుకునే సౌకర్యం లేదు అందువలన ఎన్నికలకు బ్యాలెట్ పేపర్‌ను వినియోగిం చాలని కోరడం జరిగిందనీ తెలిపారు. ఈ సమావేశంలో టిపిసిసిఎలక్షన్ కమిషన్ కో ఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ పులిపాటి రాజేష్ కుమార్, సభ్యులు సింగిశెట్టి జగదీశ్వర్ రావు, గోపిశెట్టి రాఘవేందర్, టీ. రేవతి గౌడ్, కాసభ శ్రీనివాస్ రావు పాల్గొనడం జరిగినది.

## హైకోర్టు మహిళా న్యాయమూర్తిపై అనుచిత పోస్టులు: విచారణకు జాయింట్ సిపి నేతృత్వంలో సిట్

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్ ఉదంతంలో హైకోర్టు మహిళా న్యాయమూర్తిని ఉద్దేశించి సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు వుంచిన విషయమై పూర్తిస్థాయిలో విచారించేందుకు నగర ఉత్తర జోన్ జాయింట్ సిపి శ్వేత నేతృత్వంలో సి ట్ ఏర్పాటయ్యింది. భగీరథ్ దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను మహిళా న్యాయమూర్తి ఆధ్వర్యంలోని స్పెషల్ బెంచ్ విచారించడం తెలిసిందే. శుక్రవారం అర్ధరాత్రి వరకు దీనిపై విచారణ జరగగా అంతకు ముందు, ఆ తరువాత సోషల్ మీడియాలో న్యాయమూర్తిని ఉద్దేశించి ఈ పోస్టులు వచ్చాయి. దీనిపై హైకోర్టు రిజిస్ట్రార్ ఫిర్యాదు మేరకు మొదట చార్మినార్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు కాగా ఆ తరువాత దీనిని సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌కు బదలీ చేశారు. ఈ కేసులో ఎపికి చెందిన దామోదర్ అనే వ్యక్తిని అరెస్టు చేసిన సైబర్ క్రైం పోలీసులు అతన్ని రహస్య ప్రాం తంలో విచారిస్తున్నారు. ఇదే కేసులో మరో 15 మంది అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## అర్వింద్ అరువు నేత.. అసలైన బిజెపి నేతలు పట్టించుకోరు

### ప్రధాని మోడీ, సిఎం రేవంత్ రెడ్డి మధ్య రహస్య సంభాషణ జరగలేదు

### ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** బిజెపి ఎంపి ధర్మపురి అర్వింద్ అరువుకు తెచ్చుకొన్న నాయకుడని నిఖార్సైన బిజెపి నేతలు అతని ఉని కిని పెద్దగ్గా పట్టిం చుకోరని ఆయనకు ఏలాంటి పదవులు కూడా ఇవ్వరనీ ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. సిఎల్‌పి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయ చతురత నైపుణ్యంను చూసే భారత ప్రధానమంత్రి మోడీ మాతో చేయి కలుపు అని చేయి చాపాడనీ గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంటే ప్రధానమంత్రికి ఎంత గౌరవం ఉందో ధర్మపురి అరవింద్ అర్థం చేసుకొని విమర్శలు మానుకోవాలని హితవు చెప్పారు. రేవంత్ రెడ్డిని విమర్శించ డానికి నిజామాబాద్ ఎంపి అర్వింద్ ప్రధాని మోడీతో పాటు పశ్చిమ బెంగాల్ ముఖ్య మంత్రి సువెందు అధికారిని కూడా తప్పు పడుతున్నాడనీ అన్నారు. కాంగ్రెస్ లోకి రేవంత్ రెడ్డి ఎలా వచ్చారు, ఎలా అధికారంలోకి తెచ్చాడన్నది దేశానికి, మోదీకి కూడా తెలుసనీ అందుకే మాతో కలువు అని మోదీ చేయి చాపాడనీ చెప్పారు.

బిజెపి అన్ని చోట్ల ఒరిజినల్ బిజెపివాళ్లకే పదవులు ఇచ్చిందా? పశ్చిమ బెంగాల్ సిఎం సువేందు అధికారి, అస్సాం సిఎం హేమంత బిశ్వా ఏ పార్టీ నుంచి వచ్చారు? తెలివి లేక అర్వింద్ దద్దమ్మ మాటలు మాట్లాడటం సిగ్గుచేటు కాదా? అర్వింద్ నీ పుట్టక ఎక్కడ? కాంగ్రెస్ పార్టీనే కదా.. నేను ఒరిజినల్ అని ఆయన గుర్తుచేశారు. బిజెపి నాయకుడినని అర్వింద్ గింజుకుంటున్నాడు కానీ డిఎస్ లేకపోతే నీ బతుకు ఎక్కడ అర్వింద్ అని ప్రశ్నించారు. అమ్మ పాలు తాగి రొమ్ము గుద్దినట్లు అర్వింద్ తీరు ఉందని విమర్శించారు. ధర్మపురి అర్వింద్ కాంగ్రెస్ పార్టీకి సేవ చేయాల్సి ఉంటుందనీ బిసి నాయకుడిగా డిఎస్‌కు కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రాధాన్యత ఇచ్చిందనీ పదవులు ఇచ్చిందనీ అన్నారు. రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ లోకి మాలాంటి వాళ్లను ఆహ్వానించామనీ అర్వింద్ లాంటి వాళ్లను బిజెపి ఎప్పటికి పట్టించుకోదనీ అన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ బ్యాక్ గ్రౌండ్ ఉన్న వాళ్లకే పదవులు ఇస్తారనీ చెప్పారు. రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడి ప్రజలు గుర్తించాలని అర్వింద్ ప్రయత్నం చేస్తున్నా డని నిజామాబాద్ కార్పొరేషన్‌లో ఓటమిని అర్వింద్ ఓర్చులేక పోతున్నాడని చెప్పారు. రాహుల్ గాంధీని ప్రధాని చేస్తామని మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢంకా బజాయించి మరీ చెవుతున్నడ సంభాషణ రహస్యంగా జరగలేదనీ కొట్టిపడేశారు.



మంగళవారం సిఎల్‌పిలో మీడియాతో మాట్లాడుతున్న ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు

## పాలమూరుపై సవతితల్లి ప్రేమ చూపిన కెసిఆర్

### మంత్రి జూపల్లి కృష్ణారావు

### భూసేకరణకు కూడా నిధులు ఇవ్వని అప్పటి ప్రభుత్వం: మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్,మే 19,ప్రభాతవార్త:** బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆనాటి ముఖ్యమంత్రి కెసిఆర్ పాలమూరు అభివృద్ధిపై సవతితల్లి ప్రేమను చూపారని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుతోపాటు అనేక ప్రాజెక్టులపై మాట్లాడే అర్హత బిఆర్‌ఎస్ ఎప్పుడో కోల్పోయిందని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. మంగళవారం సిఎల్‌పిలో మీడియాతో మాట్లాడుతూ బిఆర్‌ఎస్ నేతలకు పాలమూరు ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని చెప్పారు. పాలమూరు ప్రాజెక్టుకు2015లో శంకుస్థాపన చేశారనీ, రెండేళ్లలో పూర్తి చేస్తామనీ కెసిఆర్ అన్నారనీ గుర్తు చేశారు. లక్ష కోట్ల ప్రాజెక్టును పదేళ్లలో రూ.25 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెడితే 90 శాతం ఎలా పూర్తి అయినట్లు అని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టు తర్వాత మొదలుపెట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును లక్ష కోట్లు ఖర్చు చేసి ఎలా పూర్తి చేశారని ఆవేదన చెందారు. కల్వకుర్తి పంపులు బాగు చేయలేకపోయా రన్నారు. పాలమూరు ప్రాజెక్టు నీటి కేటాయింపులు సాధించలేకపోయారని తెలిపారు. కృష్ణా నీటిని పదేళ్లు ఆంధ్రప్రదేశ్‌కి తాకట్టు పెట్టారని ఆరోపించారు. రాయలసీమను రతనాల సీమ చేస్తామని చెప్పింది బిఆర్‌ఎస్ కాదా అని ప్రశ్నించారు. గద్వాల్‌లోని ర్యాలంపాడు రిజర్వాయర్‌ను పదేళ్లలో రిస్టోర్ చేయలేదన్నారు. గట్టు, కల్వకుర్తి, జూరాల, కోయిల్ సాగర్, భీమా అన్ని ప్రాజెక్టుల విషయంలో పక్షపాతం చూపారని విమర్శించారు. గద్వాల్‌లోని ర్యాలంపాడు రిజర్వాయర్‌ను పదేళ్లలో రిస్టోర్ చేయలేదన్నారు. పాలమూరు ప్రాజెక్టుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో స్వయంగా ఎమ్మెల్యేలు, మంత్రులు కలిసి చర్చించామని చెప్పారు. కల్వకుర్తి కింద చేపట్టనున్న గొల్లపల్లి రిజర్వాయర్‌ను చేపట్టవద్దని బిఆర్‌ఎస్ నేతలు ఆందో ళనలు చేస్తున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ పాలమూరు పోరుయాత్రలో ప్రజలు ఆడిగితే బిఆర్‌ఎస్ నాయకులు ఏం సమాధానం చెపుతారు..? అని ప్రశ్నిం చారు. పాలమూరులో బటన్ నొక్కితే నీళ్ల వస్తాయని బిఆర్‌ఎస్ నాయకులు అబద్దాలు చెపుతున్నారనీ ఆవేదనచెందారు. ప్రభుత్వ విప్ యెన్నం శ్రీని వాసరెడ్డి ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి వంశీకృష్ణ మాట్లాడుతూ కృష్ణానదిలో న్యాయమైన టిఎంసిల నికరజలాలు సాధించుకొంటామని తెలిపారు.

## వడ్ల కొనుగోళ్లపై సబితా ఇంద్రారెడ్డి దుష్ప్రచారం

### పరిగి శాసనసభ్యుడు టి.రామ్మోహన్‌రెడ్డి

**హైదరబాద్, మే 18, ప్రభాతవార్త:** కొడంగల్‌లో బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి వడ్ల కొనుగోళ్ల పైన తప్పుడు ప్రచారం చేశారనీ పరిగిశాసనసభ్యులు డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి విమర్శించారు.

సిఎల్‌పిలో ఆయన మంగళవారం మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల పైన ప్రభుత్వం నుంచి అధికారికంగా తీసుకుని మాట్లాడాలనీ, కావాలంటే సమాచార హక్కు చట్టం కింద లెక్కలు తీసుకోవచ్చు అని ఆయన వివరించారు. బిఆర్‌ఎస్ నాయకులు అవాస్తవాలు చెపుతున్నారనీ దుయ్యబట్టారు రాష్ట్ర చరిత్రలో ఎప్పుడు లేనన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామనీ తెలిపారు. 6,462 కోట్ల రూపాయలను రైతు ఖాతాల్లో వేశామనీ అన్నారు. బిఆర్‌ఎస్ నాయకులు రైతుల అబద్దాన్ని పదే పదే చెప్పి నిజంగా నమ్మించే ప్రయత్నం చేస్తున్నారనీ ఆవేదన చెందారు.

ఇలాంటి తప్పులు చేస్తే ప్రజలు తిరగబడతారనీ వికారాబాద్ జిల్లాలో మే రెండో వారంలో వరి కోతలు మొదలయ్యాయనీ, 3608 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామనీ తెలిపారు. రైస్ మిల్లర్ల పైన ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు లేవనీఆయన చెప్పారు.

సబితా ఇంద్రారెడ్డి కి ఏ రైతులు ఫిర్యాదు చేశారో చెప్పాలనీ అడిగారు. ప్రభుత్వం పైన బురద జల్లే ప్రయత్నాన్ని ప్రజలు నమ్మరనీ హెచ్చరించారు. బిఆర్‌ఎస్ వాళ్లు రాసింది చూసి చదవితే సబితా ఇంద్రారెడ్డి ప్రజల్లో చులుకన అవుతారనీ హితవు చెప్పారు. గన్నీ బ్యాగ్ లకు ఎక్కడా రైతుల నుంచి డబ్బులు వసూలు చేయడం లేదనీ అన్నారు. బిఆర్‌ఎస్ హయాంలో తరుగు పేరుతో రైతులను మోసం చేశారనీ. కెసిఆర్ ఆయన ఫామ్ హౌస్ లో వరి వేసి రైతులను మాత్రం వరి వేయోద్దని అన్నాడనీ గుర్తుచేశారు.

## కొత్త ఇహెచ్‌ఎస్‌లో సిపిఎస్ రిటైర్డ్ ఉద్యోగుల డేటా సేకరించాలి

### ప్రభుత్వానికి సిపిఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ

**హైదరాబాద్,మే19,ప్రభాతవార్త:** కొత్త ఈహెచ్‌ఎస్ ఈహెచ్‌ఎస్‌లో సీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగుల డేటాను సేకరించాలని తెలంగాణ సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ డిమాండ్ చేశారు. పీపీవో నంబర్ లేకపోయినా, ప్రాన్ (పిఆర్‌ఏఎన్) ఐడీ ద్వారా సీపీఎస్ రిటైర్డ్ ఉద్యో గుల వివరాలు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతిపాదించిన న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ దాని నిర్వహణ కొరకు ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్(ఈహెచ్‌సీటీ) ఏర్పాటు చేస్తూ ఆర్థిక శాఖ జారీ చేసిన మెమో నెం. 3739367 -వో/113/ఏ2/ఈబీఎస్.వీ/2026(తేదిః 19.05. 2026) ను తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయు) స్వాగతిస్తోందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి నరేష్ గౌడ్ తెలిపారు.

ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యుల సమగ్ర డేటాను ఐఎఫ్‌ఎంఐఎస్-హెచ్‌ఆర్ మోడ్యూల్ ద్వారా సేకరించాలని నిర్ణయించడం శుభపరిణామన్నారు. అయితే సీపీఎస్ విధానంలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సాంప్రదాయ పెన్షన్ పేమెంట్ ఆర్డర్ (పీపీవో) నంబర్ ఉండదని, ఈ సాంకేతిక కారణం చేత ఏ ఒక్క సీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగి కూడా ఈ ఉచిత ఆరోగ్య పథకానికి దూరం కాకూడదన్నారు. సీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగులకు పీపీవో నంబర్ ఉండదు కాబట్టి, వారి ప్రాన్ (పర్మనెంట్ రిటైర్మెంట్ అకౌంట్ నంబర్) ఐడీల ఆధారంగా ఐఎఫ్‌ఎంఐఎస్ పోర్టల్‌లో డేటా అప్‌లోడ్ చేసుకునేలా తగిన సాఫ్ట్‌వేర్ వెసులుబాటు కల్పించాలని ట్రెజరీ, ఆర్థిక శాఖ అధికారులను కోరారు.

రాష్ట్రంలోని పెన్షన్ శాంక్షనింగ్ అధికారులు, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు (డీడీవో) సీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగుల వివరాలను (రిటైర్మెంట్ ప్రొసీడింగ్స్, ఆధార్, డిపెండెంట్స్ డేటా) ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించి, ప్రభుత్వం విధించిన గడువు మే 31 లోపు కచ్చితంగా అప్‌లోడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

## బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన పాలకవర్గం

### ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌గా మల్లెపూల సత్యనారాయణ, ఆలేటి మోహన్‌రెడ్డి.. ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్,మే19,ప్రభాతవార్త:** భోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నూతన పాలకవర్గం రెండేళ్లపాటు పదవిలో ఉండనుంది. భోథ్ మార్కెట్ కమిటీ తొలి పాలకవర్గం పదవీకాలం 19 ఫిబ్రవరి 2026తో ముగిసింది. పదవీకాలం ముగిసిన వెంటనే ఎలాంటి జాప్యం లేకుండా నూతన పాలకవర్గాన్ని నియమించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఈ మేరకు మల్లెపూల సత్యనారాయణను మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా, ఆలేటి మోహన్‌రెడ్డిని వైస్ ఛైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ... రైతులకు మార్కెట్ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేయడానికి, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, నిల్వ, విక్రయ ప్రక్రియల్లో పారదర్శకతను పెంపొందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలోని మార్కెట్ కమిటీల పాలకవర్గాల నియామకంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. మార్కెట్ కమిటీలు రైతులకు సేవలందించే కీలక వేదికలని, వాటి ద్వారా రైతులు తమ పంటలకు సరైన ధరలు పొందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భోథ్ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం స్థానిక రైతుల సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషిస్తూ, మార్కెట్ యార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధి, తూకం, నిల్వ, వేలం ప్రక్రియలలో పారదర్శకతను మరింత బలోపేతం చేస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

## కొడుకు తప్పు చేస్తే తండ్రికి సంబంధం ఏమిటి?

### బిజెపి నేతలు పదవి తమకు వస్తుందని ఆశపడుతున్నారు

### రేవంత్ దూకుడు అడ్డుకొనేందుకు అరవింద్ యత్నం

### పిసిసి క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** సంజయ్‌ను పదవి నుండి దించాలని బిజెపి నేతలు డిమాండ్ చేస్తున్నారుకానీ, కొడుకు తప్పు చేస్తే తండ్రికి ఏం సంబంధం ఉంటుంది? అని పిసిసి క్రమశిక్షణ కమి టీ ఛైర్మన్ ప్రశ్నించారు. మంగళవారం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ సంజయ్ పదవిపోతే తమకి పదవి వస్తుందని పలువురు బి జెపి నేతలు ఆశపడుతున్నారనీ ఆరోపించారు. బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసులో చట్టం తన పని తాను చేస్తుందనీ ఆయన తెలిపారు. మనది వెస్ట్‌బెంగాల్, బీహార్ కాదు ఇక్కడ సిఎంగా ఉన్నది రేవంత్‌రెడ్డి తానే మళ్లీ సిఎం అవుతానని ప్రకటించే శక్తి ఉన్నవాడు మీ విన్యాసాలు ఏవి కూడా ఇక్కడ పనిచేయవని నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ వ్యాఖ్యలను తిప్పికొట్టారు. రేవంత్ ఎత్తుకు పైఎత్తులు వేసి మళ్లీ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురాగలడని ధీమా వ్యక్తం చేశారు. సౌత్ ఇండియాలో పార్టీ బలోపే తానికి సిఎం రేవంత్ పని చేస్తున్నారని, ఆయన దూకుడు అడ్డుకోవడానికే ధర్మపురి అరవింద్ ప్రయత్నం చేస్తున్నారని రవి ఆరోపించారు. డిఎస్ జీవితకాలంలో 90 శాతం కాంగ్రెస్ పార్టీలోనే పనిచేశారని డిఎస్ కొడుకు అరవింద్ తెలంగాణ సిఎం రేవంత్‌పై ఇష్టమున్నట్టు మాట్లాడుతు న్నా రని, వైఖరి మార్చుకోవాలని హితవు చెప్పారు. సిఎం రేవంత్ ఇమేజ్ చెడగొట్టాలని చాలామంది ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన చెందారు. పిసిసి క్రమశిక్షణ కమిటీ, అనంతుల శ్యామ్‌మోహన్, ఈరవత్రి అనిల్ ఛైర్మన్, చరణ్ కౌశిక్‌యాదవ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ పర్యవేక్షణకు కీ డేటా లాగర్ సాఫ్ట్‌వేర్

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** సౌర విద్యుత్ యూనిట్లు పర్యవేక్షణకు కీ డేటా లాగర్ పేరుతో ఒక సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి వచ్చింది. దీని పనితీరును నిర్ధారించేందుకు 500 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించి ట్రిపుల్ ఐటీ ఇంజినీర్లు దీనికి రూపకల్పన చేశారు. సౌర పలకల ద్వారా వచ్చే విద్యుత్‌ను ఈ కీ డేటా లాగర్ సాయంతో లెక్కించనున్నారు. అలాగే ఉష్ణోగ్రత వివరాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంది. వర్షాకాలం, శీతాకాలంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను అంచనాలు రూపొందించనుంది. సౌర విద్యుత్ యూనిట్ల వద్ద సెన్సర్లను ఏర్పాటు చేసి వాటిని డ్యాష్‌బోర్డుకు అనుసంధానం చేయడం ద్వారా వాటి వివరాలు ఎప్పటికప్పుడు చూపించేందుకు వీలు కలుగుతుంది. అంతేకాకుండా ఇందులోని సంకేతాలను పరిగణనలోకి తీసుకుని ఏ సౌర పలక వద్ద లోపం ఉందనే విషయాన్ని తెర మీద ప్రదర్శించే విధంగా ఏర్పాట్లు చేశారు. సౌర పలకల ద్వారా 99 శాతం ఇంధనం వచ్చేలా కీ లాగర్ సాయంతో చర్యలు చేపట్టారు. ఈ ప్లాంట్ ద్వారా వచ్చే విద్యుత్‌ను మోటార్లకు వినియోగిస్తున్నారు.

## జూన్ 1న సిఎం ఇంటి ముట్టడి

### పెండింగ్ బిల్లుల విడుదల కోసం

### మాజీ సర్పంచ్‌ల పిలుపు

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** మాజి సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్న డిమాండ్‌తో జూన్ 1 ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ప్రకటించారు. ఈ విషయమై మంగళవారం గన్‌పార్క్ అమర వీరుల స్తూపం వద్ద ఆయన మాట్లాడారు. మాజీ సర్పంచులు పెండింగ్ బిల్లులు చెల్లించాలని అనేకసార్లు మంత్రులకు అధికారులకు వినతి పత్రాలు అందజేసిన ప్రయోజనం లేదని వాపోయారు. హైదరాబాదులో ప్రజా భవన్ లోప్రజావాణి కార్యక్రమానికి 11 సార్లు వినతి పత్రాలు అందజేసినా సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జూన్ 1న చలో ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమానికి బయలుదేంనున్నట్లు ప్రకటించారు. మాజీ సర్పంచుల పదవీకాలం ముగిసి 32 నెలలుగడుస్తున్నా గ్రామాల్లో చేసిన పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యకు పాల్పడుతోందని ఈ సందర్భంగా ఆయన మండిపడ్డారు. సిఎం ఇంటి ముట్టడి కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెఎసి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, కార్యదర్శి కేశబోయిన మల్లయ్య, వై అరవింద్‌రెడ్డి, ఆనబోయిన సుధాకర్, గౌరీరెడ్డి శ్రీధర్ రెడ్డి, గంధం మల్లారెడ్డి, ఆరుట్ల లక్షీ మ్రప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌కు సవాల్‌గా మారిన ఫీజు రీయింబర్స్‌మెంట్

### డిబిటి అమలుపై కోర్టు మధ్యంతర ఉత్తర్వులు.. జూన్ 24న కోర్టు కేసు

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** ఎప్‌సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌కి ఫీజురీయింబర్స్‌మెంట్ సవాల్ మారింది. ఎప్ సెట్-2026కి సంబంధించిన ఫలితాలను ఈ నెల 17న అధికారులు ప్రకటించారు. ఫలితాలు ప్రకటించిన నేపథ్యంలో కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టడం కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు. అయితే కౌన్సెలింగ్‌లో భాగంగా విద్యార్థులు తాము ఎంచుకున్న కాలేజీల్లో ఫీజురీయింబర్స్‌ను చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే హైకోర్టు తీర్పు ఉన్నందున.. కౌన్సెలింగ్ ప్రక్రియను ఎలా కొనసాగించాలని ఎప్ సెట్ అధికారులు, ఉన్నత విద్యా మండలి సమాలోచనలు జరుపుతున్నారు. గత మూడేళ్లుగా రాష్ట్రంలో ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నందున కొన్ని కాలేజీలు కోర్టును ఆశ్రయించగా.. వారికి అనుకూలంగా రానున్న 2026-27 విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల నుంచి కాలేజీలు ఫీజులను వసూలు చేసుకోవచ్చని, ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసిన తరువాత విద్యార్థులకు కాలేజీలు చెల్లించాలని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయాలని కోర్టు ఆదేశించిన నేపథ్యంలో.. ప్రభుత్వం కొత్తగా జీవో నంబర్ 7ను జారీ చేసింది. ట్యూషన్ ఫీజులను నేరుగా విద్యార్థుల ఖాతాల్లోనే జమ చేస్తామని, ఆ తర్వాత విద్యార్థులే కాలేజీలకు ఫీజులు చెల్లించాలని జీవోలో ఒక నిబంధనను చేర్చింది.

ఈ నిబంధన వల్ల ఫీజులు వసూలు చేసుకునే అవకాశం తమకు లేకుండా పోయిందని కాలేజీలు మరోసారి కోర్టును ఆశ్రయించాయి. దీంతో ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ కొత్త నిబంధన హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా ఉందని భావించిన కోర్టు, దానిని నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి జూన్ 24కి కేసును వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో ఎప్ సెట్-2026కి సంబంధించిన కౌన్సెలింగ్ తేదిలను ప్రకటించాలంటే ఫీజురీయింబర్స్‌మెంట్‌పై కౌన్సెలింగ్‌లో ఎలా ప్రకటించాలని అధికారులు ఆలోచిస్తున్నారు. ఇప్పటికే ఉన్నత విద్యా మండలి ఉన్నతాధికారులు ప్రభుత్వ పెద్దలను సంప్రదించగా.. వారి నుంచి స్పష్టమైన ఆదేశాలు రానట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎప్ సెట్ కౌన్సెలింగ్ జూన్ 24 తరువాత నిర్వహిస్తారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. జూన్ 24 వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కాకపోతే విద్యా సంవత్సరం ఆలస్యంగా మొదలయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి ఏదో ఒక స్పష్టత తీసుకొని ఎటువంటి న్యాయపరమైన సమస్యలు రాకుండా కౌన్సెలింగ్‌ను నిర్వహించాలనే యోచనలో ఉన్నత విద్యా మండలి ఉన్నట్టు తెలుస్తోంది.

## భార్యను కత్తితో పొడిచి హత్య

### కుటుంబకలహాలే కారణమని ప్రాథమిక నిర్ధారణ

### అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన భర్త

**హైదరాబాద్ (ముషీరాబాద్), మే 19, ప్రభాతవార్త:** భార్యను భర్త కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసిన ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, గాంధీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంగి దెబోరా (26)కు 2018లో రాజు అనే వ్యక్తితో ప్రేమ వివాహం జరగగా వారికి శివకుమార్(8), రాజేష్(5) అని ఇద్దరు కుమా రులు ఉన్నారు. రెండు సంవత్సరాలుగా దెబోరా, రాజుల మధ్య గొడవలు జరుగుతూ ఉండటంతో గత సంవత్సరం అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో భర్త రాజు తనను వేధిస్తున్నాడని ఫిర్యాదు చేయటంతోపాటు, విడాకుల కోసం కోర్టులో కేసు వేసింది. రాజు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ అత్తాపూర్‌లో నివాసం ఉంటూ ఉండగా, దెబోరా కిషన్‌బాగ్‌లో పిల్లలతో కలసి ఉంటోంది.

దెబోరా కవాడిగూడలోని రత్నదీప్ భవనంలోని నాలుగో అంతస్థులో ఒక స్పా సెంటర్‌లో పనిచేస్తూ ఉన్నది. మధ్యమధ్యలో రాజు భార్య వద్దకు వచ్చి, పిల్లలను చూసే వంకతో దెబోరాకు దగ్గర కావాలని ప్రయత్నించాడు. దెబోరా అతనిని నమ్మకపోవటంతో ఆమెపై రాజు కక్ష పెంచుకున్నాడు. భార్యపై అనుమానం ఉన్న రాజు ఆమెను ఎలాగైనా హత్య చేయాలనే పథకం ప్రకారం, మంగళవారం ఉదయం స్పా సెంటర్‌కు బయలుదేరిన దెబోరాను వెంబడించాడు. ఆటోలో స్పా సెంటర్ వద్ద దిగిన దెబోరాతోపాటు, ఆమె వెనకే వచ్చిన రాజు ఆమెతోపాటు లిఫ్ట్‌లో ఎక్కి, ఆమెతో గొడవకు దిగాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ పెరగటంతో రాజు ఆమెను కత్తితో పలుచోట్ల పొడిచి, ద్విచక్ర వాహనంపై పారిపోయాడు. సమాచారం అందుకున్న గాంధీనగర్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని, క్లూస్‌టీం సాయంతో సీసీ ఫుటేజీల ఆధారంగా ఘటన వివరాలను సేకరించారు. హత్యకు ప్రధాన కారణం కుటుంబ కలహాలేనని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. భార్యను హత్యచేసిన నిందితుడు రాజు అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం అందటంతో గాంధీనగర్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని, గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. దెబోరా తల్లి లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాంధీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. తమ కుమార్తెను అనుమానంతో వేధించి, హత్య చేసిన రాజును కఠినంగా శిక్షించాలని దెబోరా తల్లి విజ్ఞప్తి చేశారు.

# నార్డిక్ కూటమితో భారత్ బంధం మరింత పటిష్టం

### నార్వేలో ప్రధాని మోడీ

### భారత్ వైఖరి స్పష్టీకరణ

**ఓస్లో, మే 19:** భారత్ నార్వే సంబంధాలు అనేక అవకాశాలతో నిండి ఉన్నాయని ప్రపంచ శాంతిని రెండు దేశాలు కాంక్షిస్తున్నామని ప్రధాని మోడీ అన్నారు. నార్వే పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ మాట్లాడుతూ భారతదేశంతో సంబంధాలు, వాణిజ్యం, ఆవిష్కరణల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఉగ్రవాదం విషయంలో తాను రాజీపడబోనని మోడీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, చట్టబద్ధమైన పాలన, బహుపాక్షికవాదం పట్ల మన పరస్పర నిబద్ధత మనల్ని సహజ భాగస్వాములుగా చేస్తుందన్నారు. అదే సమయంలో సాంకేతికత, సుస్థిర అభివృద్ధి విభిన్న రంగాల్లో మన ఉమ్మడి ప్రాధాన్యతలు కలిసి పనిచేయడానికి అపారమైన అవకాశాలను అందిస్తున్నాయని గుర్తుచేసారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని నార్డిక్ దేశాలతో మన సంబంధాలను వేగవంతం చేయడానికి, బలోపేతం చేయడానికి ఎనిమిది సంవత్సరాల క్రితం ఈ ఫార్మాట్‌ను రూపొందించామని అన్నారు. కొన్నేళ్లుగా రెండు దేశాలేకాకుండా నార్డిక్ దేశాల సంబంధాల్లో గణనీయమైన పురోగతి సాధించామని, పదేళ్లలో మన ద్వైపాక్షిక వాణిజ్యం దాదాపు నాలుగు రెట్లు పెరిగిందన్నారు. భారతదేశ వేగవంతమైన వృద్ధిలో నార్డిక్ దేశాల పెట్టుబడి నిధులు కూడా ముఖ్యమైన భాగస్వాములుగా మారుతున్నాయని, గడచినదశాబ్దంలో భారతదేశంలోకి నార్డిక్ దేశాల పెట్టుబడులు దాదాపు 200 శాతం పెరిగాయని మోడీ తెలిపారు. నార్వే, ఐస్‌లాండ్, ఇతర ఈఎఫ్‌టీఏ దేశాలతో కలిసి అక్టోబర్ 2025 నుంచి వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందాన్ని అమలు చేశాం. అంతేకాక కొన్ని నెలల క్రితమే భారత్‌యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పం దంపై సంతకం చేశాం. ఇందులో డెన్మార్క్, ఫిన్లాండ్, స్వీడన్ కూడా భాగస్వాములుగా ఉన్నాయి. ఈ ప్రతిష్టాత్మక వాణిజ్య ఒప్పందాలతో, భారత్‌నార్డిక్ దేశాల మధ్య సంబంధాలలో ఒక కొత్త స్వర్ణయుగాన్ని ప్రారంభించ బోతున్నామని చెప్పుకొచ్చారు. ప్రపంచ ఉద్రి క్తతలు, సంఘర్షణలు నెలకొన్న ఈ యుగంలో భారతదేశంనార్డిక్ దేశాలు నియమాల ఆధారిత ప్రపంచ వ్యవస్థను బలోపేతం చేయడం కొనసాగిస్తాయి. అది ఉక్రెయిన్ అయినా పశ్చిమాసియా అయినా సంఘర్షణలకు త్వరితగతిన ముగింపు పలికి శాంతిని నెలకొల్పే ప్రయత్నాలకు మేము మద్దతు ఇవ్వడం నిరంతరం కొనసాగిస్తాం. బహుళపక్ష సంస్థల సంస్కరణలు అవసరమని, అత్యవసరమని మేము అంగీకరిస్తున్నాము. ఉగ్రవాదం విషయంలో కూడా మాకు స్పష్టమైన, స్థిరమైన వైఖరి ఉంది. రాజీ లేదు. ద్వంద్వ ప్రమాణాలు లేవు. ఈ రోజు నేను సంబంద్ అనే పదాన్ని చాలాసార్లు ఉపయోగించాను. అనేక నార్డిక్ భాషలలో సంబంద్ అనే పదానికి అనుబంధం, సంబంధం, బంధం అని అర్థం.



హిందీలో కూడా సంబంధ్‌కు అదే అర్థం ఉంది. ఇది కేవలం పదాల సారూప్యత మాత్రమే కాదు. ఇది మన ఆలోచనల సాన్నిహిత్యాన్ని ప్రతిబింబిస్తుందని మోడీ పేర్కొన్నారు.

# బలహీనవర్గాల గొంతుక విహెచ్

### అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

### మనసున్న బోళాశంకరుడు వి.హనుమంతన్న : మంత్రి డి.శ్రీధర్‌బాబు

### కేంద్రం జాతీయస్థాయి జనగణనలో కులగణన చేసేవరకు పోరాటం కొనసాగిస్తా : ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు

### జీవనసాఫల్య పురస్కారంతో ఘనంగా అభినందన సత్కారం

**హైదరాబాద్ (రవీంద్రభారతి), మే 19, ప్రభాతవార్త :** అహర్నిశలు పేదల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న బడుగు బలహీనవర్గాల గొంతుక, ఆశా దీపం వి.హనుమంతరావు అని శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. నిర్మొహమాటం, కచ్చితత్వం, మాటలకు నిలబడే మన స్తత్వం ఆయనదన్నారు. ఆరు దశాబ్దాలుగా నమ్ముకున్న కాంగ్రెస్ పార్టీ, సిద్ధాంతాల పట్ల అంకిత



వి.హనుమంతరావును పురస్కారాలతో ఘనంగా సత్కరిస్తున్న ప్రసాద్‌కుమార్, శ్రీధర్‌బాబు, లక్ష్మణ్‌రావు, భీంరెడ్డి, భోగరాజు తదితరులు

భావంతో పనిచేస్తున్న గొప్పనాయకు డన్నారు. ఆయన అనుభవం, సలహాలు, సూచనలు ప్రభుత్వానికి శిరోధార్యం.. ఎంతో ఉపయోగపడతాయన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మంచి మనస్సున్న భోళాశంకరుడు వి. హనుమంతన్న అన్నారు. ఆరు దశాబ్దాల రాజకీయ చరిత్రలో ఏనాడూ పదవులు ఆశించలేదు. ఒక అలుపెరగని గొప్ప కాంగ్రెస్ నాయకుడుగా పార్టీని ఎల్లవేళలా అండదండగా నిలిచి పార్టీలు మారని మహోన్నత వ్యక్తిత్వం ఆయనదన్నారు. బలహీన వర్గాలకు న్యాయం చేయాలంటే హనుమంతన్న సరైన అర్హుడని భావించి ప్రభుత్వ సలహాదారుగా నియమించడం జరిగిందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాకారానికి ఆయన కృషి అనితర సాధ్యమన్నారు. ప్రభుత్వ సలహాదారు ఆయనిచ్చే సూచనలను పరిగణన లోకి తీసుకుని ప్రభుత్వం ముందు కెళుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో మంగళవారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో పలు సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయుడు డా. మహ్మద్ రఫీ సభాధ్యక్ష తన జరిగిన కార్య క్రమానికి ముఖ్య అతిథు లుగా హాజరైన శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, ఐటిశాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు గౌరవ అతిథులు మంత్రి ఎ.లక్ష్మణ్‌కుమార్, నిరంజన్, డా. బి. భీమ్ రెడ్డి, కుసుమ భోగ రాజు, దైవజ్ఞశర్మ, జయా రెడ్డి, శ్రీనివాస మూర్తి, మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి, కూన శ్రీశైలం గౌడ్, శ్రీమణి, గంగా ప్రసాద్ తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి తదుపరి బిసి సంక్షేమశాఖ ప్రభుత్వ సలహాదారు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వి.హనుమంతరావును సీల్‌వెల్ శృతిలయ జీవన సాఫల్యం, ప్రైడ్ ఆఫ్ ఇండియా పురస్కారంతో ఘనంగా పౌరసత్కారం చేశారు. వి. హనుమంతరావు మాట్లాడుతూ ప్రజలసేవే పరమార్థంగా రాజకీయాల్లోకి వచ్చినట్లు పేర్కొన్నారు. బడుగు బలహీనవర్గాలకు తీరని అన్యాయం జరుగుతూనే ఉందని ఆవేదన వ్యక్తపరిచారు. కేంద్రం జాతీయస్థాయి చేస్తున్న జనగణనలో కులగణన చేయకపోవడం చాలా అన్యాయమని, కులగణన చేసేవరకు తన పోరాటం కొనసాగిస్తానని శపథం చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం, ముఖ్యమంత్రి నామీద నమ్మకంతో బిసి సంక్షేమశాఖ ప్రభుత్వ సలహాదారుగా నియమించినందుకు ధన్యవాదాలు తెలుపుతూ ఆనమ్మకాన్ని వమ్ముచేయనని భరోసానిచ్చారు. తనను ఇంత ఘనంగా పురస్కారాలతో సత్కరించినందుకు ఆయా సంస్థలకు, అధినేతలకు అభినందనలు తెలిపారు.

# ధాన్యం కొంటారా! కొనరా?

### రోడ్లపై ధాన్యం పారబోసి నిప్పంటిస్తున్న పరిస్థితి

### సిద్దిపేట, వనపర్తి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అన్నదాతల నిరసనలు

### నిత్యం పలు ప్రాంతాల్లో రహదారులపై ధర్నాలు, రాస్తారోకోలు

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోలేక అన్నదాతలు రోడ్డున పడుతున్నారు. చేతికొచ్చిన పంటను చూసి మురిసిపోవాల్సిన అన్నదాత.. పంటను విక్రయించాలంటే కన్నీరుమున్నీరు కావాల్సిన పరిస్థితి నెలకొంది. "రెక్కలు ముక్కలు చేసుకుని పండించాం. తీరా కొనుగోలు కేంద్రానికి తెస్తే పట్టించుకునే నాథుడే లేడు." అంటూ తెలంగాణ రైతాంగం ఆగ్రహంతో రగిలిపోతోంది. ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న తీవ్ర ఆలస్యానికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా రైతులు రోడ్లపైకి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించాల్సిన దుస్థితి రాష్ట్రంలో నెలకొంది. కొనుగోలు కేంద్రాలకు (ఐకేపీ సెంటర్లకు) ధాన్యం తెచ్చి వారాలు గడుస్తున్నా అధికారులు, మిల్లు యజమానులు రకరకాల సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాలు, తేమ శాతం పేరుతో కోతలు విధిస్తుండటం ఒకత్తయితే తెచ్చిన వడ్లను ఎప్పుడు కొంటారో తెలియని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు అకాల వర్షాలు ఎప్పుడు ముంచేస్తాయోనన్న భయం రైతులను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఆకాశం మేఘావృతమైతే చాలు ఎక్కడ తమ శ్రమంతా వరదపాలు అవుతుందోనని గుండెలు గుభేల్‌మంటున్న పరిస్థితి అన్నదాతలది. సకాలంలో ధాన్యం కొనుగోలులో అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రైతులు నిరసనలకు దిగుతున్నారు. తాజాగా సిద్దిపేట జిల్లా ముస్తాబాద్‌లో రైతులు భారీగా తరలివచ్చి రోడ్డుపై బైఠాయించారు. గంటల తరబడి రాస్తారోకో నిర్వహించి, ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలో రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. జాతీయ రహదారిపైనే వడ్ల కుప్పలకు నిప్పు పెట్టి తమ నిరసనను వినూత్నంగా తెలిపారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో తహసీల్దార్, డీఎస్పీ రంగంలోకి దిగి సర్దిచెప్పాల్సి వచ్చింది. ఇక వనపర్తి జిల్లా రాజపేట సమీపంలో కూడా రైతులు ధాన్యాన్ని రోడ్డుపై పోసి తగలబెట్టారు. 'మా కడుపు మండుతోంది. అందుకే ఈ వడ్లను తగలబెడుతున్నాం' అంటూ ఆవేదన వెళ్లగక్కారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం మానేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మిల్లుల దగ్గర లారీల అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎలాంటి నిబంధనలు పెట్టకుండా మద్దతు ధరతో ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

**పలు జిల్లాల్లో అకాల వర్షాలు... తడిసిన ధాన్యం**

రాష్ట్రంలో ఓవైపు తీవ్ర ఉష్ణోగ్రతలతో ఎండలు దంచికొడుతుంటే మరోవైపు వానలు పలు చోట్ల బీభత్సం సృష్టిస్తున్నాయి. మెదక్, నిజామాబాద్, కామారెడ్డి సహా పలు జిల్లాల్లో మంగళవారం వర్షం కురిసింది. ఈదురు గాలుల ధాటికి ఇళ్ల పైకప్పులు ఎగిరిపోవడంతోపాటు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

# తెలంగాణ ఆవిర్భావ వేడుకలపై స్పెషల్ ఫోకస్

### జూన్ 2న ప్రత్యేక ఆకర్షణగా వేడుకలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 19:** జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలని సిఎం రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్ణయించింది. సికిందరాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధాన వేడుకలు జరగనున్నాయి. ముందుగా గన్‌పార్క్‌లో అమరవీరులకు సిఎం రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించనున్నారు. తర్వాత పెరేడ్ గ్రౌండ్స్‌లోని వేడుకల్లో పాల్గొంటారు. మంగళవారం రాష్ట్ర ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లపై సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఉన్నతాధికారులకు తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని వికాస్ రాజ్ సూచించారు. ప్రతి శాఖ నుంచి నోడల్ అధికారులను నియమించాలని ఆదేశించారు. పెరేడ్ గ్రౌండ్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని



మార్గనిర్దేశం చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని ఆదేశించారు.

వాహనాల పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్దేశించారు. వాటర్ ప్రూఫ్ షామియానాలు, బారికేడింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. సభా ప్రాంగణంలో తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లు చేయాలని అన్నారు. పండుగ వాతావరణంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలని సూచించారు. అసెంబ్లీ, సచివా లయం, ప్రజా భవన్, చార్మినార్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని నిర్దేశించారు. రాష్ట్ర వేడుకలకు లైవ్ టెలికాస్ట్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మే 25వ తేదీ నుంచి పరేడ్ గ్రౌండ్‌లో సంయుక్త రిహార్సల్స్ నిర్వహించాలని వికాస్ రాజ్ మార్గనిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, కార్యదర్శి రఘునందన్ రావు, డిజిపి (లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్, ఎడిజి (ఇంటలిజెన్స్) విజయ్ కుమార్, టిజి జెన్కో సిఎండి హరీష్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి, జలమండలి ఎండి అశోక్ రెడ్డి, ఇతర పోలీసు ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### నీతి ఆయోగ్ మిషన్‌లో..

## రాష్ట్రానికి లీడ్ నాలెడ్జ్ ఇన్‌స్టిట్యూట్‌గా హైదరాబాద్ 'వర్సిటీ

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త :** నీతి ఆయోగ్ మిషన్ కింద తెలంగాణకు లీడ్ నాలెడ్జ్ ఇన్‌స్టిట్యూషన్‌గా హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఎంపికైంది. నీతి ఆయోగ్ రాష్ట్ర సహాయక మిషన్ కింద రాష్ట్రానికి ప్రధాన విజ్ఞాన సంస్థగా హైదరాబాద్ విశ్వవిద్యాలయం నామినేట్ చేయబడింది. ఈ విశ్వవిద్యాలయం రాష్ట్ర ప్రభుత్వానికి పలు వ్యూహాత్మక రంగాలలో విధాన పరిశోధన, పర్యవేక్షణ చట్రాలు, సాంకేతిక నైపుణ్యం మరియు సామర్థ్య పెంపుదల వంటి విషయాలలో సహాయం చేస్తుంది. రాష్ట్రంలో సాక్ష్యాధారిత పాలన, విధాన పరివర్తనకు మద్దతు ఇవ్వడానికి హైదరాబాద్ యూనివర్సిటీ యొక్క బహుళ విషయ నైపుణ్యం, పరిశోధన సామర్థ్యాలను గుర్తించి ప్రణాళికా విభాగం ఈ నామినేషన్‌ను తెలియచేసిందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ చొరవ కింద, విశ్వవిద్యాలయం పరిశోధన ఆధారిత విధాన సూచనలు, సాంకేతిక నైపుణ్యం, పర్యవేక్షణ మూల్యాంకన ఫ్రేమ్‌వర్క్‌లు, డేటా అనలిటిక్స్, రంగాల వారీ అధ్యయనాలు, సామర్థ్య నిర్మాణ మద్దతు ద్వారా రాష్ట్ర సంస్థాగత సామర్థ్యాలను బలోపేతం చేయడానికి దోహదపడుతుంది. తెలంగాణ అభివృద్ధి ప్రాధాన్యతలకు అనుగుణంగా ఆచరణీయమైన విధాన సిఫార్సులు, నేపథ్య కార్యాచరణ ప్రణాళికలను రూపొందించడానికి హైదరాబాద్ యూనివర్సిటీ ప్రణాళికా శాఖ, సంబంధిత ప్రభుత్వ సంస్థలతో కలిసి పనిచేస్తుంది. ఈ కార్యక్రమం ఆర్థిక శాస్త్రం ఫైనాన్స్, వ్యవసాయం అనుబంధ రంగం, పరిశ్రమ మౌలిక సదుపాయాలు, సామాజిక రంగాలు (ఆరోగ్యం విద్య), టెక్నాలజీ వ్యవస్థాపకత, పట్టణాభివృద్ధి, డేటా అనలిటిక్స్ పర్యవేక్షణ, మానవ వనరుల సామర్థ్య నిర్మాణం వంటి పలు వ్యూహాత్మక రంగాలను కవర్ చేస్తుందని నీతి ఆయోగ్ అధికారులు భావిస్తున్నారు.

### కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌లు ఒకరినొకరు కాపాడుకుంటూ

## ప్రజలను మోసం చేస్తున్నారు

### బిజెపి మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్



**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రాన్ని గత పదేళ్ల దోచుకున్న బిఆర్‌ఎస్, ఇప్పుడు పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీలు తెర వెనుక ఒకరికొకరు సహకరించుకుంటున్నారని బిజెపి సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బెయిల్ పార్టీగా కాంగ్రెస్ అన్నారు. దేశంలో జాతీయ పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్ ఉనికి కోల్పోతుందని, ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ (సోనియా గాంధీ), లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు (రాహుల్ గాంధీ) ఇద్దరూ బెయిల్ మీద ఉన్నారు. ఆ పార్టీలో అనేక మంది నాయకులు జైలుకు వెళ్లి వచ్చినవారేనని, కాంగ్రెస్ బిఆర్‌ఎస్‌ల దూప్ ఫైట్ అన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలు డ్రామాలు ఆడుతున్నాయి. గతంలో ఫిరాయింపుల సమయంలో బిఆర్‌ఎస్‌కి కాంగ్రెస్ సహకరిస్తే, ఇప్పుడు కాంగ్రెస్‌కి బిఆర్‌ఎస్ సహకరించుకుంటున్నారని అన్నారు. ఒకరినొకరు కాపాడుకుంటూ, పైకి మాత్రం కొట్టుకుంటున్నట్టు నటిస్తూ కాలయాపన చేస్తున్నారు. నాటి ఓటుకు నోటు కేసు నుండి నేటి వరకు రాహుల్ గాంధీ అండతోనే ఇరు పార్టీలు కలిసి సంసారం చేస్తున్నాయి. బిఆర్‌ఎస్ అధినేత (కెసిఆర్)పై అవినీతి ఆరోపణలు వచ్చి, నోటీసులు అందితే విచారణకు వెళ్లకుండా కోర్టుల ద్వారా రక్షణ కవచం పొందేందుకు ప్రయత్నించారు.

తండ్రి బాటలోనే కొడుకు (కెటిఆర్) ఫార్ములా ఈ రేస్, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, జొన్నవాడ అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ, మియాపూర్ భూములు, ఎంసెట్ పేపర్ లీకేజీ వంటి అంశాల్లో అదే పంథా అనుసరిస్తున్నారు. లిక్కర్ స్కామ్‌లో కూరుకుపోయి బిఆర్‌ఎస్ కవిత జైలుకు వెళ్లి వచ్చి విచారణ ఎదుర్కొంటున్నారు. మరోవైపు మేనల్లుడు (హరీష్ రావు) ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై నోటీసులు అందుకొని కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. కాళేశ్వరం విషయంలో సిఎజిలాంటి రాజ్యాంగ సంస్థలు తప్పులు పట్టినా వీరికి చలనం లేదన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని మంత్రులకు అమెరికా నుంచి హరీశ్‌రావు ఫోన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే19:** తాను ఎక్కడ ఉన్నా ప్రజల కష్టాలు, రైతుల ఇబ్బందుల మీదనే తన ధ్యాస ఉంటుందని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు మరోసారి నిరూపించారు. అమెరికాలో ఉన్నప్పటికీ నియోజకవర్గంలోని రైతులు ధాన్యం అమ్ముకునేందుకు పడుతున్న కష్టాలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. మంత్రులు తుమ్మల, పొన్నం ప్రభాకర్‌లకు ఫోన్ చేసి కొనుగోళ్లలో వేగం పెంచాలని హరీశ్ రావు కోరారు. తన కుమారుడు పోస్ట్ గ్రాడ్యుయేషన్ కాన్వొకేషన్ పట్టా అందుకున్న సందర్భంగా ఇటీవల హరీష్ రావు అమెరికా వెళ్లారు. వ్యక్తిగత పర్యటనలో ఉన్న ఆయన.. సిద్దిపేట నియోజకవర్గంతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలులో ఆలస్యం కారణంగా రైతులు పడుతున్న ఇబ్బందులకు పరిష్కారం చూపేందుకు చొరవ చూపారు. ప్రధానంగా సిద్దిపేట జిల్లాలో సమస్య ఎక్కువగా ఉందని తన దృష్టికి రావడంతో హరీష్ రావు తక్షణమే స్పందించారు. అన్నదాతలు ఆందోళనలో ఉన్నారని తెలిసి అటు ప్రభుత్వం మంత్రులతో.. ఇటు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కోనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడుతున్న అవస్థలు.. ఇబ్బందులు వారి దృష్టికి ఆయన తీసుకెళ్లారు. ఒక వైపు వడ్లు.. మరో వైపు పొద్దు తిరుగుడు ధాన్యం కొనకపోడంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం నిరక్ష్యంతో రైతు లు రోడ్ల మీదకు వస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు హరీష్ రావు అమెరికా నుండి ఫోన్ చేశారు. ధాన్యం, పొద్దుతిరుగుడు కొనుగోళ్లను వెంటనే చేపట్టాలని వారిని కోరారు.

# ఐపిఎల్ టికెట్ల దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు

## ఇద్దరు నిందితుల అరెస్టు.. నగదు, మొబైల్ ఫోన్లు స్వాధీనం

**హుడాకాంప్లెక్స్,19 మే, ప్రభాతవార్త:** సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన ఐపిఎల్ టికెట్ల దోపిడీ కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ఎస్. శ్రీశైలం తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 16వ తేదీన సాయంత్రం 7.30 నిమిషాలకు సమయంలో క్యాంపిక్‌ఘాట్‌లోని మందమల్లమ్మ చౌరస్తా వద్ద తాము ఎస్‌ఓటీ పోలీసులమని బెదిరిస్తూ ఇద్దరు వ్యక్తులు బాధితుల నుండి టికెట్లు బలవంతంగా తీసుకుని అదనంగా రూ.10వేలు ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకుని పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు సరూర్‌నగర్ పోలీసులు క్రైమ్ నెంబర్ 515/2026 కింద బిఎన్ఎస్ సెక్షన్లు 204, 308(2) ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగింది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ అధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టి ఈ నెల 18వ తేదీ సాయంత్రం సైదాబాద్ కాలనీ ప్రాంతంలో నిందితులు కె.శివప్రకాశ్, ఎస్.సాకేత్‌రెడ్డిలను అదుపులోకి తీసుకోవడం జరిగింది. వారి వద్ద నుండి బలవంతంగా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్న రూ.7వేల నగదుతో పాటు రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరితగతిన ఛేదించిన క్రైమ్ ఎస్ఐ కె.మహేందర్, సిబ్బంది హనుమంతు, శివప్రసాద్, మోతీరాం, రమేశ్‌లను సరూర్‌నగర్ ఎస్‌హెచ్ఓ ఎస్.శ్రీశైలం అభినందించడం జరిగింది.

# ఏటీఎంలు ఖాళీ?

## - బ్యాంకులను వేధిస్తున్న నగదు కొరత- గ్రామీణ ప్రాంతాల్లో రోజూ రూ. కోటి అవసరం - అందుబాటులో మాత్రం కేవలం రూ.10 లక్షలే - ఖాతాదారులకు తప్పని తీవ్ర అవస్థలు

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక ప్రాంతాల్లోని ఏటీఎంలు నగదు కొరతను ఎదుర్కొంటున్నాయి. ఎక్కడ చూసినా నగదు నో క్యాష్ బోర్డులే దర్శనమిస్తున్నాయి. తెలంగాణ లోని అనేక బ్యాంకులు ప్రస్తుతం తీవ్ర నగదు కొరతను ఎదుర్కొంటున్నాయి. ఒక మోస్తరు పట్టణంలోని ప్రజల నగదు అవసరాలకు కోటి రూపాయల దాకా అవసరం ఉంటుండగా బ్యాంకులకు పది లక్షలకు మించి నగదు అందడం లేదు. దీంతో ఖాతాదారులకు అవసరమైనదానికంటే చాలా తక్కువ మొత్తంలోనే చెల్లిస్తున్నారు. బ్లాక్ మనీ రూపంలో పెద్ద మొత్తంలో కరెన్సీ గోప్యంగా ఉండటం కూడా మార్కెట్‌లో కరెన్సీ చెలామణి తగ్గడానికి ఒక కారణంగా బ్యాంకు అధికారులు చెబుతున్నారు. బ్యాంకులలో తగిన నగదు నిల్వలు అందుబాటులో లేవు. అలాగే ఏటీఎంలలో క్యాష్ అందుబాటులో ఉండటం లేదు. దీనికి తోడుతున్నట్లుగా ప్రజల వద్ద కూడా తగిన నగదు నిల్వలు లేక పోవడంతో డిజిటల్ పేమెంట్ లే ఎక్కువగా చేస్తున్నారు. అలాంటప్పుడు రిజర్వ్ బ్యాంకు దేశంలో ప్రజల కోసం అందుబాటులో ఉంచిన రూ.38 లక్షల కోట్ల నగదుపైన సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. డిజిటల్ పేమెంట్లు పెరిగిన తరువాత కూడా నగదు అందుబాటులో లేక పోవడంపై సర్వత్రా విమర్శలు వెలువడుతున్నాయి. ఇక తెలంగాణలోని అనేక పట్టణ కేంద్రాలలో ఇదే పరిస్థితి ఉందని బ్యాకర్లు అంటున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఒక చిన్న పట్టణంలోని ఒక జాతీయ బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ తమకు ప్రతి రోజు కోటి రూపాయల నగదు అవసరం అవుతుందని, కానీ రూ.10 లక్షల నగదు మాత్రమే తమకు అందుబాటులోకి వస్తున్నదని చెప్పారు. ఫలితంగా నగదు కోసం వచ్చే కస్టమర్లకు వారి అవసరం మేరకు నగదు ఇవ్వలేక పోతున్నామని తెలిపారు. చాలా మంది ఖాతాదారులు అంతా సామాన్యులేని, వారికి నిత్యం నగదు అవసరం అవుతుందని సదరు బ్యాంకు మేనేజర్ చెప్పారు. తమ ఖతాలోని సొమ్ము ఇవ్వాలని అడిగితే క్యాష్ లేదని ఎందుకు చెబుతున్నారంటూ తమను నిలదీస్తున్నారని ఆయన వాపోయారు. కాగా దేశంలో నగదు కొరత ఉందని రిజర్వు బ్యాంకు ఎలాంటి అధికారిక ప్రకటనలు చేయకపోయినా ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో అర్థం కావడం లేదని హైదరాబాద్ జోనల్ కార్యాలయానికి చెందిన ఒక ప్రముఖ బ్యాంకు అధికారి పేర్కొన్నారు. జాతీయ బ్యాంకులలో అతి ప్రధానమైన ఎస్‌బీఐ కూడా నగదు కొతర ఉన్నట్లు అధికారికంగా ప్రకటన చేయలేదు. కానీ చాలా బ్యాంకు బ్రాంచీలల్లో మాత్రం కొరత ఉన్నట్లు సమాచారం. కాగా కేంద్ర ప్రభుత్వం నగదు చెలామణిని తగ్గించడం ద్వారా బ్లాక్ మార్కెట్‌ను అరికట్ట వచ్చునని చెపుతూ యూపీఐ పేమెంట్లను ప్రోత్సహించింది. దీంతో చిరు వ్యాపారుల వద్ద నగదు లేకుండా పోయింది. ఎవరైనా డబ్బులు ఇచ్చి చిల్లర ఇవ్వమంటే స్కాన్ చేయండి అని చెపుతున్నారు.

# గంజాయి స్మగ్లర్లపై ఈగల్ దాడులు

## ఐదుగురి అరెస్టు, 450 కిలోల గంజాయి స్వాధీనం

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గంజాయి స్మగర్లపై ఈగల్ పోలీసుల దాడులు కొనసాగుతూనే వున్నాయి. తాజాగా ఖమ్మం, భువనగిరి జిల్లాలలో నిర్వహించిన దాడుల్లో 450 కిలోల గంజాయి పట్టుబడగా ఈ సందర్భంగా ఐదుగురు స్మగ్లర్లు అరెస్టయ్యారు. ఖమ్మం జిల్లాలో 100 కిలోల గంజాయి పట్టుబడగా మానియల్ భత్రా, లక్ష్మణ్ కిలో, సన్యాసి నాయుడు అనే పాత స్మగ్లర్లు దొరికిపోయారు. వీరిపై ఎపిలో నూ గంజాయి స్మగ్లింగ్ కేసులున్నాయి. కాగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 350 కిలోల గంజాయి పట్టుబడగా సలీం, అమన్ అనే పాత నేర గాళ్లు దొరికిపోయారు. రెండు జిల్లాలలో పట్టుబడ్డ స్మగర్లను, గంజాయిని తదుపరి విచారణ నిమిత్తం ఆయా ప్రాంతాల పోలీసులకు అప్పగించారు. కాగా హైదరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పరిధిలో గంజాయి వ్యసనపరులు 12 మంది పట్టుబడ్డారు.

వీరిని పునరావాస కేంద్రానికి తరలించారు. రాష్ట్రంలో మాదకద్ర వ్యాలపై ఉక్కుపాదం మోపుతామని ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా తెలిపారు. దీనికి సంబంధించి ఎలాం టి సమాచారం వున్నా ప్రజలు వెంటనే 1908 లేదా సమీప పోలీసు స్టేషన్లకు తెలపాలని ఆయన కోరారు.



మంగళవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ప్రముఖ హిందీ కవి ఫరీద్ ఖాన్ హిందీ అనువాద గ్రంథం తెలుగులో ఎస్ .వినయ్ కుమార్ రచించిన సొంత గడ్డపైనే నేనొక పరాయివాణ్ణి గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ డాక్టర్ ఎస్.వై. ఖురేషీ, చిత్రంలో బివి రాఘవులు తదితరులు

# ఏకాభిప్రాయం తర్వాతే డీలిమిటేషన్ పై నిర్ణయం

**2027 జనగణన అనంతరం దేశ రాజకీయాల్లో కీలక మార్పులు**

**డీలిమిటేషన్‌ను ఉత్తర-దక్షిణ రాష్ట్రాల మధ్య పోరుగా చూపడం ప్రమాదకరం**

**మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ డాక్టర్ ఎస్.వై. ఖురేషీ**

**చిక్కడపల్లి మే 19 ( ప్రభాతవార్త ) :** 2027 జనగణన అనంతరం దేశ రాజకీయాల్లో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశముందని భారత పూర్వ ప్రధాన ఎన్నికల కమిషనర్ డాక్టర్ ఎస్. వై. ఖురేషీ కీలక వ్యాఖ్యలు చేసారు. మంగళవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 41వ స్మారక ఉపన్యాస కార్యక్రమం జరిగింది. ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన - దక్షిణాది రాష్ట్రాల స్థితిగతులు" అనే అంశంపై ముఖ్య అతిధిగా డాక్టర్ ఎస్.వై. ఖురేషీ ప్రధాన ప్రసంగం చేసారు. డిలిమిటేషన్ ఇప్పటివరకు రాజ్యాంగ నిపుణులు, ఎన్నికల అధికారులకే పరిమితమైన అంశమని, ఇప్పుడు ఇది దేశవ్యాప్తంగా రాజకీయ చర్చగా మారిందన్నారు. దక్షిణాది రాష్ట్రాలు విద్య, ఆరోగ్యం, జనాభా నియంత్రణలో ముందంజ వేసి కేంద్ర లక్ష్యాలను సాధించాయని, ఇప్పుడు అదే విజయమే వారికి రాజకీయ నష్టంగా మారే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. మరోవైపు ఉత్తరాది రాష్ట్రాలు పెరిగిన జనాభాకు తగిన ప్రాతినిధ్యం కావాలని కోరుతున్నా యన్నారు. దేశ సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేయాలంటే దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరిగేలా నియోజక వర్గాల పునర్విభజన చేపట్టాలని, జనాభా నియంత్రణలో ముందంజలో ఉన్న రాష్ట్రాలు రాజకీయంగా నష్టపో కూడదు అని పేర్కొన్నారు. దేశ జనాభా ఆధారంగా మాత్రమే నియోజక వర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందన్నారు. కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసిన రాష్ట్రాలు నష్టపోయే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. అభివృద్ధి, విద్య, ఆరోగ్యం, పన్నుల రూపంలో దేశానికి ఎక్కువ ఆదాయం అందిస్తున్న రాష్ట్రాలకు తగిన గౌరవం, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి రాష్ట్రానికి సమాన అవకాశాలు ఉండాలని, సమాఖ్య స్ఫూర్తిని కాపాడటం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని ఖురేషీ పేర్కొన్నారు. డిలిమిటేషన్ అంశంపై అన్ని రాష్ట్రాలతో విస్తృత చర్చలు జరిపి ఏకాభిప్రాయం సాధించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. భారత భవిష్యత్ రాజకీయ సమతౌల్యంపై డిలిమిటేషన్ ప్రభావం చూపనుందని పేర్కొన్నారు. ప్రస్తుతం లోక్‌సభ స్థానాల కేటాయింపు 1971 జనగణన ఆధారంగానే కొనసాగుతోందన్నారు. ఒక వ్యక్తి - ఒక ఓటు - ఒకే విలువ అనే ప్రజాస్వామ్య సూత్రాన్ని విస్మరించలేమని స్పష్టం చేశారు. డిలిమిటేషన్‌ను ఉత్తర–దక్షిణ రాష్ట్రాల మధ్య పోరుగా చూపడం ప్రమాదకరమన్నారు. లోక్‌సభ స్థానాల పెరుగుదలతో రాజకీయ ప్రభావం, కేబినెట్ నిర్మాణం, కూటమి సమీకరణాలు మారుతాయని వివరించారు. అమెరికా, జర్మనీ, ఆస్ట్రేలియా వంటి దేశాల సమాఖ్య విధానాలను ఉదాహరణగా ప్రస్తావించారు. రాజ్యసభను నిజమైన "రాష్ట్రాల మండలి"గా బలోపేతం చేయాలని సూచించారు. జనాభాతో పాటు మహిళా అక్షరాస్యత, శిశు మరణాల తగ్గుదల, జనాభా నియంత్రణ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చే "కాంపోజిట్ ఫార్ములా"ను ప్రతిపాదించారు. డిలిమిటేషన్‌ను ఒక్కసారిగా కాకుండా దశలవారీగా అమలు చేయడం ఉత్తమ మన్నారు. దేశ సమాఖ్య స్ఫూర్తి, ప్రజాస్వామ్య సమానత్వాన్ని కాపాడే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. డీలిమిటేషన్ అనంతరం ఏ రాష్ట్రానికి కూడా ప్రస్తుత స్థానాలు తగ్గవని ప్రధాని, కేంద్ర హోంమంత్రి హామీ ఇచ్చారని గుర్తుచేసిన ఖురేషీ, అయినప్పటికీ వాస్తవ రాజకీయ ప్రభావం సంఖ్యల ద్వారానే నిర్ణయించబడుతుందని అన్నారు. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌కు తమిళనాడుతో పోలిస్తే 40 స్థానాల ఆధిక్యం ఉండగా, భవిష్యత్తులో అది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బివి రాఘవులు, సుందరయ్య విజ్ఞానకేంద్రం మేనేజింగ్ ట్రస్టీ ఎస్. వినయ్ కుమార్, సభ్యుడు బుచ్చి రెడ్డి, కె.ఆనందా చారి తదితరులు పాల్గొనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ హిందీ కవి ఫరీద్ ఖాన్ హిందీ అనువాద గ్రంథం తెలుగులో ఎస్ .వినయ్ కుమార్

### వైఎస్సార్సీ కేంద్ర కార్యాలయంలో

# జగన్‌ను కలిసిన దివ్యాంగ ప్రతినిధులు

**విజయవాడ మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీపి కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపి అధ్యక్షుడు వైయస్ జగన్‌ను ఆల్ యూనివర్సిటీ దివ్యాంగ్ వింగ్స్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎం.శ్రీనివాసరావు కలిసి తమ సమస్యలను వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని 19 యూనివర్సిటీలలో మొత్తం 1523 అసిస్టెంట్ ప్రొఫెసర్ అసోసియేట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికి, దివ్యాంగులకు ఎలాంటి రిజర్వేషన్లు కల్పించలేదని వారు వైయస్ జగన్‌కు తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించి, పీహెచ్‌డీలు పూర్తి చేసిన తమలాంటి దివ్యాంగులు రిజర్వేషన్లు లేకపోవడం వల్ల ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగుల హక్కులు, సమానత్వం, సాధికారత కోసం భారత ప్రభుత్వం అమలు చేస్తున్న రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసిబిలిటీస్ ఆక్టా 2016 చట్టాన్ని చంద్రబాబు ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కోల్పోతున్న పరిస్థితి నెలకొన్నదన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో కూడా తమకు తగిన అవకాశాలు ఇవ్వడం లేదని వాపోయారు. దివ్యాంగుల సమస్యలను సావధానంగా విన్న వైయస్ జగన్, వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో వైఎస్సార్సీపి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం తీసుకున్న చర్యలను గుర్తు చేస్తూ, భవిష్యత్తులో కూడా దివ్యాంగులకు అండగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలుస్తోందని భరోసా ఇచ్చారు.

# వ్యవసాయంలో కృత్రిమ మేధస్సుదే కీలకపాత్ర

## - విజయవంతంగా రైస్ ప్రాజెక్ట్ స్టేక్‌హోల్డర్స్ వర్క్‌షాప్

**అత్తాపూర్ మే19,ప్రభాతవార్త :** ఆధునిక వ్యవసాయంలో కృత్రిమ మేధస్సు వినియోగం రోజురోజుకీ విస్తరిస్తోందని ముఖ్యంగా పంటల్లో కనిపించే సమస్యలను చిత్రాల ఆధారంగా గుర్తించి, తక్షణ పరిష్కార సూచనలు అందించడంలో ఎఐ ఆధారిత నమూనాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఈ నేపథ్యంలో రైతులకు సాంకేతిక సేవలను సమర్థవంతంగా చేరవేసేందుకు రూపొందించిన రైస్ ఏఐ స్ట్రెస్ ఎవాల్యుయేటర్ " ప్రాజెక్ట్‌కు ప్రాధాన్యం పెరుగుతోందని పలువురు అధికారులు పేర్కొన్నారు. మంగళవారం భారతీయ వరి పరిశోధన సంస్థ రాజేంద్రనగర్‌లో రైస్ ప్రాజెక్ట్ స్టేక్‌హోల్డర్స్ వర్క్‌షాప్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ డైరెక్టర్ డా. ఆర్.ఎం. సుందరం అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ విద్యా విభాగం మాజీ డైరెక్టర్ డా. సుధారాణి హాజరైయ్యారు. మొదటగా డా. ఆర్.ఎం సుందరం మాట్లాడుతూ... రైతులకు సకాలంలో సరైన సలహాలు అందించేందుకు డిజిటల్ టెక్నాలజీల వినియోగం అత్యంత అవసరమని తెలిపారు. రైస్ మొబైల్ యాప్ ద్వారా వరి పంటలో కనిపించే సమస్యలను సులభంగా గుర్తించి, తగిన నిర్వహణ సూచనలు అందించవచ్చని వివరించారు. రైతులు యాప్‌లో అప్‌లోడ్ చేసే చిత్రాలకు జియోట్యాగింగ్ సదుపాయం కల్పించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. దీని ద్వారా ఏ ప్రాంతంలో ఏ తెగులు లేదా పురుగు సమస్య ఎక్కువగా నమోదవుతుందో గుర్తించవచ్చని పేర్కొన్నారు. తద్వారా వచ్చే పంట సీజన్‌లో ఆయా ప్రాంతాల రైతులకు ముందస్తు హెచ్చరికలు మరియు తగిన నిర్వహణ సూచనలు అందించే అవకాశం ఉంటుందని వివరించారు. ముఖ్య అతిథి డా. సుధారాణి మాట్లాడుతూ, వ్యవసాయ విస్తరణలో స్మార్ట్ టూల్స్ పాత్ర రోజురోజుకీ పెరుగుతోందని, ఈ తరహా యాప్‌లు రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారతాయని అభిప్రాయపడ్డారు. అలాగే రైస్ యాప్‌ను మరింత సమర్థవంతంగా రూపొందించేందుకు పలు విలువైన సూచనలు



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అధికారులు

చేశారు. ముఖ్యంగా రైతులకు అందించే తుది సలహాలు స్థానిక రైతుల భాషలో ఉండాలని, యాప్‌లో ఫోటోలు అప్‌లోడ్ చేసే ప్రక్రియను మరింత సులభతరం చేయాలని సూచించారు. అదేవిధంగా వివిధ వ్యవసాయ వాతావరణ మండలాల ఆధారంగా యాప్ పనితీరును ధృవీకరించడం, అన్ని రకాల మొబైల్ ఫోన్లలో యాప్ సులభంగా పనిచేసే విధంగా రూపొందించడం, రైతులకు అనుకూలమైన వినియోగదారు స్నేహపూర్వక ఇంటర్‌ఫేస్ కల్పించడం అవసరమని తెలిపారు.

అలాగే యాప్‌లో యాంకర్ ఆధారిత చాట్‌బాక్స్ ద్వారా రైతుల ప్రశ్నలకు మరింత ఖచ్చితమైన సమాధానాలు అందించే విధంగా ధృవీకరణ వ్యవస్థను అభివృద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా రైస్ ప్రాజెక్ట్ బ్రోచర్‌ను అతిథులు ఆవిష్కరించారు. ఈ బ్రోచర్ ద్వారా ప్రాజెక్ట్ లక్ష్యాలు, యాప్ ముఖ్య లక్షణాలు మరియు రైతులకు అందించే సేవల వివరాలను తెలియజేశారు. డా. శైలజతో పాటు రైస్ ప్రాజెక్ట్ శాస్త్రవేత్తల బృందం యాప్ యొక్క ప్రధాన ప్రత్యేకతలు, పనితీరు మరియు వినియోగ విధానాన్ని వివరించారు.

# సరస్వతి అంత్య పుష్కరాలకు విద్యుత్ ఏర్పాట్లు పూర్తి

## ఉత్తర తెలంగాణ విద్యుత్ సంస్థ సిఎండి వరుణ్‌రెడ్డి

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త** సరస్వతి అంత్య పుష్కరాలు ఈ నెల 21వ తేదీ నుండి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్న నేపథ్యంలో విద్యుత్ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో పుష్కరాల సందర్భంగా లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మొత్తం 330 ఎనిమిది మీటర్ల స్తంభాలు, 152 తొమ్మిది మీటర్ల స్తంభాలు, 8 పదకొండు మీటర్ల స్తంభాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా సుమారు 5 కి.మీ. 11 కేవీ లైన్, 12 కి.మీ. ఎల్‌టీ లైన్ వేయడం పూర్తయినట్లు వెల్లడించారు. మొత్తం 18 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. నిరంతరాయ విద్యుత్ సరఫరా నిర్వహణ కోసం 16 కీలక ప్రాంతాలలో 12 రోజుల పాటు రౌండ్ ది క్లాక్ పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. విధుల్లో 4 మంది డివిజనల్ ఇంజినీర్లు, 6 మంది అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లు, 13 మంది అసిస్టెంట్ ఇంజినీర్లు, 12 మంది సబ్ ఇంజినీర్లు, 13 మంది లైన్ ఇన్స్పెక్టర్లు, 9 మంది లైన్మెన్లు, 45 మంది అసిస్టెంట్ లైన్మెన్లు తదితర సిబ్బంది కలిపి మొత్తం 150 మంది విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు విఫలమైన సందర్భంలో వెంటనే మార్పిడి చేయడానికి అదనపు స్పేర్ ట్రాన్స్‌ఫార్మర్లను కూడా సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు.

# పాలమూరు ప్రాజెక్టులకు ప్రాధాన్యత..

# దేవాదుల, ఎస్.ఎల్.బి.సి, సీతారామతోపాటే పూర్తి

## పూడిక తీసి జూరాల నీటి నిలువ సామర్థ్యాన్ని పెంచుతాం: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** ఉమ్మడి పాలమూరు (మహబూబ్‌నగర్) జిల్లాలోని ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదలశాఖామంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పునరుద్ఘాటించారు. దేవాదుల, ఎస్.ఎల్.బి.సి., సీతారామ ప్రాజెక్టులతో సరి సమానంగా పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి సమృద్ధిగా సాగు, తాగు నీరు అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో సహచర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో కలసి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టుల పనుల పురోగతి పై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పదేళ్ళ పాలనలో పాలమూరు జిల్లాకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మరో పదిహేను రోజుల్లో ప్రత్యేక సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి పనుల వేగవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రాజెక్టుల పనుల పురోగతి పై సమగ్రమైన నివేదికలు రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. పెద్ద ఎత్తున మట్టి పేరుకపోయి నీటి సామర్థం నిలువ 8 టింఎంసిల దిగువకు పడిపోయిన జూరాల ప్రాజెక్టును ప్రస్తావిస్తూ పూడిక తీసి నీటి సామర్థ్యాన్ని పెంపొం దించేందుకు వీలుగా డిఆర్ఐపికు ప్రతిపాదనలు పంపించినట్లు పేర్కొన్నారు. పూడిక తీత పనులతో నీటి సామర్థం నిలువలు గణనీయంగా పెరగడమే కాకుండా రిజర్వాయర్ భద్రత, నిర్వహణ మరింత మెరుగవు తుందన్నారు. అదేవిధంగా.. చిన్న తరహా సాగునీటి చెరువుల్లో వర్షా కాలానికి ముందే పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. ప్రధానంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు 90శాతం పూర్తయ్యాయంటూ బిఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారం పూర్తిగా సత్యదూరమని ఆయన విమర్శించారు. ఆ



ప్రచారం ముమ్మాటికీ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకేనని మండిపడ్డారు. బిఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టు ఆఫ్ టెక్‌ను జూరాల నుండి శ్రీశైలం రిజర్వాయర్‌కు మార్చడంతో తీవ్రంగా నష్టం వాటిల్లిందని ఆయన ఆరోపించారు. భూసేకరణ జరపకుండానే బిఆర్ఎస్ ప్రభుత్వం డిస్ట్రిబ్యూటర్ నెట్ వర్క్‌కు టెండర్లు పిలిచి చేతులు దులుపుకుందని ఎద్దేవా చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసి తొలి దశలో నాగర్ కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, వికారాబాద్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని 1226 గ్రామాలకు తాగునీరు, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం.

# ఎరువుల ధరల పెంపునకు కంపెనీలకు కేంద్ర ప్రభుత్వ అనుమతులు

## రూ.225 నుండి రూ.300 మేర పెరిగిన ధరలు

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** ఆరుగాలం శ్రమించిఅందరి ఆకలి తీర్చే రైతన్నకు అడ్డూ అదుపులేకుండా పెరుగుతున్న ఎరువుల ధరల భారం శాపంగా పరిణమించింది. ఈ ఏడాది కాంపెక్స్ ఎరువుల ధరలను ఆయా కంపెనీలు నాలుగుసార్లు పెంచడంతో రానున్న ఖరీఫ్/వానాకాలం సాగు భారం కానుంది. గత వానాకాలం సీజన్‌లో బాస్తకు రూ.50, ఆ తర్వాత యాసంగి సీజన్‌లో రూ.50 చొప్పున రెండుసార్లు కలిపి రూ.100 మేర పెంచగా అది చాలదన్నట్టు తాజాగా నాలుగోసారి బస్తాకు రూ.225 నుండి రూ.300 మేర పెంచడంతో వానాకాలం సాగును ఎరువుల ధరలు ప్రశ్నార్థకంగా మార్చే ప్రమాదం నెలకొంది. రాష్ట్రంలో వరి, మొక్కజొన్న, పత్తితోపాటు మిర్చి, పొద్దుతిరుగుడు, సోయా తదితర పంటల సాగులో కాంప్లెక్స్ ఎరువుల వినియోగం అధికంగా ఉంటోంది. కేంద్ర ప్రభుత్వం ధరల పెంపుకు ఎరువుల కంపెనీలకు ఎడాపెడా అనుమతిస్తుండడంపై అన్నదాతలు, రైతు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పశ్చిమాసియా యుద్ధం, ముడిసరుకుల ధరలు, దిగుమతి చార్జీల సాకుతో కంపెనీలు, కేంద్ర ప్రభుత్వం కలిసి అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువుల ధరలను అమాంతం పెంచాయి. 50కిలోల కాంప్లెక్స్ ఎరువుల బస్తా ధర సగటున రూ.300, కొన్ని రకాల ఎరువులపై బస్తాకు ఏకంగా రూ.350 చొప్పున ధరలు పెరిగాయి. 20:20:0:13 కాంప్లెక్స్ బస్తా ధర కొన్ని రోజుల క్రితం రూ.1,500 నుంచి రూ.1,800కు పెరిగింది. తాజా పెంపుతో ఈ బస్తా ధర ఇప్పుడు రూ.2,150 అయింది. యాసంగి సాగు ఇటీవలే ముగిసి, వడ్లు, మక్కజొన్నలను అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడుతున్న పరిస్థితుల్లో ఎరువుల ధరలు భారీగా పెంచడం వ్యవసాయరంగంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోంది.

# శాన్‌డియాగో మసీదులో కాల్పులు.. ముగ్గురు మృతి!

**శాన్ డియాగో,మే 19:** అమెరికాలోని శాన్ డియాగో మసీదులో జరిగిన కాల్పులు ఘటనలో ముగ్గురు మృతిచెందారు. ఇస్లామిక్ సెంటర్ ఆఫ్ శాన్ డియాగోలో జరిగిన ఈఘటనలో ఇద్దరు టీనేజీ వ్యక్తులు కాల్పులకు తెగించారు. ఆ తర్వాత నిందితులు ఇద్దరు కూడా గాయాలతో ప్రాణాలు కోల్పోయారు. విద్వేష నేరం కోణంలో ఈ కేసును



పరిశీలిస్తున్నామని శాన్ డియాగో పోలీసు చీఫ్ స్కాట్ వాల్ తెలిపారు. ఏ కారణం చేత టీనేజీ యువకులు కాల్పులకు పాల్పడ్డారో తెలియదని, భవిష్యత్తులో ఈ అంశాలు బయటపడే అవకాశాలు ఉన్నట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. కాల్పులు జరిపిన ఓ యువకుడి తల్లి ఘటనకు ముందే పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన కుమారుడు మిస్సింగ్‌లో ఉన్నట్లు చెప్పింది. ఆయుధాలతో పాటు తన వాహనాన్ని తన కొడుకు తీసుకెళ్లినట్లు ఆమె పోలీసులకు చెప్పింది. ఇస్లామిక్ సెంటర్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మాడిసన్ హై స్కూల్‌లో ఆ టీనేజర్ చదువుతున్నట్లు తెలిసింది. కాల్పుల ఘటనలో మృతిచెందిన వారిలో ఓ సెక్యూర్టీ గార్డు ఉన్నాడు. ఆయుధాలతో వచ్చిన యువకుడిని ఆ సెక్యూర్టీ గార్డు అడ్డుకునే ప్రయత్నం చేశారని , మృతుల సంఖ్య పెరగకుండా ఆ గార్డు కృషిచేసాడు.

# కదులుతున్న కారులో లాయర్‌పై లైంగికదాడి

**పూణె, మే 19:** దేశంలో మహిళల రక్షణను, ముఖ్యంగా చట్టాన్ని రక్షించే వృత్తిలో ఉన్న వారి భద్రతను సైతం ప్రశ్నించేలా మహారాష్ట్రలోని పుణే నగరంలో అత్యంత దారుణమైన, దిగ్భ్రాంతికరమైన ఘటన వెలుగుచూసింది. మ్యాట్రిమోనియల్ సైట్ ద్వారా పరిచయమైన వ్యక్తిని కలిసేందుకు వెళ్లిన ఒక మహిళా లాయర్‌పై కదులుతున్న కారులోనే పైశాచికంగా సామూహిక లైంగిక దాడికి ఒడిగట్టారు. ఈ ఘోరానికి సంబంధించి పుణే పోలీసులు వేగంగా స్పందించి ఇప్పటికే ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోగా, పరారీలో ఉన్న మరొకరి కోసం గాలిస్తున్నారు. బీహార్‌లోని పాట్నాకు చెందిన సదరు బాధిత మహిళ పుణేలోనే ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసి, ప్రస్తుతం బాంబే హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. వృత్తిపరమైన పని నిమిత్తం పుణేకు వచ్చిన ఆమె గత ఆదివారం ఒక ప్రముఖ మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్ ద్వారా పరిచయమైన వ్యక్తిని కోరేగావ్ పార్క్‌లోని ఒక ఫైవ్ స్టార్ హోటల్‌కు రమ్మని కోరారు. సదరు వ్యక్తి తనతో పాటు మరో ఇద్దరు మహిళలను తీసుకుని రాగా, అంతా కలిసి కొద్దిసేపు మాట్లాడుకుని ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. ఆ తర్వాత అదే హోటల్‌లో ఆదివారం రాత్రి మద్యం సేవించే క్రమంలో, పక్క టేబుల్‌పై ఉన్న మరో ఇద్దరు వ్యక్తులతో ఆమెకు మాటలు కలిసి పరిచయం ఏర్పడింది. అనంతరం వారంతా కలిసి ఒక పబ్ కు వెళ్లాలని నిర్ణయించుకుని కారులో బయలుదేరారు. కారు ప్రయాణంలో ఉండగానే నిందితుల్లో ఒకడు ఆమెపై లైంగిక దాడికి తెగబడ్డాడు. అంతటితో ఆగకుండా, నిందితులు తమ క్రూరత్వాన్ని పరాకాష్ఠకు తీసుకెళుతూ కారులో ప్రయాణిస్తున్న సమయంలోనే తమ మరో ఇద్దరు స్నేహితులకు ఫోన్ కాల్ చేసి, బాధిత మహిళపై అత్యంత అసభ్యకరమైన కామెంట్లు చేశారు.

# సంజీవని పథకం అమలుకు ఉత్తర్వులు

**విజయవాడ మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజారోగ్య సేవలను సాంకేతికత ఆదారంగా మరింత సమర్థంగా నిర్వహించేలా సంజీవని ప్రాజెక్టు అమలుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రజలకు నిరంతర వైద్య సేవలతో పాటు ఆసుపత్రుల మధ్య సమన్వయం పెంచి రిఫరల్ వ్యవస్థను బలోపేతం చేయడనం, రోగుల ఆరోగ్య సమాచారాన్ని డిజిటల్ రూపంలో అనుసంధానం చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని పేర్కొంది. ఈ మేరకు నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాజెక్టు అమలుకు తొలి ఏడాదిలో కేంద్ర, రాష్ట్ర ప్రధాన లక్ష్యమని పేర్కొంది. ప్రాజెక్టు అమలుకు తొలి ఏడాదిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ.149 కోట్లు వెచ్చించనున్నాయి. రెండో ఏడాది నిర్వహణకు రూ.55.5 కోట్లు కేటాయించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్టు అమలుకు టెండర్లు పిలిచి ప్రత్యేక ఏజెన్సీకి ఎంపిక చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రాష్ట్రంలో ఆరోగ్య మౌలిక సదుపాయాలు విస్తరించిన సేవల విషయంలో సమన్వయం చికిత్స కొసాగింపు, అత్యవసర వైద్య స్పందన, రోగుల పర్యవేక్షణ లాంటి అంశాల్లో ఇంకా కొన్ని సమస్యలు ఉన్నాయని ప్రభుత్వం పేర్కొంది. మానసిక ఆరోగ్య సమస్యలు, తల్లీబిడ్డల ఆరోగ్యం , వృద్ధుల వైద్య సంరక్షణ, అంటువ్యాధులు పర్యవేక్షణ, అత్యవసర వైద్య సేవలు లాంటివి అమలుకు డిజిటల్ సమన్వయ వ్యవస్థ అవసరమని గుర్తించింది. సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య సిబ్బంది డిజిటల్ హెల్త్ వేదికలను అనుసంధానం చేస్తారు. అందరికీ ఆరోగ్య కార్డులు అందించి, రోగుల ఆరోగ్య సమస్యలను డిజిటల్ రూపంలో ట్రాక్ చేస్తారు.

# నారీ జన సమ్మోహనం



పట్టణ ప్రాంతాల్లో డిజిటల్ వినియోగంలో మహిళలదే ఆధిపత్యం ఈకామర్స్, వినోద కార్యక్రమాల్లో వారిదే ఎక్కువ సమయం వీటీఐఓఎన్, ఐఏఎంఏఐ సంయుక్త నివేదిక వెల్లడి భారత పట్టణ ప్రాంతాల్లో డిజిటల్ కార్యకలాపాల్లో పురుషుల కంటే మహిళలే ముందున్నారని ఓ తాజా నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా ఎంటర్టైన్మెంట్, మెసేజింగ్, ఈకామర్స్ వంటి విభాగాల్లో మహిళలు ఎక్కువ సమయం గడుపుతూ డిజిటల్ వినియోగంలో కీలక చోదకులుగా నిలుస్తున్నారని స్పష్టం చేసింది. కన్స్యూమర్ బిహేవియర్ అనలిటిక్స్ ప్లాట్ఫామ్ వీటీఐఓఎన్, ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఏఎంఏఐ) సంయుక్తంగా ఈ నివేదికను విడుదల చేశాయి. ఈకామర్స్, క్విక్ కామర్స్ విభాగాల్లో మహిళలదే పైచేయి అని నివేదిక పేర్కొంది. 2534 ఏళ్ల వయసున్న పట్టణ మహిళలు ఈ ప్లాట్ఫామ్లపై రోజుకు సగటున 35.2 నిమిషాలు గడుపుతుండగా, అదే వయసు పురుషులు కేవలం 24.8 నిమిషాలు మాత్రమే వెచ్చిస్తున్నారు. ఇది పురుషుల కంటే 42 శాతం అధికం. వినోద కార్యక్రమాల కోసం మహిళలు రోజుకు సగటున 82.4 నిమిషాలు కేటాయిస్తున్నారు. ఈ నివేదికలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యాప్ల వినియోగం కూడా వేగంగా పెరుగుతున్నట్లు తేలింది. ఏప్రిల్ 2025 మార్చి 2026 మధ్య కాలంలో ఏఐ యాప్ల వాడకం 100 శాతానికి పైగా వృద్ధి చెందింది. పట్టణ వినియోగదారులు రోజుకు సగటున 11.3 నిమిషాలు ఏఐ యాప్లపై గడుపుతున్నారు. మరోవైపు సోషల్ మీడియాలో 1824 ఏళ్ల యువత రోజుకు 120 నిమిషాలు గడుపుతుండగా, 35 ఏళ్ల పైబడిన వారు వినోదంపై ఎక్కువ దృష్టి పెడుతున్నారు. పేమెంట్ యాప్ల వినియోగం మాత్రం అన్ని ఆదాయ వర్గాల్లో దాదాపు సమానంగా ఉన్నట్లు నివేదిక తెలిపింది. దేశవ్యాప్తంగా లక్షకు పైగా స్మార్ట్ఫోన్ల డేటాను విశ్లేషించి ఈ వివరాలు వెల్లడించారు.

# మల్బరీతో ఆరోగ్యంగా.. !



మల్బరీ పండ్లు.. వీటినే బొంతపండ్లు అనికూడా అంటారు. ఇవి నలుపు, ఎరుపు, తెలుపు రంగుల్లో ఉంటాయి. ఈ పండ్లలో ఆరోగ్యానికి మేలుచేసే ఫైటోన్యూట్రియంట్లు ఎక్కువ. అలానే, విటమిన్లు బి 1,2,3, సి,ఇ,కెతో పాటు పొటాషియం, జింక్ దీన్నుంచి తగినంతగా శరీరానికి అందుతాయి. వీటిలో జీర్ణక్రియను మెరుగుపరిచే పీచు సమృద్ధిగా ఉంటుంది. ఇది పేగు కదలికను సులభతరం చేస్తుంది. జీర్ణసంబంధిత వ్యాధులతో బాధపడే వారు రోజువారీ ఆహారంలో నీటిని చేర్చుకుంటే ఉపశమనం ఉంటుంది. మల్బరీల్లో ఉండే పీచు బరువుని తగ్గిస్తుంది. క్యాన్సర్ కణాలను నిర్మూలించే ఆంతో సైనిన్లు ఇందు లో పుష్కలంగా ఉండి పెద్దపేగు, చర్మ, ప్రొస్టేట్ క్యాన్సర్లను దరిచేరనివ్వవు. ఈ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రక్తనాళాల పనితీరుని మెరుగుపరు స్తాయి. దీంతో గుండె, ఇతర శరీర భాగాలకి రక్తప్రసరణ సరిగ్గా జరిగి రక్తపోటు అదుపులో ఉంటుంది. ఐరన్ శాతం ఎక్కువగా ఉండటం వల్ల ఎర్రరక్తకణాలూ వృద్ధి చెందుతాయి. రోగనిరోధకశక్తిని మెరుగు పరచడంలోనూ మల్బరీలు ప్రధానపాత్ర పోషిస్తాయి. వీటిలో ఉండే విటమిన్-సి ఇన్ఫెక్షన్లను దరిచేరనీయదు. విటమిన్-కె, కాల్షియం, ఐరన్ పోషకాలు ఎముకలుగుల్ల బారకుండా కాపాడతాయి.

# నవ్వించేద్దామా.. !



**హాస్యాన్ని ఆస్వాదించని వారుండరంటే అతిశయోక్తి కాదు!** అందుకే 'నవ్వని రోజు వృథా అయినట్టే'అని చార్లీ చాప్లిన్ అంటే, జీవితమంటే అలా బతికేయడమే కాదు, అందులో కొంత హాస్యం కూడా ఉండాలంటారు. అమ్మాయంటే ఇలానే నవ్వాలి. అనే రోజుల నుంచి హాస్యాన్నే తమ కెరియర్గా మలుచుకుంటోన్న అమ్మాయిలూ పెరిగారు. ఫటాఫట్ పంచులు వేసినా, స్టాండప్ కామెడీ చేసినా.. వారి అంతిమ లక్ష్యం ఎదుటివారి ముఖంలో నవ్వులు పూయించడమే. సాధారణంగా మనమెవరైనా తప్పులు చేశామను కోండి అందులో ఫన్కి పెద్దగా ఆస్కారం ఉండదు. కానీ యూట్యూబర్లు, నటీనటులు, న్యూస్ రీడర్లు..లాంటి వాళ్ల వీడియో రికార్డింగ్ చేసేటప్పుడు దొర్లే తప్పులు అవేనండీ బ్లూపర్స్.. అందరినీ కడుపుబ్బా నవ్విస్తాయి. సైకాజికల్గా చెప్పాలంటే.. ఇలా సరదా తప్పులకు నవ్వే పద్ధతిని బినైన్వయొలేషన్ థియరీ అంటారు. నిజానికి వాళ్ల చేసే ఆ కార్యక్రమాన్ని ఎంతమంది చూస్తారో తెలియదు కానీ, ఆ బ్లూపర్ వీడియోలు మాత్రం తెగ వైరల్ అవుతుంటాయి. .

# అనుకోకుండానే.. అన్నీ !



ఆన్లైన్లో తగ్గింపు అని కనిపించినా, సరదాగా బయటికి వెళ్లినా ఒకటో రెండో డ్రెస్సులు వెంటబెట్టుకొచ్చేయడం అలవాటు. అప్పటికే బోలెడు క్రీములు ఇంట్లో ఉన్నా.. ఎవరో సిఫారసు చేశారనో, తక్కువకే వస్తున్నాయనో మరిన్ని తెచ్చేయడం కద్దు. అలా చేస్తే అమ్మలుమంటారో తెలుసా! ఉన్నాయి కదా! మళ్లీ ఇవన్నీ ఎందుకు? దండగ ఖర్చు కాకపోతే' అనే కదూ! నిజంగానే ఎందుకిలా కొనేస్తాం? కొన్ని వస్తువులు, దుస్తులు ఎంత నచ్చినా ఆర్థిక పరిస్థితి అనుకూలించక కొనలేరు కొందరు. కొందరికి ఆర్థిక పరిస్థితులు బాగున్నా అలమరాలు నింపేస్తారుగా అంటే.. దానికీ కారణముంది అంటున్నాయి కొన్ని పరిశోధనలు. ఆత్మ విశ్వాసంగా కనిపించడానికి అమ్మాయిలు ఎంచుకునే మార్గాల్లో దుస్తులూ ఒకటి. వాళ్ల వ్యక్తిత్వం, శైలిని వాటి ద్వారా వ్యక్తపరుస్తారట. అందుకే ఎన్ని ఉన్నా తాజా ధోరణులను తెలుసుకుని మరీ వేసుకున్నా వేసుకోకపోయినా దుస్తులు, చెప్పులు మళ్లీ మళ్లీ కొంటూనే ఉంటారట. ఇంకొందరైతే అలా కొనడం అదో ఫ్యాషన్ . అందుకే ఎవరేమన్నా వారి తీరు 'మార్చుకోలేరు. కొన్నీ సార్లయితే మనసులో ఏదో ఒక లోటు తెలుస్తూనే ఉంటుంది. వేడుక ఏదైనా 'పర్ఫెక్ట్'గా ఉండాలనుకునే అమ్మాయిలే ఎక్కువ. అలాంటివాళ్లు వీటినెలా తట్టుకుంటారు చెప్పండి. అందుకని ముందుగానే సిద్ధంగా ఉండాలన్న తాపత్రయంలో తెలియకుండానే ఇలా ఖర్చు చేస్తుంటారు. **ఈ తీరు ఇబ్బంది కదా!** అంటే.. అవుననే అంటున్నాయి అధ్యయనాలు. ఖర్చు పెట్టే స్థోమత ఉందన్న ధైర్యం, అందుబాటులో ఉన్న క్రెడిట్ కార్డు అనవసర ఖర్చేమో అన్న ఆలోచనే రానీయడం లేదట. కాబట్టి, నెలకి దుస్తులు, సౌందర్య సాధనాలు ఉత్పత్తులకు ఇంత అని బడ్జెట్ పెట్టుకోవాలి. దాన్ని తు.చ. తప్పకుండా పాటించడమే దీనికి సరైన పరిష్కారం.

# బుజ్జాయిల సాయంతోనే..!



నిజానికి ఇంట్లో ఎంత చిన్న వేడుక చేసినా పెద్దలకు నచ్చే రుచులనే ఎక్కువగా వండుతాం. కానీ, ఈ వేసవిలో పిల్లలకోసం మాత్రమే పాట్లక్ పార్టీ ఏర్పాటు చేయండి. దీన్ని మీ పిల్లలూ, వారి స్నేహితుల తల్లులూ కలిసి నిర్వహించండి. తలా ఒక రకాన్ని విందుకోసం సిద్ధం చేయండి. అయితే, ఒక్క షరతు.. వీటిని తయారు చేసేటప్పుడు మాత్రం బుజ్జాయిలు కచ్చితంగా సాయమందించాలనే నియమం పెట్టండి. అప్పుడు పనిలో ఉండే కష్టం, ఇష్టమైనదాని కోసం శ్రమించే తత్వం వంటివన్నీ అలవడతాయి. ఈ వేడుకను అద్భుతంగా వాళ్లు ఆస్వాదిస్తారు.

# ధన వ్యామోహమెందుకు ?

మానవుని ఆడించేది డబ్బే. డబ్బుకి విశేష గుణం ఉంది. డబ్బు గురించి బౌద్ధులు చెప్పింది అక్షరాలా సత్యం. వారి బోధనలలో ముఖ్య మైనది. ఇతరుల సంపదను దోచుకోకుండా ఉండటమే అపరిగ్రహం. ఇది బౌద్ధుల ముఖ్య లక్షణం. బుద్ధుడు కూడా అపరిగ్రహం కూడదు అన్నాడు. నిజానికి ఎవరు కూడా ఎట్టి పరిస్థితు లలో ఇతరుల సంపద పై కన్ను వేయకూడదు. ఆధ్యాత్మిక చింతనలో డబ్బు ఒక మోసపూరితం. కొందరు ఇతరుల సంపద పై ఎక్కువగా ఆధార పడుతుంటారు. డబ్బు అనేది వ్యక్తుల ప్రవర్తనమార్చు స్తుంది. ఈ కోవలో దొంగ తనాలు, హత్యలు కూడ చేస్తూ ఉంటారు. ఇది బౌద్ధ ధర్మానికి వ్య తిరేకం. బుద్ధుడు ప్రవచించి నట్లుగా ఎట్టి పరిస్థితులలో వ్య క్తి ధనం పై వ్యా మోహం ఉండరాదు. నైతిక వర్తనులుగా, నీతిగా ఉండాలి. ఈ రోజులలో చాలా మంది డబ్బుకే విలువ ఇస్తుంటారు. వ్యక్తికి ప్రాధాన్యత ఇవ్వరు ముందు వ్యక్తి యొక్క విలువ, గౌరవం తరువాత నే డబ్బు. డబ్బు అవసరమే. కాకపోతే డబ్బే జీవితం కాకూడదు. అందుకే బుద్ధుడు అపరిగ్రహం ఉండ కూడదు అన్న మాట అక్షరాలా సత్యం. డబ్బే లోకం అని చాలా మంది అనుకుంటూ ఉంటారు. డబ్బు మనిషిని దిగజారుస్తుంది. ఒక్కోసారి అందలం ఎక్కిస్తుంది. నడమంత్రపు సిరి ఎక్కువ కాలం మనజాలదు. డబ్బుకు మనం ఎప్పుడు ప్రాముఖ్యత ఇవ్వ కూడదు. అందుకే వ్యక్తి డబ్బు విషయంలో ఆచి, తూచి నడచుకోవాలి.

**- కనుమ ఎల్లారెడ్డి.**

**చెలి** సామాజిక పరిణామంలో మహిళల పాత్ర ఎంతో అనిర్వచనీయమైనది. దానికి అందం చేకూర్చాలంటే స్త్రీ పాత్ర ఉండాల్సిందే! అందుకే మీ రచనలు పరిచయం చేయాలని 'వార్త' సంకల్పించింది. మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. మీరు అనుసరించే జాగ్రత్తలు పాటించే చిట్కాలు, ఇతర ఏ అంశాలైనా మీ పేరుతో ప్రచురిస్తాం. ఈ మెయిల్:Cheli@vaartha.com

**చిట్కా:** ✦ మధుమేహ వ్యాధులున్నవారు కాకరకాయ కూరను ఎక్కువగా వాడితే మధుమేహ వ్యాధి కొంత తగ్గుతుంది. ✦ మునగాకు నూరి కురుపులకు కడితే కురుపులు తగ్గుతాయి.

# తెర

# 'ఐక్య' నా బిడ్డ లాంటిది..



టాలీవుడ్లో ప్రముఖ స్టార్ హీరో రా కింగ్ మనోజ్ మంచు ఎన్నో మంచి చిత్రాలతో ఆడియెన్స్ని అలరించారు. అలాంటి హీరో తన పుట్టిన రోజు (మే 20) సందర్భంగా మంగళవారం నాడు మీడియాతో ప్రత్యేకంగా ముచ్చటించారు.

**'ఐక్య' పెట్టాలనే ఆలోచన ఎలా వచ్చింది?..**
నేను సూపర్ మ్యాన్ని కాదు. అందరికీ అన్ని వేళలా అందుబాటులో ఉండకపోవచ్చు. అందుకే ఈ ట్రస్ట్ను పెట్టాలని అనుకున్నాం. వాయిస్ లెస్కి వాయిస్గా ఈ ట్రస్ట్ ఉంటుంది. అలా ఐక్య ధైర్య సేనా సమిత్తి అని పెట్టడానికి చాలా కారణాలున్నాయి.

**'ఐక్య ట్రస్ట్ ఎలా వర్క్ చేస్తుంది? నియమాలు ఏంటి?..**
ఐక్యకి ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదు. ఎప్పటి నుంచో ఇలాంటి ఓ ట్రస్ట్ను ఏర్పాటు చేయాలని అనుకున్నాం. దానికి సంబంధించిన నియమాల్ని ఇంకా రూపొందించలేదు.

**'ఐక్య'కి ఇతర వివరాల్ని ఎప్పుడు ప్రకటిస్తారు?..**
జూన్ 7న నా కొత్త సినిమా రక్షక్ ప్రారంభం కాబోతోంది. ప్రస్తుతం

**.ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఎప్పుడు వస్తారు?..**
మేం పుట్టినప్పటి నుంచీ రాజకీయాల్లోనే ఉన్నాం. కొత్తగా రాజకీయాల్లోకి రావడం అని ఏముంది. వచ్చే ఎన్నికల్లో నా భార్య పోటీ చేస్తారు.

**..మే 20 అంటే ఎన్టీఆర్, సిరివెన్నెల సీతారామశాస్త్రీ పుట్టిన రోజు కూడా కదా?**
నా పుట్టిన రోజుని తారక్ అన్నతో, స్వర్గీయ సిరివెన్నెల సీతారామశాస్త్రితో కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉంటుంది.

**డేవిడ్ రెడ్డి ఎలా ఉండబోతోంది?..** నేను దాని గురించి ప్రత్యేకంగా చెప్పేకంటే రేపు (మే 20) సాయంత్రం గ్లింప్స్ రాబోతోంది. మాటల కంటే మన పని చెబితేనే బెటర్. షూటింగ్ దాదాపు 40 శాతం పూర్తయింది.

**వాట్ ది ఫిష్ పరిస్థితి ఏంటి?..** వాట్ ది ఫిష్ ఇప్పుడు రావడం లేదు. అనుకోని కారణాల వల్ల అది కుదరలేదు. నేను, సత్య, వెన్నెల కిషోర్ అందరం కలిసి చేయాల్సిన సినిమా. చివరి నిమిషంలో చాలా మందికి వీసా ప్రాబ్లం వచ్చింది.

**మోహన రాగ మ్యూజిక్ పనులు ఎక్కడి వరకు వచ్చాయి?..**
మోహన రాగ మ్యూజిక్ చాలా బాగా వస్తుంది. అద్భుతమైన ఆర్టిస్టులు, టెక్నీషియన్లు, సింగర్లు పని చేస్తున్నారు. ఇప్పటి వరకు నాలుగు పాటలు రికార్డ్ అయ్యాయి.

# 'ఆర్ కే దీక్ష' మూవీ జూన్ 12న రిలీజ్

క్రియేషన్స్ బ్యానర్లపై డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శకత్వం వహించి నిర్మించిన చిత్రం 'ఆర్ కే దీక్ష' డి.ఎస్. రెడ్డి సమర్పణలో రూపొందిన



ఈ చిత్రంలో ఢీ, జోడి ఫేమ్ అక్స ఖాన్, అలేఖ్య రెడ్డి హీరోయిన్లుగా నటించగా, కిరణ్ హీరోగా కనిపించనున్నారు. తులసి, అనూష, కీర్తన, ప్రవల్లిక, రోహిత్ శర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా జూన్ 12న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్కు సిద్ధమవుతోంది. దర్శకనిర్మాత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం సాయంత్రం హైదరాబాద్లో ఈ చిత్ర సాంగ్స్ , టీజర్ లాంచ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ఎ. గురురాజ్ మాట్లాడుతూ – డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు.'ఆర్కే దీక్ష' చిత్రాన్ని ఎంతో క్వాలిటీగా రూపొందించారని సాంగ్స్, టీజర్ చూస్తేనే తెలుస్తోంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అన్నారు. పొలిటికల్ లీడర్ గ్యాదరి బాలమల్లు మాట్లాడుతూ – సిద్ధిపేట ప్రాంతం నుంచి వచ్చిన డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ రాజకీయంగా, సినీ రంగంలో ఎంతోకాలంగా కొనసాగుతున్నారు.

# 'పెద్ది' సినిమా ట్రైలర్ లాంచ్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, బుచ్చి బాబు సానా, వెంకట సతీష్ కిలారు, వృద్ధి సినిమాస్, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ 'పెద్ది' లార్జర్ దెన్ లైఫ్ ఎపిక్ ట్రైలర్ లాంచ్ మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్ఇండియా చిత్రం 'పెద్ది' విడుదలకు ముందే సంచలనం సృష్టిస్తోంది. ప్రతి ప్రోమో దేశవ్యాప్తంగా బజ్ క్రియేట్ చేసింది. దర్శకుడు బుచ్చి బాబు సానా ఈ రూరల్ యాక్షన్ స్పోర్ట్స్ కథను అద్భుతంగా తీర్చిదిద్దారు. రెగ్యులర్ హీరో ఇంట్రడక్షన్ ట్రైలర్లా కాకుండా.. 'పెద్ది' ట్రైలర్ ఒక పల్లె ప్రపంచాన్ని, అక్కడి జీవితాల్ని, పోరాటాన్ని, ఆటపై ఇష్టాన్ని ఎంతో సహజంగా పరిచయం చేసింది. జాన్వీ కపూర్ తన పాత్రలో ఎంతో నేచురల్గా కనిపించింది. గ్రామీణ యువతిగా ఆమె చూపించిన ఎక్స్ప్రెషన్స్ ట్రైలర్కు మంచి వార్మ్నెస్ తీసుకొచ్చాయి. అలాగే శివరాజ్కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ పాత్రలు కూడా కథలో బలమైన ప్రాధాన్యం కలిగి ఉన్నాయని ట్రైలర్ సూచించింది. ఏఆర్ రెహమాన్ బ్యాక్గ్రౌండ్ స్కోర్ ట్రైలర్కు ఆత్మలా నిలిచింది. ఎమోషన్స్ను, యాక్షన్ను ఒకేసారి ఎలివేట్ చేస్తూ ఆయన ఇచ్చిన స్కోర్ ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్లో నిర్మించిన ఈ సినిమా ప్రతి ఫ్రేమ్ కూడా బిగ్ స్క్రీన్ అనుభూతిని కలిగిస్తోంది. ప్రేక్షకులను పూర్తిగా లీనం చేసే ఎక్స్ పీరియన్స్ అందిస్తుంది. ముంబైలో గ్రాండ్ గా జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మాట్లాడుతూ... గుడ్ ఈవెనింగ్ ముంబై. మీడియా మిత్రులందరికీ ధన్యవాదాలు. ఈ సినిమా కోసం గత రెండేళ్లుగా ప్రాణం పెట్టి పని చేశాం. బుచ్చిబాబు అయితే గత ఐదేళ్లుగా ఈ సినిమాతోనే ట్రావెల్ అవుతున్నారు. కానీ మా ప్రాజెక్ట్కు సెంటర్ పిల్లర్ రెహమాన్ మ్యూజిక్ అంటే నాకు ఎంతో అభిమానం. ఆయన 'పెద్ది'లో భాగం కావడం మాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. హీరోయిన్ జాన్వికపూర్ మాట్లాడుతూ.. ఈ సినిమా కోసం మేము గత రెండేళ్లుగా పని చేస్తున్నాం. మీ అందరితో కలిసి ట్రైలర్ చూడడం చాలా ఆనందంగా ఉంది.

# 'హై లెస్సో' పోస్టర్ రిలీజ్



'సుడిగాలి సుధీర్' గా పాపులరైన సుధీర్ ఆనంద్, టెలివిజన్, సినిమా రంగాలలో అలరిస్తున్నారు. ఆయన తాజా ప్రాజెక్ట్ 'హై లెస్సో'తో ప్రసన్న కుమార్ కోట దర్శకుడిగా పరిచయం కాగా, వజ్ర వారాహి సినిమాస్ బ్యానర్పై శివ చెర్రీ, రవికిరణ్ నిర్మిస్తున్నారు. సుధీర్ ఆనంద్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ విడుదల చేసిన కొత్త పోస్టర్ అందరినీ ఆకట్టుకుం టోంది. పోస్టర్లో సుధీర్ ఎంతో రఫ్, ఇంటెన్స్ అవతార్లో కనిపించారు. గ్రామీణ నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ కథలో స్ట్రాంగ్ ఎమోషన్స్ డ్రామా ఉండబో తున్నాయి. ఇప్పటికే హైదరాబాద్లో 25 రోజుల పాటు కీలక షెడ్యూల్ పూర్తి చేశారు. ఇందులో ప్రధాన టాకీ పార్ట్తో పాటు జాతర సీక్వెన్స్లు, ఒక పాటను చిత్రీకరిం చారు. త్వరలోనే ఏలూరులో 40 రోజుల భారీ షెడ్యూల్ ప్రారంభం ఈ చిత్రంలో నటాషా సింగ్, నక్షా సరన్ కథానాయిక లుగా నటిస్తున్నారు. కన్నడ నటి అక్షర గౌడ కీలక పాత్రలో కనిపించ నుండగా, మొట్ట రాజేంద్రన్, గెటప్ శ్రీను, బేవర దుహిత సారన్య ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణ పనులు శర వేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది చివర్లో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ సౌత్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

# కమల్ హాసన్ స్ఫూర్తిదాయకం



యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ స్ఫూర్తిదాయక నిర్ణయం సోషల్ మీడియాలో ప్రశంసల వెల్లువ సాధారణ ఎకానమీ ఫ్లైట్లో ప్రయాణిస్తూ హైదరాబాద్ లో కల్కి షూటింగ్ సెట్స్కు వచ్చిన కమల హాసన్ సినిమా పరిశ్రమ క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న ఈ సమయంలో యూనివర్సల్ స్టార్ కమల్హాసన్ తీసుకున్న ఓ నిర్ణయం ఇప్పుడు అందరి ప్రశంసలు అందుకుం టోంది. ప్రైవేట్ చార్టర్స్, లగ్జరీ ట్రావెల్స్ను పక్కన పెట్టి సాధారణ ఎకానమీ ఫ్లైట్లో ప్రయాణిస్తూ హైదరాబాద్లో కల్కి షూటింగ్ సెట్స్కు వచ్చారు. ఎంత స్టార్ డమ్ ఉన్నప్పటికీ సినిమాపై ప్రేమ, బాధ్యత ముఖ్యమని కమల్ హాసన్ మరోసారి నిరూపించారు. ప్రస్తుతం సినీ పరిశ్రమ కొత్త ఆలోచనల వైపు అడుగులు వేస్తున్న సమయంలో ఆయన తీసుకున్న ఈ నిర్ణయం ఇండస్ట్రీకి ఒక స్ఫూర్తిదాయకమైన సందేశంగా మారింది. పరిశ్రమకోసం మార్పు మన నుంచే మొదలుకావాలనే కమల్ హాసన్ తీసుకున్న చొరవకు సోషల్ మీడియాలో ప్రశంసలు అందుతున్నాయి. సినిమా రంగంలో జరగబోయే గొప్ప మార్పులకు ఇది తొలి అడుగు కానుంది.

# 'పురుష' చిత్రం 22న విడుదల



కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల సరస్వతి సమర్పణలో బత్తుల కోటేశ్వరరావు నిర్మించిన చిత్రం పురుష ఈ మూవీతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయం కాబోతోన్నారు. ఈ సినిమాకి వీరు వులవల దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్, సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్, రాయంచ కొక్కుర, విషిక, హాసిని సుధీర్ ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సినిమాను మే 22న రిలీజ్ చేయ బోతోన్నారు. ఈ క్రమంలో మూవీ ప్రమోషన్స్లో భాగంగా ట్రైలర్ను రిలీజ్ చేశారు. బ్రహ్మచారి భర్తగా మారాలని నిర్ణయించుకున్న తరువాత జీవితం యుద్ధభూమిలా మారుతుంద్ధి అని వెన్నెల కిషోర్ డైలాగ్తో ట్రైలర్ స్టార్ట్ అవుతుంది. ఆ తరువాత వచ్చే సీన్లు, భార్యల చేతిలో భర్తలు నలిగిన తీరు అందరినీ ఆకట్టుకునేలా ఉంది ఈ ట్రైలర్లో సతీష్ ముత్యాల కెమెరా వర్క్, శ్రవణ్ ఆర్ఆర్ అన్నీ కూడా హైలెట్ అవుతున్నాయి. ఫ్యామిలీ ఎమోషన్స్తో తీసిన ఈ చిత్రం ఆద్యంతం వినోదభరితంగా ఉందని ట్రైలర్ చూస్తేనే తెలుస్తోంది. ఈ మూవీకి శ్రవణ్ భరద్వాజ్ సంగీతాన్ని అందిస్తున్నారు. సతీష్ ముత్యాల కెమెరామెన్గా, కోటి ఎడిటర్గా పని చేశారు.

# అఫ్ఘాన్‌తో టెస్ట్, వన్డేలకు టీమిండియా ఎంపిక

*టెస్ట్, వన్డేలకు కెప్టెన్‌గా గిల్
*బుమ్రా, జడేజాలకు విశ్రాంతి
*రోహిత్, హార్దిక్‌లకు కండిషన్
*ప్రిన్స్ , గుర్నూర్‌లకు పిలుపు
*రెండు ఫార్మాట్లలోనూ నితీష్










**ముంబై, మే 19:** ఆఫ్ఘనిస్థాన్‌తో స్వదేశంలో జరిగే టెస్ట్, వన్డే సిరీస్‌లకు టీమిండియాను భారత క్రికెట్ నియంత్రణ మండలి ప్రకటించింది. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా నేతృత్వంలో జరగిన సెలెక్షన్ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.రెండు ఫార్మాట్లకు భారత జట్టు కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ వ్యవహరిస్తాడు. జూన్ 6నుంచి అఫ్గానిస్థాన్‌తో ఒక టెస్టు మ్యాచ్, మూడు వన్డేలు ఆడనుంది.

**టెస్ట్ వైస్ట్ కెప్టెన్‌గా రాహుల్**

టెస్ట్ జట్టుకు రిషబ్ పంత్ స్థానంలో కేఎల్ రాహుల్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. రిషబ్ పంత్ వికెట్ కీపర్ బ్యాటర్‌గా జట్టులో కొనసాగుతాడు. అలాగే పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాలకు విశ్రాంతి కల్పించిన సెలెక్టర్లు.. వారి స్థానాల్లో గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబ్‌లను ఎంపికచేశారు. వీరిద్దరితో పాటు ప్రిన్స్ యాదవ్, మానవ్ సుతార్ తొలిసారిగా మెన్ బ్లూ జట్టులో చోటు దక్కించుకున్నారు. అక్షర్ పటేల్, ఆకాశ్ దీప్‌లకు చోటు దక్కలేదు.

**వన్డే వైస్ కెప్టెన్‌గా శ్రేయాస్**

ఇక వన్డే జట్టుకు శ్రేయాస్ అయ్యర్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్య ఎంపికయినా, వారు ఫిట్‌నెస్ నిరూపించు కుంటేనే జట్టులో కొనసాగుతారు. వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్,పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణలతో పాటు ప్రిన్స్ యాదవ్, గుర్నూర్ బ్రార్‌లకు చోటు దక్కింది. ఐపీఎల్‌లో వికెట్ల పంట పండించిన మహ్మద్ షమి గురించి చర్చించలేదని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పేర్కొన్నాడు.

**రెండుఫార్మాట్లకు నితీష్**

హైదరాబాద్ సూపర్ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్‌రెడ్డి రెండు ఫార్మాట్లకు ఎంపికయ్యాడు. ఐపీఎల్‌లో ఆల్‌రౌండర్‌గా నిరూపించుకున్న నితీష్.. టెస్ట్, వన్డే జట్టులోనూ చోటు సంపాదించాడు. ఇక హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ మహ్మద్ సిరాజ్... టెస్ట్ జట్టులో స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. వన్డే జట్టులోకి మాత్రం సిరాజ్‌ను సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకోలేదు.

**టెస్ట్ జట్టు:** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), కేఎల్ రాహుల్ (వైస్‌కెప్టెన్), యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్, రిషభ్ పంత్, దేవ్‌దత్ పడిక్కల్, వాషింగ్టన్ సుందర్, మహ్మద్ సిరాజ్, కుల్‌దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, మానవ్ సుతార్, ప్రసిద్ధ్ కృష్ణ, గూర్నూర్ బ్రార్, ధ్రువ్ జురెల్, హర్ష్ దూబె.

**వన్డే జట్టు :** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), శ్రేయస్ అయ్యర్(వైస్ కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, , కేఎల్ రాహుల్, అర్షదీప్ సింగ్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్య, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్, గూర్నూర్ బ్రార్, హర్ష్ దూబె.

**మ్యాచ్‌ల షెడ్యూల్**

**ఏకైక టెస్టు:** జూన్ 6-10 (ముల్లాన్‌పూర్)
**తొలి వన్డే:** జూన్ 14 (ధర్మశాల)
**రెండో వన్డే:** జూన్ 17 (లక్నో)
**మూడో వన్డే:** జూన్ 20 (చెన్నై)

# రెండో టెస్ట్‌లోనూ ఓటమి దిశగా పాకిస్థాన్

**షెల్హెట్, మే 19:** బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లోనూ పాకిస్థాన్ ఓటమి దిశలో కొనసాగుతోంది. 437 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్థాన్.. నాలుగో ఆట ముగిసేసరికి ఏడు వికెట్ల నష్టానికి 316 పరుగులు చేసింది. ఇంకా ఒక రోజు ఆటమిగిలి ఉంది. ఇంకా 121 పరుగులు చేయాల్సి ఉండగా చేతిలో మూడు వికెట్లు మాత్రమే ఉన్నాయి. స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్ రూపంలో మహ్మద్ రిజ్వాన్(135 బంతుల్లో 75 నాటౌట్) క్రీజ్‌లో ఉన్నాడు.

నాలుగో రోజు ఆట ఆరంభంలోనే పాకిస్థాన్ వేగంగా వికెట్లు కోల్పోయింది. నవిద్ రాణా, తైజుల్ ఇస్లాం... పాక్ టాప్ ఆర్డర్, మిడిల్ ఆర్డర్ పనిపట్టారు. దీంతో 162 పరుగులకే అయిదు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో సల్మాన్ అఘా(102 బంతుల్లో 71), మహ్మద్ రిజ్వాన్ ఆదుకున్నారు. ఆరో వికెట్‌కు 134 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. సల్మాన్ అఘాను తైజుల్ క్లీన్ బౌల్డ్ చేశాడు. మహ్మద్ రిజ్వాన్ క్రీజ్‌లో నిలదొక్కుకుని ఆడుతున్నాడు. బంగ్లా బౌలర్లలో తైజుల్ ఇస్లాం నాలుగు వికెట్లు, నవీద్ రాణా రెండు వికెట్లు పడగొట్టారు. ఢాకాలో జరిగిన తొలి టెస్ట్‌లో బంగ్లా ఘనవిజయం సాధించింది.

# రాయల్స్ వైభవం



### బ్యాటింగ్ వండర్ సూర్య వంశీ
### 38 బంతుల్లో 93 రన్స్
### 10 సిక్స్‌లు, 7 ఫోర్లు

జైపూర్‌లో లక్నోతో జరిగిన మ్యాచ్‌లో 15 ఏళ్ల బ్యాటింగ్ అద్భుతం వైభవ్ సూర్య వంశీ మరోసారి తనదైన శైలిలో రెచ్చిపోయాడు. అయితే మునుపటి వైభవ్‌లా కాకుండా అనుభవజ్ఞుడైన ఆటగాడిగా, తను క్రీజ్‌లో నిలవడడం జట్టుకు ఏ స్థాయిలో అవసరమో తెలిసిన వాడిగా కనిపించాడు. తన సహజ శైలిలో తొలి బంతికి సిక్స్‌కు పోకుండా ఎదుర్కొన్న మూడో బంతికి అదీ సింగిల్స్‌తో ఖాతా తెరిచాడు. మొదటి పది బంతుల్లో వైభవ్ చేసింది కేవలం అయిదు పరుగులే. జైస్వాల్ ఆడుతున్నంత సేపు మరో ఎండ్‌లో ప్రేక్షకుడిగానే ఉన్నాడు.

ఎదుర్కొన్న 11వ బంతికి సిక్స్‌తో మొదలుపెట్టిన వైభవ్... ఆ తర్వాత కూడా ఆచితూచే ఆడాడు. ఆరో ఓవర్ నుంచి శివాలెత్తడం మొదలు పెట్టాడు. ప్రిన్స్ వేసిన మొదటి బంతికి సిక్స్‌తో స్టార్ట్ చేసి మరో రెండు బౌండరీలు బాది 15 రన్స్ సాధించాడు. ఇక 9వ ఓవర్లో నైతే ఆకాశ్‌కు చుక్కలు చూపాడు. మొదటి బంతికి సిక్స్, ఆ తర్వాత 4,4,6,4తో మొత్తం 22 రన్స్ చేశాడు. 23 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. అదే జోరులో రాఠీ బంతికి సిక్స్, ప్రిన్స్ బంతులకు బ్యాక్ టు బ్యాక్ సిక్స్‌లు, మయాంక్ ఓవర్లో వరుస రెండు సిక్స్‌లు, రాఠీ మరో ఓవర్లో సిక్స్, ఫోర్‌తో సెంచరీకి సమీపించాడు. 93 పరుగుల వద్ద అవుటై శతకం మిస్సయ్యాడు. పది బంతులకు 5 రన్స్ చేసిన వైభవ్.. ఆతర్వాత 28 బంతుల్లో 88 రన్స్ సాధించాడు. జురెల్‌తో కలిసి శతకం భాగాస్వామ్యం అందించాడు. తనలోని మరో వైభవ్‌ను చూపెట్టి క్రికెట్ అభిమానులను ఉర్రూత లూగించాడు.

# తొలి రౌండ్‌లో భారత్ జోడీ సంచలనం




**కౌలాలంపూర్:** మలేషియా మాస్టర్స్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత జోడీ సంచలనం సృష్టించింది.హరిహరన్-అర్జున్ జోడీ పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో ఫ్రాన్స్ జోడీ క్రిస్టో పొపొవ్-థామస్ పొపొవ్‌పై గెలుపొందారు. తొలి సెట్‌ను 21-19తో నెగ్గిన భారత్ జోడీ.. రెండో సెట్‌ను మరింత అలవోకగా 21-15తో ముగించింది. కేవలం 36 నిమిషాల్లోనే ఫ్రాన్స్ జోడీని ఓడించింది. గత థామస్ కప్ సెమీఫైనల్లో ఫ్రాన్స్ చేతిలో ఎదురైన పరాజయానికి భారత్ షట్లర్లు స్వీట్ రివేంజ్ తీర్చుకున్నారు.

కాగా మోచేతి గాయంతో థామస్ కప్‌కు దూరమైన లక్ష్య సేన్.. తొలి రౌండ్‌లో మోహ్ జాకీ ఉబైదిల్లా(ఇండోనేసియా)తో తలపడనున్నాడు. మరో మ్యాచ్‌లో తరుణ్ మానేపల్లి.. జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్), కిరణ్ జార్జ్.. అలెక్స్ లాని యర్ (ఫ్రాన్స్), హెచ్.ఎస్. ప్రణయ్.. క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్)తో పోటీపడతారు.

మహిళల సింగిల్స్‌లో తన్వీ శర్మ.. పిచ్చామోన్ ఓపట్నిపుత్ (థాయ్‌లాండ్)తో, ఉన్నతి హుడా.. హాన్ కియాన్స్ క్సీ (చైనా)తో, మాళవిక బన్సోద్.. వైవోస్ లీ (జర్మనీ)తో, అన్మోల్ ఖర్బ్.. లైన్ హోజ్ మార్క్ కెర్స్‌ఫెల్డ్ (డెన్మార్క్)తో తలపడనున్నారు. ఈ నెల ఆరంభంలో డెన్మార్క్‌లోని హోర్సెన్స్‌లో జరిగిన థామస్ కప్ సెమీస్‌లో ఇండియా 0-3తో ఫ్రాన్స్ చేతిలో ఓడింది. అయితే ఆ మూడు సింగిల్స్‌లో ఆడిన ప్లేయర్లు ఇప్పుడు ఈ టోర్నీలోనూ ఇండియన్స్‌తో తలపడుతున్నారు. దాంతో వీళ్లపై గెలిచి థామస్ కప్

## భారీ స్కోర్ల మ్యాచ్‌లో లక్నోపై విజయం

# గెలిచి నిలిచిన రాజస్థాన్ రాయల్స్

**జైపూర్:** ఐపీఎల్ 2026లో భాగంగా సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో జరిగిన కీలక మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ గెలిచి నిలిచింది. ప్లే ఆఫ్ అవకాశాలను సజీవంగా నిలుపుకుంది. లక్నో ఉంచిన 221 పరుగుల భారీ లక్ష్యాన్ని మరో 5 బంతులుండగానే మూడు వికెట్లు కోల్పోయి అందుకుంది. మొదట యశస్వి జైస్వాల్(23 బంతుల్లో 43), ఆ తర్వాత వైభవ్(38 బంతుల్లో 93), చివరకు ధృవ్ జురెల్(38 బంతుల్లో 53 నాటౌట్) మెరుపులు మెరిపించారు. చివరి మ్యాచ్‌లోనూ రాజస్థాన్ రాయల్స్ గెలుపొందితే నాలుగో జట్టుకు ప్లే ఆఫ్‌కు చేరుకుంటుంది.

అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్‌కు ఓపెనర్లు ఫ్లయింగ్ స్టార్ట్ ఇచ్చారు. జోష్ ఇంగ్లీస్(29 బంతుల్లో 60; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), మిచెల్ మార్ష్(57 బంతుల్లో 96; 11 ఫోర్లు, 5 సిక్స్‌లు).. రాజస్థాన్ బౌలర్లపై చెలరేగారు. బౌండరీలు, సిక్స్‌లతో విరుచుకుపడ్డారు. క్రేజీ షాట్లతో స్కోరు బోర్డును పరిగెత్తించారు. కేవలం 29 బంతుల్లోనే 60పరుగులు చేసి ప్రమాదకరంగా మారుతున్న ఇంగ్లీస్‌ను యశ్ రాజ్ అద్భుతమైన బంతితో క్లీన్ బౌల్డ్ చేశాడు. దీంతో 109 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది.ఇంగ్లీస్ అవుటైన తర్వాత క్రీజులోకి వచ్చిన నికోలస్ పూరన్ (16) ఎక్కువ సేపు నిలవలేదు. లక్నో కెప్టెన్ రిషభ్ పంత్(35) కూడా పరుగులు చేయడానికి ఇబ్బంది పడ్డాడు. మార్ష్‌తో కలిసి 64 పరుగులు జోడించాడు. ఆయుష్ బదానిని ఆర్చర్ డకౌట్ చేశాడు.

**మిచెల్ సెంచరీ మిస్ :** ఒకవైపు వికెట్లు పడుతున్నా మరో ఎండ్ లో ఓపెనర్ మిచెల్ మార్ష్ విధ్వంసకర బ్యాటింగ్‌ను కొనసాగించాడు. రాజస్థాన్ బౌలర్లపై కనికరం లేకుండా విరుచుకుపడిన మార్ష్.. 57 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లతో 96 పరుగులు చేశాడు. అయితే ఇన్నింగ్స్ చివరి ఓవర్ అయిదో బంతికి దురదృష్టవశాత్తూ రనౌట్ కావడంతో కేవలం 4 పరుగుల తేడాతో సెంచరీ చేసే సువర్ణావకాశాన్ని చేజార్చుకున్నాడు.అయినప్పటికీ మార్ష్ ధాటికి లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 220 పరుగుల మార్కును అందుకుంది. రాజస్థాన్ బౌలర్లలో యశ్‌రాజ్ రెండు వికెట్లు పడగొట్టాడు.

# స్వల్పనష్టాలకు పరిమితమైన సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి, మే 19:** స్టాక్ మార్కెట్లు వారంలో రెండోరోజు స్వల్పనష్టాలకు గురయ్యాయి. భారత్‌రూపాయి భారీగా క్షీణించింది. గ్లోబల్‌సెంటిమెంట్ బలహీనపడటంతో ఆరంభ లాభాలు ముగిసే సమయానికి ఆవిరయ్యాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 114.19 పాయింట్లు క్షీణించి 75,200.85వద్ద స్థిరపడగా నిఫ్టీ 31.95 పాయింట్లు క్షీణించి 23,618వద్ద ట్రేడింగ్ ముగించింది. అమెరికా బాండ్లపై రిటర్నులు పెరగడం, ప్రపంచ మార్కెట్‌ధోరణులు మిశ్రమంగా ఉన్న తీరు భారత్ మార్కెట్లపూ చూపింది. రంగాలవారీగాచూస్తే ఐటి స్టాక్స్ కొంత కొనుగోళ్లమద్దతిచ్చాయి.

ప్రైవేటు బ్యాంకులు, ఆర్థిక సంస్థలషేర్లు మాత్రం ఒత్తిడికి లోనయ్యాయి. బిఎస్‌ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.73శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 1.17శాతం చొప్పున లాభపడ్డాయి. బిఎస్‌ఇలో 2590 షేర్లు ముందుకు కదిలితే 1596 షేర్లు క్షీణించాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 96.58వద్ద ముగిసింది. ఒకదశలో 96.61వద్దకుచేరిన రూపాయి చివరకు 96.58వద్ద ట్రేడింగ్ ముగించింది. భారత్‌లో పదేళ్ల బెంచ్‌మార్కు బాండ్లు 0.29శాతం క్షీణించి 7.100కి రిటర్నులుచేరాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్ 5 సెటిల్‌మెంట్‌దరలు రూ.1,59,950కి చేరాయి. అమెరికా పదేళ్ల బాండ్లు కూడా 4.608శాతంగా ఉన్నాయి. కమోడిటీ మార్కెట్లలో జులై నెల సెటిల్‌మెంట్ ధరలు 1.86 డాలర్లు క్షీణించి బ్యారెల్‌కు 110.24 డాలర్లుగా ఉన్నాయి. నిఫ్టీలో ఐటిసూచీ 3.23శాతంపెరిగింది.

మూడు సెషన్లలోను ఈ సూచీ 7.12వాతం ర్యాలీ తీసింది. ఆదాని గ్రూప్‌స్టాక్స్ రివ్వున ర్యాలీ తీసాయి. అమెరికా జస్టిస్ విభాగం ఆదానికేసులు మొత్తం ఉపసంహరించి నట్లు ప్రకటించడంతో కంపెనీ గ్రూప్‌షేర్లు ఒక్కసారిగా పెరిగాయి. ఆదాని గ్రీన్ ఎనర్జీ 0.64శాతం, ఆదాని టోటల్‌గ్యాస్ 2.16శాతం,ఆదాని ఎంటర్ ప్రైజెస్ 1.31శాతం, ఆదాని ఎనర్జీ సొల్యూషన్స్ 0.09శాతం చొప్పున పెరిగాయి. హెచ్‌పిసిఎల్ 3.37శాతం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ 2.42శాతం,బిపిసిఎల్ 2.01శాతం చొప్పున పెరిగాయి. అపోలో మైక్రోసిస్టమ్స్ 9.55శాతంపెరిగింది. ఆఫ్కాన్స్ ఇన్‌ఫ్రా మాత్రం 0.57శాతం దిగజారింది. ఆస్ట్రాల్‌కంపెనీ 6.26శాతం క్షీణిస్తే డూమ్స్ ఇండస్ట్రీస్ కూడా 2.05శాతం నెగిటివ్‌లో ఉంది. జెకె పేపర్ 6.60శాతం పెరిగింది. ఇంద్రప్రస్థ గ్యాస్ కూడా 3.77శాతం పెరిగింది.అలాగే త్రివేణి టర్బైన్ 6.94శాతం, సోమాని సిరమిక్స్ కూడా 12.60శాతం చొప్పున పెరిగాయి. మొత్తంగాచూస్తే కార్పొరేట్ త్రైమాసిక ఫలితాలు కొన్ని కంపెనీలకు సానుకూలం అయితే మరికొన్నింటికి ప్రతికూలంగా మారాయి.

## అమెరికా కోర్టుల్లో

# అదానీకి శాశ్వత ఊరట




**వాషింగ్టన్, మే 19:** బిజినెస్‌మ్యాన్ బిలియనీర్ గౌతమ్ అదానీ, ఆయన సోదరి కుమారుడు సాగర్ అదానీలకు అమెరికా న్యాయస్థానంలో భారీ ఊరట లభించింది. న్యూయార్క్‌లో వారిపై నమోదైన హైప్రొఫైల్ సెక్యూరిటీస్, వైర్ ఫ్రాడ్ క్రిమినల్ కేసులను అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్ శాశ్వతంగా ఉపసంహరించుకుంది. అదానీలపై మోపిన ఆరోపణలను నిరూపించడానికి తగిన ఆధారాలు లేవని, ఈ కేసులో అమెరికాకు ఎటువంటి ప్రత్యక్ష సంబంధాలు కనపడలేదని ప్రాసిక్యూటర్లు తేల్చిచెప్పారు. దీంతో అదానీ గ్రూప్‌పై అమెరికాలో సాగుతున్న అన్ని రకాల చట్టపరమైన విచారణలకు పూర్తిగా తెరపడింది. ఈ కేసును విత్ ప్రిజుడీస్ కింద కోర్టు కొట్టివేసింది. అంటే ఈ కేసును భవిష్యత్తులో మళ్లీ రీఓపెన్ చేయడానికి వీలుండదు. అమెరికా క్రిమినల్ నిబంధనల్లో ఇలాంటి ఉపసంహరణలు చాలా అరుదుగా జరుగుతుంటాయి. ఈ కేసులో మరింత సమయాన్ని, వనరులను వృథా చేయదలచుకోలేదని న్యాయస్థానానికి సమర్పించిన పత్రాల్లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ పేర్కొంది.

2024 చివరలో నమోదైన ఈ కేసు అదానీ గ్రూప్ అంతర్జాతీయ విస్తరణ ప్రణాళికలకు పెద్ద అడ్డంకిగా మారిన తరుణంలో ఈ తీర్పు రావడం గ్రూప్‌నకు కలిసొచ్చే అంశం. భారత్‌లో సౌర విద్యుత్ కాంట్రాక్టుల కోసం అదానీ రూ.2,000 కోట్లకు పైగా లంచాలు ఇచ్చారని, ఆ విషయాన్ని అమెరికా ఇన్వెస్టర్ల వద్ద దాచారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఈ కేసు పూర్తిగా క్లోజ్ కావడానికి ముందు అదానీ గ్రూప్ అమెరికా ప్రభుత్వ విభాగాలతో కొన్ని సివిల్ సెటిల్‌మెంట్లు చేసుకుంది. సోలార్ ప్రాజెక్టుల డిస్‌క్లోజర్ల వివాదంలో గౌతమ్ అదానీ 6 మిలియన్ డాలర్లు, సాగర్ అదానీ 12 మిలియన్ డాలర్ల జరిమానా చెల్లించడానికి యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్‌తో ఒప్పందం కుదుర్చుకొన్నారు.ఇరాన్ నుంచి ఎల్పీజీ దిగుమతుల ద్వారా అమెరికా ఆంక్షలను ఉల్లంఘించారనే ఆరోపణలపై అదానీ ఎంటర్‌ప్రైజెస్ యూఎస్ ట్రెజరీ విభాగానికి 275 మిలియన్ డాలర్లు చెల్లించి ఆ వివాదాన్ని కూడా పరిష్కరించుకుంది. ఈ సెటిల్‌మెంట్లు అన్నింటిలోనూ అదానీ గ్రూప్ తమ తప్పును అంగీకరించకుండానే వివాదాలను ముగించడం గమనార్హం. అదానీ తరపున రంగంలోకి దిగిన సలివన్ క్రామ్‌వెల్ వంటి ఐదు టాప్ అమెరికన్ న్యాయ సంస్థలు ఈ కేసు అమెరికా పరిధిలోకి రాదని గట్టిగా వాదించాయి. నిందితులు భారతీయులు, ప్రాజెక్టులు భారతదేశంలోనే జరిగాయి. బాండ్ల వల్ల ఇన్వెస్టర్లకు ఎలాంటి నష్టాలు రాలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. లంచం ఆరోపణలను మోపడానికి తగిన ఆధారాలు లేకపోవడంతోనే ప్రాసిక్యూటర్లు దీనిని సెక్యూరిటీస్ ఫ్రాడ్‌గా మార్చారని అదానీ లాయర్లు వాదించారు.




## ఆల్‌టైమ్ కనిష్టానికి భారత్ రూపాయి

# డాలర్ వర్సెస్ రూపీ 96.58

న్యూఢిల్లీ, మే 19: భారత్‌రూపాయి మరోసారి ఆల్‌టైమ్ కనిష్టానికి చేరుకుంది. మంగళవారం ఇంటర్‌బ్యాంకు ఫోరెక్స్ కౌంటర్లలో డాలరుతో చెలామణి మరింత బలహీనపడింది. రూ.96.58వద్ద ట్రేడింగ్ ముగిసినతర్వాత మొత్తం 23 పైసలు క్షీణించినట్లు తేలింది. వరుసగా 12వ రోజుకూడా భారత్‌రూపాయి అంతర్జాతీయ మార్కెట్‌లో క్షీణతను ఎదుర్కొంది. ఇంట్రాడేలో రూపాయి 96.61 వరకూ క్షీణించింది.తర్వాత క్రమేపీ బలపడి 96.58వద్దకు చేరింది. ముందు రోజు కూడా భారత్ రూపాయి 96.36వద్ద ఊగిసలాడింది. ఇప్పటివరకూ ఈ ఏడాది భారతరూపాయి డాలర్ మారకంలో ఏడుశాతం క్షీణించింది. కౌంటర్‌ప్రారంభంలో 96.37వద్ద ప్రారంభం అయి ఇంట్రాడేలో 96.61కి చేరాక కొంతమేర నెమ్మదించి చివరకు 96.58వద్ద స్థిరపడింది. ప్రారంభంతో పోలిస్తే 25పైసలు పతనం అయినట్లు తేలింది. ముడిచమురు ధరలు పెరగడం, డాలర్ చెల్లింపులకు భారీ డిమాండ్ ఏర్పడటంతో రూపాయి భారీగా క్షీణించిందని నిపుణులు చెపుతున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు చల్లారకపోవడం కూడా ఇందుకు మరికొంతకారణం అయింది. అమెరికా ఫెడ్‌రిజర్వుకూడా డాలర్ పటిష్టతను కొనసాగించే నిర్ణయాలనే ప్రకటించడంతో ఇతర కరెన్సీలు బలహీనపడటం ప్రారంభించాయి. వీటిలో రూపాయి కూడా ఉంది. డాలర్ పటిష్టం అవుతుండటంతో విదేశీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. దీనివల్ల కార్పొరేట్ రంగానికి కూడా తీవ్రస్థాయిలో మార్జిన్ ఒత్తిడులు ఉండే అవకాశం ఉంది.ఎగుమతి ఆధారిత విభాగాలు కొంతప్రభావిం అవుతాయి. ముడిచమురుధరలు దిగిరానంత వరకూ కూడా రూపాయి క్షీణత కొనసాగుతూనే ఉంటుందని కరెన్సీ నిపుణులు పేర్కొంటున్నారు.

# మెటా, స్టాండర్డ్ చార్టర్డ్ సంస్థల్లో ఉద్యోగులకు లేఆఫ్

## 15వేల మందికిపైగా ఇంటికే!

Meta
standard chartered

**ముంబయి, మే 19:** కార్పొరేట్ బ్యాంకింగ్ సోషల్‌మీడియా రంగాల్లో కూడా కృత్రిమమేధ పెట్టుబడులు భారీగా పెరుగుతుండటంతో మానవవనరుల సంఖ్య రానురాను తగ్గుతోంది. కంపెనీలు కూడా ఉద్యోగులపై అత్యధిక శాతం వేటువేస్తున్నాయి. తాజాగా మెటా సంస్థ పదిశాతం మందిపై లేఆఫ్ ప్రకటిస్తోంది. ఏడు వేలమందిని ఎఐ విధుల్లోకి మారుస్తున్నట్లు చీఫ్ మేనేజర్ జానెల్లె గేల్ తెలిపింది. ఈ లేఆఫ్‌లు, బదలీలు ఈనెల 20నుంచే అమలులో ఉంటాయని తెలిపారు. అలాగే ఎంట్రీలెవెల్‌లో ఎఐ విభాగినికి ఆరువేల కొత్తరోల్స్ తీసుకుంటామని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా మెటాకు 78వేలమంది ఉన్నారు. పదిశాతం అంటే 8వేలమందికి ఉద్వాసన చెపుతోంది.ఇక బదలీలు, లేఆఫ్‌ల పరంగా మొత్తం 20శాతం సిబ్బందిపై ప్రభావం ఉంటుంది. 2022చివరిలో 11 వేలమందిని తొలగించి తర్వాత ఏడాది 10వేలమందికి ఉద్వాసన చెప్పింది. రెండేళ్లలో డేటా సెంటర్ల ఏర్పాటుకు 600 బిలియన్ డాలర్లు వెచ్చించే ప్రణాళిక ఉందని కంపెనీ తెలిపింది. అదేతీరులో స్టాండర్డ్ ఛార్టర్డ్ బ్యాంకు కూడా ఏడువేల మంది ఉద్యోగులపై వేటువేస్తోంది. కృత్రిమమేథ, యాంత్రీకరణ పెద్ద ఎత్తున అమలవుతుండటంతో మానవ వనరుల సేవలు కుదిస్తున్నట్లు సిఇఒ బిల్ వింటర్స్ తెలిపారు. లండన్‌కేంద్రంగా ఉన్న ఈ బ్యాంకు 15 శాతం ఉద్యోగులను కుదిస్తోంది. 52వేల మంది ఉన్న ఉద్యోగుల్లో ఇపుడు ఏడువేలమందిని ఇంటికి పంపిస్తోంది.

ప్రపంచ వ్యాప్తంగా 82వేలమంది పనిచేస్తున్నారు. బ్యాంకుకు భారత్‌లో చెన్నై, బెంగళూరులతోపాటు కౌలాలంపూర్, వార్సా వంటి ప్రాంతాల్లో కేంద్రాలున్నాయి. కృత్రిమమేధ ఆటో మేషన్ వైపు బ్యాంకులు మళ్లుతుండటం వల్లనే ఈ ఉద్వాసన చోటుచేసుకుంటున్నట్లు తేలింది. బ్యాంకు ఎక్కువ మార్జిన్ బిజినెస్‌పై ఫోకస్ పెంచిందని, రిటైల్ బ్యాంకింగ్, వెల్త్‌మేనేజ్‌మెంట్లను కుదించుకుంటూ స్థూల ఆర్థికవ్యవస్థల్లో ఎదురయిన అనిశ్చితి పరిస్థితులను సమతుల్యత కోసమే ఈ లేఆఫ్‌లు ఉంటాయని ప్రకటించింది.

# బిపిసిఎల్‌కు క్షీణించిన లాభాలు!



**ముంబయి, మే 19:** ప్రభుత్వరంగంలోని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ నికరలాభం నాలుగో త్రైమాసికంలో 58శాతం క్షీణించింది. ఆయిల్‌మార్కెటింగ్‌కంపెనీ నికరలాభం రూ.7545 కోట్ల నుంచి రూ.3191 కోట్లకు క్షీణించింది. వన్‌టైమ్ నష్టం కింద రూ.4349.13 కోట్లు కంపెనీపై భారం పడింది. ఆయిల్ గ్యాస్ బ్లాకుల్లో తన పూర్తి అనుబంధ సంస్థ భారీగా తగ్గించింది. బిపిఆర్‌ఎల్ ప్రపంచ బ్యాప్తంగా ఆయిల్, గాస్ బ్లాక్‌ల్లో పెట్టుబడులుపెట్టింది. ప్రత్యక్షంగా కానీ, తన అనుబంధ సంస్థలనుంచి కానీ పెట్టుబడులు ఉంటాయి. కొన్ని బ్లాకుల్లో పెట్టుబడులను పెట్టింది. అదే ప్రభావం ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్‌పైనా చూపించింది. దానితో బిపిఆర్‌ఎల్‌కు 4349.13 కోట్ల నష్టం వచ్చింది. మూడో త్రైమాసికంలో 1.19 లక్షల కోట్లనుంచి స్వల్పంగా తగ్గింది. ఎబిడిటా 14శాతం క్షీణించి 10,061కోట్లకు చేరింది. గత త్రైమాసికంలో 11,677 కోట్లుగా ఉంది. నిఫ్టీలో బిపిసిఎల్ షేర్లు రెండుశాతంపెరిగి రూ.286.45వద్ద ముగిసింది.

# భారత్‌లో పెప్సికో 5700 కోట్ల పెట్టుబడులు




**న్యూఢిల్లీ, మే 19:** శీతల పానీయాల ఉత్పత్తిలో బహుళజాతి సంస్థ పెప్సికో భారత్‌లో వచ్చే ఐదేళ్లలో రూ.5700 కోట్లు పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించింది. 2025 డిసెంబరునాటికి 12నెలల్లోను పెప్సికో ఇండియా నికరలాభం రూ.905 కోట్లు పెట్టుబడులు పెట్టాలనినిర్ణయించింది. కంపెనీ రాబడులు కూడా రూ.9789 కోట్లుగా ఉంటాయి. మధ్యప్రదేశ్, అస్సాం, తమిళనాడు కేంద్రాల్లోని యూనిట్లలో ఈ పెట్టుబడులు ఉంటాయని కంపెనీ ప్రకటించింది. పెప్సికోకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 13 మార్కెట్లలో భారత్ ప్రధానమైనదని అందువల్లనే భారత్‌లో మరింత విస్తరించదలిచినట్లు వెల్లడించింది. మధ్యప్రదేశ్‌లోని కాన్సెన్‌ట్రేట్స్ ప్లాంట్, అస్సాం, తమిళనాడుల్లోని స్నాక్స్ ప్లాంట్లలో పెట్టుబడులుంటాయని తెల్పారు. పెప్సికో దక్షిణాసియా సిఎఫ్ఒ సవితా బాలచంద్రన్ మాట్లాడుతూ కంపెనీ గత ఏడాది శరవేగంగా వృద్ధిని నమోదుచేసిందని, ఆహార ఉత్పత్తుల సెగ్మెంట్‌మరింతగా వృద్ధినమోదుచేసి వాణిజ్యం 11శాతంపెరిగిందన్నారు.ప్రస్తుతం క్యాష్ ఆన్ రికార్డ్ రూ.1600 కోట్లవరకూ ఉందని, అందుకే విస్తరణపెట్టుబడులపై ఫోకస్ ఫెంచినట్లు తెలిపారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.